SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL
ILLUSTRATED MONTHLY
Volume: 53, Issue: 10
March-2023, Price Rs. 20/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

మార్చి 2023
వెల రూ.20/-
పుటలు-56



## శ్రీరామరక్ష సర్వజగద్రక్ష

తిరుపతి శ్రీకోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు
(2023, మార్చి 20 నుండి 28 వరకు)

# శ్రీబాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన మరియు పునరావాస కేంద్రము (బర్డ్)





పోలియో మెల్లిటస్, సెరిబ్రల్ పాల్సీ, జన్మతః వచ్చే రుగ్మతలు, వెన్నెముక సంబంధమైన గాయాలతో బాధపడే వారికి మరియు ఎముకలు, కీళ్ళ పరమైన అంగవైకల్యం కలిగిన రోగులకు పూర్తిస్థాయిలో ఉచితంగా సేవ చేయడానికి అత్యాధునిక వైద్య పరికరాలతో **'బర్డ్'** సంస్థ స్థాపించబడింది.

ఈ వైద్యసంస్థకు మానవతాదృక్పథంతో మీ వంతు సహాయ సహకారాలను విరాళాలరూపంలో అందించండి.

'మానవసేవే మాధవసేవ'



అధికరణం 80 (జి) క్రింద ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వబడుతుంది.

మీరు మీ విరాళాలను 'The Executive Officer, TTD' గారి పేర తీసిన డిమాండు డ్రాఫ్ట్ / చెక్కులు పంపవలసిన చిరునామా


'ఉపకార్యనిర్వహణాధికారి (దాతల విభాగం),
కేంద్రీకృతదాతల నిర్వహణ సెల్, ఆదిశేషు విశ్రాంతి భవనం,
అదనపు కార్యనిర్వహణాధికారి క్యాంపు కార్యాలయం ప్రక్కన,
తిరుమల, ఫోన్ నెం.0877-2263472

(లేదా)

ది డైరెక్టరు, బర్డు ట్రస్టు, తి.తి.దేవస్థానములు, తిరుపతి-517 501,
ఫోన్ నెం. 0877-2264025, 0877-2264619,



Website : www.tirumala.org,
e-mail : officebirrd@gmail.com
Mobile App : BIRRD HOSPITAL



## గీతాశ్లోకార్థసారం

**శ్లో : కుతస్త్వాకశ్మలమిదం విషమే సముపస్థితమ్ ।**
**అనార్యజుష్టమస్వర్గ్యమ్ అకీర్తికరమర్జున ॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం- 02వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** అర్జున= ఓ అర్జునా!; విషమే= (ఇట్టి) విపత్కర సమయంలో; త్వా కుతః= నీకు ఎట్లు?; ఇదం కశ్మలమ్= ఇట్టి పాడుబుద్ధి; సముపస్థితమ్= పుట్టింది?; యతః= ఎట్లంటే, ఇది; అనార్యజుష్టమ్= ఆర్యధర్మవిరుద్ధము; అస్వర్గ్యమ్= నరకప్రాప్తిహేతువు; అకీర్తికరమ్= అపకీర్తిదాయకము.

**భావం:** అర్జునా! ఈ విపత్కర సమయంలో ఆర్యధర్మ విరుద్ధమూ, అపకీర్తిదాయకమూ, నరకప్రాప్తి హేతువూ అయిన ఇటువంటి వ్యామోహము నీకు ఎందుకు ఏర్పడింది?

## సర్వఫలదము రామనామము

జపియించరె సర్వజనులు యీ నామము తమ
రవమునో పుణ్యాలకు రామనామము

శాంతికరము రామచంద్ర నామము
భ్రాంతు లణచు రామభద్రనామము
వింతసుఖ మిచ్చు రఘువీర నామమూ, భూమి
చింత దీర్చునదివో శ్రీరామనామము

కలిదోషహరము రాఘవనామము సర్వ
ఫలదము సీతాపతి నామము
కులక శోభనము కాకుత్థ్సనామము అని
రలమైన దిదివో రామనామము

గుమితమైనది రఘుకులనామము అతి
సుముఖము దశరథసుత నామము
అమితమై శ్రీవేంకటాద్రి నాయకుడై
రమియించె యీతని రామనామము

(సంపుటం-15, సంకీర్తన-43)





*'ప్రతి ఒక్కరూ రామనామము జపించి పుణ్యమును పొందండి' అని అన్నమయ్య బోధిస్తున్నాడు. "రామనామము శాంతి కల్గిస్తుంది. భ్రాంతులు తొలగిస్తుంది. సుఖము చేకూరుస్తుంది. చింతలు తీరుస్తుంది. కలిదోషమును హరింపజేస్తుంది. కోరినవారికి ఫలములిస్తుంది. శుభము చేకూరుస్తుంది. సంతోషము కల్గిస్తుంది. మిక్కిలి సుముఖ మైనది, అందరి మనస్సును రమింపజేసేది రామనామము" అని చక్కగా తెలియజేశాడు అన్నమాచార్యుడు.*

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

## ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

(తెలుగు, తమిళం, కన్నడం, హిందీ, ఆంగ్లం, సంస్కృతభాషలు)

'సప్తగిరి' పట్ల మీరు చూపిస్తున్న అభిమానం అనన్యసామాన్యం.
తి.తి.దే.కి, పాఠకులకు మధ్య వారధిలా ఉన్న సప్తవర్ణ 'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక.

సెప్టెంబరు, 2022 నుండి
'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక వెలలో మార్పు అమలులోకి వచ్చింది.

ఇది నూతన చందాదారులకు
మాత్రమే ఈ మార్పు వర్తిస్తుంది.



### చందా వివరాలు

విడిప్రతి- రూ.20/-
సంవత్సర చందా- రూ.240/-
జీవిత చందా(12 సం॥లకు మాత్రమే)- రూ.2400/-
విదేశాలకు సంవత్సర చందా- రూ.1030/-



శ్రీవారి అక్షరప్రసాదాన్ని
నెలనెలా అందుకోండి!

మీ ఇంటికే శ్రీవారు వచ్చిన
అనుభూతిని పొందండి!!

'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రికకు
చందాకట్టండి! చందాకట్టించండి!!

వివరాలకు: ప్రధాన సంపాదకుడు,
తి.తి.దే.ప్రెస్ ప్రాంగణం, కే.టి.రోడ్డు, తిరుపతి-517 507.
ఫోన్: 0877-2264363, 2264543

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 53 మార్చి, 2023 సంచిక : 10



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥

**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
డా॥ ఎ.సంధ్య
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| శ్రీలక్ష్మి జయంతి | శ్రీ అనంతాత్మకుల రంగారావు | 07 |
| శ్రీరామావతారం ఎందుకు వచ్చింది? | డా॥ అన్నదానం చిదంబరశాస్త్రి | 10 |
| వెలుగుల నిధి | శ్రీ జంధ్యాల శరత్‌బాబు | 12 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 14 |
| వేదవిజ్ఞాననిధి 'అష్టావక్రమహర్షి' | సద్గురు శ్రీశ్రీశ్రీ శివానందమూర్తి | 15 |
| వెన్నెలకు కొలలేదు-అన్నమయ్య కీర్తనకి వెలలేదు | డా॥ అద్దంకి శ్రీనివాస్ | 17 |
| కాంచీపూర్ణులు తిరుక్కచ్చినంబి | డా॥ పి.టి.జి.వై.రంగరామానుజాచార్యులు | 19 |
| ఉపనిషత్తుల పరమార్థం | శ్రీ దావులూరి రామకృష్ణ | 20 |
| ప్రబంధప్రసిద్ధులు శ్రీకులశేఖరాళ్వారులు | డా॥ ఐ.ఎల్.ఎన్.రాజేష్ | 21 |
| శ్రీవారి సన్నిధిలో... శ్రీరామనవమీ ఆస్థానం | | 22 |
| మహాసాధ్వి సుకన్య | డా॥ ఎస్.లక్ష్మి | 23 |
| తిరుచ్చే రై | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| శ్రీరామచంద్రచరణౌ శరణం ప్రపద్యే | డా॥ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు | 28 |
| వేదం 'శ్రీమహాలక్ష్మి' | డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు | 31 |
| మత్స్యవిభూతి | డా॥ సూరం శ్రీనివాసులు | 33 |
| కర్తవ్య నిర్వహణ | డా॥ కె. రామానుజాచార్యులు | 35 |
| శ్రీకోదండరామస్వామిఆలయం, తిరుపతి | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 37 |
| మనలను రక్షించే "కేశవాదిద్వాదశ నామాలు" | డా॥ ఎం.వేంకటాచార్యులు | 40 |
| అదితి ఆచరించిన 'బ్రహ్మోదనం' | శ్రీమతి ఈ.విజయలక్ష్మి | 41 |
| దర్శనమిచ్చిన దేవుడు | శ్రీ ఆదూరి శ్రీనివాసరావు | 43 |
| గచ్చకాయల్లో ఔషధ గుణాలు పుష్కలం | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 44 |
| శ్రీకృష్ణామృతం | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 45 |
| సజ్జనులహృదయం (విశ్వదాభిరామం) | కీ.శే. విద్వాన్ కట్టానరసింహులు | 46 |
| భాస్కర శతకం | డా॥ పల్లేరు వీరాస్వామి | 46 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>నిర్వహణ- మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 47 |
| మత్స్యావతారం (చిత్రకథ) | కథ: శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు: శ్రీ ద్వారకనాథ్ | 48 |
| వివేక మార్గంలో.. నడవాలి | 'ఉషశ్రీ' | 50 |
| బాలవినోదం | డా॥ అల్లాడి సంధ్య | 51 |
| క్విజ్ (08) | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : శ్రీకోదండరామస్వామివారు, తిరుపతి
వెనుకచిత్రం : ఉభయదేవేరులతో శ్రీవేదనారాయణస్వామివారు, నాగులాపురం

ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333



వెబ్‌సైట్- www.tirumala.org; 'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

# పరిపూర్ణతకు మరోపేరు 'స్త్రీ'

**ఉపాధ్యాయాన్ దశాచార్య, ఆచార్యాణాం శతం పితా।**
**సహస్రం తు పితౄన్, మాతా గౌరవేణాతిరిచ్యతే॥ (మనుస్మృతి-02-145)**

'పదిమంది ఉపాధ్యాయులకంటే ఒక ఆచార్యుడు- వందమంది ఆచార్యులకంటే తండ్రి- వెయ్యి మంది తండ్రులకంటే "తల్లి" పరమపూజనీయురాలు' అని మనుధర్మశాస్త్రవచనం. ప్రపంచంలోని మరే ఇతరదేశం స్త్రీకి ఇవ్వని సమున్నతస్థానాన్ని మనదేశమే ఇచ్చింది.

భారతదేశం స్త్రీమూర్తిని- దేవతగా, తల్లిగా, సోదరిగా, గృహిణిగా, సహధర్మచారిణిగా అనేకానేక గౌరవ ఆదరాలకు పాత్రురాలిగా భావించింది. అంటే కరుణతో లాలించినా, కర్తవ్యదీక్షతో పాలించినా, తల్లిగా దీవించినా, ధర్మపత్నిగా నడిపించినా- 'ఆమెకు ఆమే సాటి'. కాబట్టి జగత్సృష్టి అంతా ఆమె కనుసన్నల్లోనే నడుస్తోంది. అందుకే ఇంద్రుడు 'త్వత్కళా సర్వయోషితా'- "హే జగన్మాతా! ప్రతి స్త్రీలో నీ కళ ఉందమ్మ" అని అమ్మవారిని స్తుతించాడు.

స్త్రీలు కుటుంబాన్ని నిర్వహించడంలో ప్రధానపాత్ర పోషిస్తారు. యజ్ఞయాగాది క్రతువుల్లో భార్య ప్రక్కన ఉంటేనే ఆ పురుషుడు దాన్ని నిర్వర్తించగలడు. కాబట్టే రామాయణం ఉత్తరకాండలో రాముడు అశ్వమేధయాగంలో బంగారుసీత ప్రతిమను పెట్టుకొని పూర్తిగావించాడు. 'స్త్రీలను జగన్మాతగా గౌరవించాలి' అని ఋషులు చెప్పేమాట అక్షరసత్యం. 'స్త్రీని అవమానించితే ఆ వ్యక్తికి పుట్టగతులు ఉండవు' అని చెప్పడానికే మన భారతావనిలో రెండు ఇతిహాసాలు పుట్టాయి- రావణుడు ఒక పతివ్రతా శిరోమణిని అవమానించాడు. సమూలంగా నాశనమయ్యాడు. నిండు కొలువులో ఒక సాధ్విని అవమానించిన కారణంగా కౌరవులు మొత్తం దగ్ధమయ్యారు.

సృష్టికి మూలాధారశక్తి స్త్రీ. ఏ దేశంలో అయితే స్త్రీలను గౌరవిస్తారో ఆ దేశం సకలసంపత్తులతో వెల్లివిరుస్తుంది. మనిషి ధర్మమార్గ జీవనానికి విష్ణుతత్త్వం సంకేతం. ఇహపరాలసుఖానికి, మోక్షప్రాప్తికి కూడా ఇదే సంకేతం. అష్టలక్ష్ముల సమాహారమే 'మహాలక్ష్మి'. ఆమెకు తన హృదయంలో స్థానమిచ్చి లోకానికి గొప్ప సందేశాన్నిచ్చాడు శ్రీమహావిష్ణువు. 'పరా-పశ్యంతీ-మధ్యమా-వైఖరీ' అని వాక్కు నాలుగురూపాలు. ఈ నాలుగూ తన పత్ని సరస్వతి స్వరూపాలుగా బ్రహ్మ తన నాలుగుముఖాలలో ఉంచుకుని విశ్వానికి 'భార్యను వాగధీశ్వరిగా సంభావించండి' అని చాటి చెప్పాడు. 'జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ' అని శివుడు పార్వతికి తన శరీరంలో ఎడమ వైపు అర్ధభాగం ఇచ్చి, 'భార్య భర్తలో సగభాగం' అని జగత్తుకు స్పష్టం చేశాడు.

ఈ విధంగా బ్రహ్మ-విష్ణు-మహేశ్వరులు స్త్రీని తమ జీవితభాగస్వామినిగానే చెపుతూ, తమ హృదయం, మాట, శరీరములన్నీ ఆమె శక్తివల్లనే చైతన్యవంతులవుతున్నాయని నిరూపణ చేశారు. ఈనాడు సమాజంలో స్త్రీని మరొకవిధంగా భావించి, మానవుడు పాశవిక ప్రవృత్తితో ప్రవర్తించడం దురదృష్టకరం. పాశవికంగా ప్రవర్తించేవారికి కఠినమైన శిక్షలు విధిస్తే తప్పు లేదని మనువు స్మృతిరూపంలో స్త్రీకి అండగా నిలిచాడు.

భారతజాతి స్త్రీని ఒక మనిషిగా కాక సమాజానికి స్ఫూర్తినిచ్చే శక్తిగా తలచి, గౌరవించింది. ఎన్నోయుగాలనాడే మహిళకు సర్వోన్నత గౌరవం ఇచ్చిన మన సంస్కృతిని మన వారసత్వ సంపదని కాపాడుకుందాం.

*'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః'*

# శ్రీలక్ష్మి జయంతి

- శ్రీ అనంతాత్మకుల రంగారావు,
79894 62679

మార్చి 7 శ్రీలక్ష్మిజయంతి సందర్భంగా..

ప్రతీ సంవత్సరం ఫాల్గుణమాసంలో శుక్ల పక్ష పౌర్ణమి రోజున మనం శ్రీమహాలక్ష్మిజయంతిగా జరుపుకుంటున్నాము. సరిగ్గా ఈరోజే అంటే పౌర్ణమినాడు ఈ వైవస్వత మన్వంతరంలో క్షీర సాగరమథనం నుండి ఆవిర్భవించింది. ఆమె విశ్వజననిగా విరాజిల్లుతోంది. శ్రీలక్ష్మీస్తవంలో-

జ్ఞానదాయైః బుద్ధిదాయైః సర్వదాయైః నమోనమః ।
హరిభక్తిః ప్రదాయిన్యైః ముక్తిదాయైః నమో నమః ॥

అని కీర్తిస్తూ ఉంటాం. అంటే "జ్ఞానాన్ని, బుద్ధిని ప్రసాదించేది ఈ విశ్వవ్యాప్తంగా భౌతికమైన సంపదలను ప్రసాదించేది, హరిభక్తిని ప్రసాదించేది, ముక్తిని కలిగించే లక్ష్మీదేవిని ప్రార్థిస్తున్నాను" అని. ఇటువంటివన్నీ సమకూర్చే తల్లి ఆవిర్భవించిన "శ్రీలక్ష్మీజయంతి" మనకు ఎంతో ప్రాముఖ్య మైనది. అందుకే ప్రతీఒక్కరూ శ్రీలక్ష్మీజయంతిని పండుగలా చేసుకోవాలి.

## శ్రీలక్ష్మిజయంతిని ఎలా చేసుకోవాలి?

ఉదయాన్నే స్నానానంతరం, మనం నిత్యంచేసే అనుష్ఠానం పూర్తి అయిన తర్వాత, సంకల్పం చెప్పుకొని, విఘ్నేశ్వరపూజ, ప్రాణాయామమంత్రం, కలశారాధన, ధ్యానం, ఆవాహనంవంటి షోడశవిధానాలతో అర్చించాలి. సాయంత్రం పూటకూడా లక్ష్మీదేవికి దీపారాధన చేసి, పూజించి, నైవేద్యం సమర్పించాలి. కొందరు అనుకోవచ్చు దీపావళినాడు లక్ష్మీ పూజ చేస్తున్నాము కదా! అని. మరికొందరు శ్రావణమాసంలో వరలక్ష్మీపూజ చేసుకొని, నాలుగు శుక్రవారాలు లక్ష్మిని ఆరాధి స్తున్నాము కదా! అనీ భావించవచ్చు. మన ఇంట్లో పుట్టినరోజు వేడుకలు జరుపుకొంటుంటాము. అలా ఆనందంగా, సంతో షంగా జరుపుకొనే అదృష్టాన్ని, సంపదను కలిగించిన శ్రీలక్ష్మీ జయంతి చేసుకోవడం మన కర్తవ్యం. ఆమె కరుణ, చూపు మనపై ఉండాలంటే, ఆమెను కొలవాలి. అంతేకాక, కొన్ని పద్ధతులు కూడా అనుసరించాలి. పద్ధతులు తెలుసుకొని ఆచరిద్దాం.

## శ్రీలక్ష్మీదేవి జననం రహస్యం...

శ్రీలక్ష్మీదేవి ఒక్కొక్క మన్వంతరంలో ఒక్కొక్క రూపంతో ఆవిర్భవించినట్లుగా పురాణాలు చెప్తుతున్నాయి. స్వాయంభువ మన్వంతరంలో భృగుమహర్షి- ఖ్యాతి దంపతుల పుత్రికగా జన్మించింది. భృగుమహర్షికి-ఖ్యాతి దంపతులుకు కుమారులు జన్మించారు. కూతురు కావాలనే బలమైన కోరిక ఖ్యాతి యందు ఉండేది. అందుకు ఆమె ఘోరమైన తపస్సు చేసి, బ్రహ్మ అను గ్రహంతో పుత్రికకు జన్మనిచ్చింది. ఆమెకు 'శ్రీలక్ష్మీ' అని నామ కరణం చేశారు. భృగువు పుత్రిక కాబట్టి ఆమెకు **'భార్గవి'** అనే పేరు కూడా సార్థకమయ్యింది. ఆమె యుక్తవయసులో ఉండగా, నర-నారాయణులలో నారాయణుని శక్తి, ధైర్యం గురించి విని, వరించింది. ఈ వృత్తాంతం కృతయుగంలో జరిగిన సంఘటన. అయితే ప్రస్తుతం నడుస్తున్న మన్వంతరంలో క్షీరసాగర మథనం నుంచి ఆవిర్భవించింది. అందుకే మనం శ్రీలక్ష్మీఅష్టోత్తర శత నామావళిలో-

*"లక్ష్మీం క్షీరసముద్ర రాజ తనయాం, శ్రీరంగధామే శ్వరీం"* అంటూ స్తుతిస్తుంటాము కదా! శ్రీమహావిష్ణువు భార్యేమిటి? క్షీరసాగరమథనంలో ఆవిర్భవించడమేమిటి? అని మీరు భావిస్తున్నారు కదా! అందుకే ఆ విషయం తెలుసు కొందాం.

ఒకనాడు అత్రిమహర్షి కుమారుడు అయిన దుర్వాస మహర్షి భూమండలం అంతా తిరుగుతూన్న సందర్భంలో ఒక దేవకాంత కనపడింది. ఆమెచేతిలో సువాసనలు వెదజల్లే ఎప్పుడూ వాడిపోని పూలమాల ఉంది. దాన్నిచూసి ముచ్చట పడి, దుర్వాస మహర్షి తనకు ఇవ్వమని కోరగా, ఆ దేవకాంత

సంతోషంగా ఆయనకు ఇచ్చింది. ఆయన సంచరిస్తూ, స్వర్గలోకా నికి వెడుతున్న సందర్భంలో, దారిలో ఇంద్రుడు తన ఐరావతం అనే ఏనుగుపై వస్తూ ఎదురుపడ్డాడు. దుర్వాసమహర్షి తన దగ్గర ఉన్న మాలను దేవేంద్రునకు ఇవ్వగా, ఇంద్రుడు తన వాహనమైన ఐరావతంకు ధరింప జేయగా, ఆ ఏనుగు ఆ మాల నుండి వచ్చే వాసనలు భరించలేక, చెల్లా చెదురు చేసేసింది. దాంతో దుర్వాస మహర్షి క్రోధంతో "నేను నీమీద గౌరవంతో ఆ దేవకన్య ఇచ్చిన మాలను నీకు ఇస్తే, ఎంత అవ మానం చేశావు. దాని విలువ నీకు తెలియదు. నీ సంపదను చూసుకొని నీలో అహంకారం పెరిగింది. నువ్వు చేసిన ఈ మహాపాపానికి, త్రిభువన సామ్రాజ్య సంపద నశించుగాక! నీ పాలనలో ఉన్న లక్ష్మి మూడు లోకాల్లో హీనమగుగాక!" అంటూ శపించాడు.

దుర్వాసుడి శాపం వల్ల మూడులోకాల్లోని లక్ష్మి వెడలి పోసాగింది. లోకాలన్నీ తేజస్సును కోల్పోయి, కళావిహీనంగా మారాయి. దాంతో దానవులు దేవతల మీదకు దండయాత్ర చేసి, ఇంద్రపదవి అలం కరించారు. దేవతలు శ్రీహరిని ప్రార్థించగా, ఆయన "దానవులుతో సంధి కుదుర్చుకుని, వారంతా క్షీరసాగరమథనం చేస్తే, అమృతం సిద్ధిస్తుంది. అపుడు మీకు అమృతత్త్వం వస్తుంది. అలాచేయండి" అని కొన్ని సూచనలు చేసి పంపాడు.

అపుడు దేవతలు, రాక్షసులు కలిసి క్షీరసాగరమథనం చేశారు. ముందుగా కామధేనువు, పారిజాత వృక్షం, అప్సరస గణాలు, చంద్రుడు, కాలకూటవిషం ఆవిర్భవించాయి. ఆ తర్వాత అమృతభాండం ధరించిన ధన్వంతరి ఆవిర్భవించాడు. తరువాత తామరపువ్వుమీద కూర్చొని, సర్వాలంకారశోభిత అయిన మహాలక్ష్మి ఆవిర్భవించింది. మంగళకారిణి అయిన ఆమెను దేవతలు, ఋషులు, అందరూ చూసి ఆనందంతో శ్రీసూక్తంతో స్తుతించారు. ఆమె రాక సందర్భంగా విశ్వావసు గంధర్వులు గానం చేయగా, అప్స రసలు నాట్యం చేశారు. గంగాది నదులు అన్నీ అభిషేకం చేశాయి. క్షీరసాగరుడు పట్టువస్త్రాలు, దేవశిల్పి విశ్వకర్మ దివ్యమైన ఆభరణాలు, బంగారు సింహాసనం తీసుకుని రాగా ఆమెను, బ్రహ్మ, పరమేశ్వరుడు, విష్ణువు, దేవతలు ఈ జగత్తుకే రాణిగా, పట్టాభిషేకం చేశారు. బ్రహ్మ అందరికీ తెలిసేటట్లుగా, ఈ మహాలక్ష్మికి తగిన భర్త శ్రీమహా విష్ణువేనని ప్రకటించి, విష్ణుమూర్తి దగ్గరకు తీసుకొని వెళ్ళగా ఆమె, తన చేతిలోని పుష్పాలహారం వేయగా, అందరి సమక్షంలో బ్రహ్మపురోహి తుడుగా, ఘనంగా కల్యాణం జరిగింది.

అపుడు శ్రీలక్ష్మీదేవి "స్వామి! నన్ను మీరు ఎప్పుడూ విడవకండి. మీ హృదయమే నాకు తగిన స్థానం. మీ ఆజ్ఞలు శిరసావహిస్తాను" అని వినయంగా పలికింది. అపుడు దేవత లకు పూర్వపు తేజస్సు, శక్తి వచ్చాయి. మూడులోకాల్లోను చైతన్యం వచ్చింది. ఇంద్రుడు తన పదవిని అలంకరించారు. ఇది సూక్ష్మంగా లక్ష్మీజననం చరిత్ర.

### శ్రీలక్ష్మి అవతారాలు విశిష్టత

**శ్రీమహావిష్ణువు అర్ధాంగి అయిన తర్వాత, శ్రీహరి ఎన్నో అవతారాలు ధరించాడు. మహాభాగవతం ప్రకారం రుచి ప్రజాపతికి, భార్య ఆకూతికి 'సుయజ్ఞుడు' అనే పేరుతో విష్ణువు జన్మిస్తే, అతని భార్యగా శ్రీలక్ష్మీదేవి 'దక్షిణ' అనే పేరుతో జన్మించింది.**

**విష్ణువు 'పృథుచక్రవర్తి'గా అవతరించినపుడు, శ్రీలక్ష్మీదేవి ఆయనభార్య 'అర్చి'గా అవతరించింది. నాభికి - మేరుదేవికి విష్ణువు 'ఋషభుని'గా అవతారం ఎత్తితే, అతని భార్య 'జయంతి'గా శ్రీలక్ష్మి అవతరించింది. వరాహావతారంలో భూదేవిగా శ్రీలక్ష్మిఅవతరించింది. శ్రీరామావతారంలో సీతగా, శ్రీకృష్ణావతారంలో రుక్మిణిగా, కలియుగంలో మహావిష్ణువు శ్రీనివాసుడుగా అవతరిస్తే పద్మావతిగా శ్రీలక్ష్మి అవతరించింది.**

### లక్ష్మీస్థానాలు (మహాభారతం ఆధారంగా..)

ఒకసారి నారదమహర్షి వైకుంఠం సందర్శించిన సందర్భంలో లక్ష్మీదేవితో "అమ్మా! జగన్మాత! లోకంలో కొంతమంది సిరిసంపదలుతో తులతూగుతూ ఉంటారు. మరి కొంతమంది లేమితనంతో బాధపడుతూ ఉంటారు. దీనికి

కారణం ఏమి? నీ కరుణాకటాక్షాలు అందరిమీదా ప్రసరింప చేయవా? తల్లీ" అని అడిగాడు.

అపుడు శ్రీలక్ష్మీదేవి బదులిస్తూ- "ఓ మహర్షీ! లక్ష్మి అంటే ధనం, సంపదలు మాత్రమే కాదు. శుచీ-శుభ్రత; సరళత, అందం, ఇతరుల సంపద చూసి అసూయ చెందకపోవడం, ఉన్నదాంట్లో నిరుపేదలకు దానం చేయడం వంటివి కూడా శ్రీలక్ష్మీ ప్రదములే. ఎందుకు వ్యత్యాసాలు అని అడిగారు కదా మహర్షీ! మానవులు సత్కర్మలు చేస్తూంటే, ధర్మం వారిని అంటిపెట్టుకుని ఉంటుంది. వారి జీవనవిధానం ధర్మంగా సాగుతుంది. వారంతా శ్రీలక్ష్మీప్రదులే. దుష్కర్మలు చేసేవారిలో అధర్మం అంటిపెట్టుకుని ఉంటుంది. అసత్యం చెప్పడం, దురలవాట్లు, బాధ్యతారాహిత్యంవంటివి ఉన్నప్పుడు నేను దరిచేరను. వారికి దూరంగా ఉంటాను.

నిత్యం సత్యమే పలికేవారు, బాహ్య-అంతరశౌచాలతో ఉండేవారు, ఇంద్రియ నిగ్రహం కలవారు, స్వచ్ఛమైన మనస్సు కలవారు, పెద్దలను తల్లిదండ్రులును, గురువులను గౌరవించేవారు, మొదలుగా సుగుణాలు ఉన్నారంటే నాకు ఇష్టం. నా అనుగ్రహం ఎల్లప్పుడూ ఉంటుంది" అంటూ ఇంకా ఇలా చెప్పసాగింది.




"పూలలో, చెట్లలో, క్షీరసముదాయపదార్థాలయందు, గృహనీతికల స్త్రీలయందు నివసిస్తూ ఉంటాను. చంచల స్త్రీలు అన్నా, భర్తను అలక్ష్యంగా చూసేవారన్నా, నేను ఇష్టపడను సుమా! కేవలం సంపద ఉన్నంత మాత్రాన లక్ష్మి ఉన్నట్టు కాదు. వారిలో అహంకారం, అశాంతి ఉండకూడదు. నేను ఇష్టపడను. నారదమహర్షి! "ధర్మంగా జీవించడమే లక్ష్మీప్రదం" అని వివరించింది. ఈ విధంగా లక్ష్మీజయంతి గురించి, ఆమె జననం గురించి, అవతార విశేషాలు, లక్ష్మీస్థానాలు తెలుసుకున్నాం కదా! లక్ష్మీకటాక్షంకోసం మనం మంచిపనులు చేస్తూ, ధర్మంగా జీవిద్దాం.

ఓం శ్రియై నమః


**శ్రీమద్రామాయణ పారాయణం**

**తిరుమల 'నాదనీరాజనమండపం'లో ప్రతిరోజు ఉ॥ 7 గం॥ నుండి 8 గం॥ వరకు జరిగే 'శ్రీమద్రామాయణం- బాలకాండము' పారాయణాన్ని 'శ్రీవేంకటేశ్వరభక్తిఛానల్' లో వీక్షించండి, పారాయణం చేయండి, తరించండి!!**

# శ్రీరామావతారం ఎందుకు వచ్చింది..?



- డా॥ అన్నదానం చిదంబరశాస్త్రి,
98486 66973

అయోధ్యానగరానికి రాజైన దశరథుడు సంతానం పొందటం కోసం 'పుత్రాకామేష్టి' అనే యాగం చేయసాగాడు. ఋత్విక్కుల మంత్రబలం, దశరథుని భక్తిశ్రద్ధల కారణంగా ఆహ్వానింపబడిన దేవతలంతా హవిస్సులు స్వీకరించుటకు అక్కడ చేరి ఉన్నారు. రావణాదుల బాధలనను భవిస్తున్న దేవతలు శ్రీమన్నారాయణునితో 'మహావిష్ణూ! లోకకల్యాణకాంక్షతో రావణాదుల వధకొరకై మీరు ఈ దశరథ మహారాజుకు జన్మింప వలసినది' అని కోరారు. శ్రీమన్నారాయణుడు అందుకు అంగీకరించాడు. దేవతలకు ఇచ్చిన మాట ప్రకారం శ్రీహరి కౌసల్యాదశరథులకు కుమారునిగా శ్రీరామచంద్రునిగా చైత్రశుద్ధనవమినాడు జన్మించాడు.

సనకసనందనాదుల ఆగ్రహానికి గురియైన వైకుంఠ ద్వారపాలకులు జయవిజయులు త్రేతాయుగంలో భూలోకంలో రావణకుంభకర్ణులుగా జన్మించారు. రావణుడు బ్రహ్మను గూర్చి ఘోరమైన తపస్సు చేసి మరణం లేకుండా వరమిమ్మన్నాడు. జీవికి మరణం తప్పనిది కాబట్టి మరియొక వరం కోరుకో మన్నాడు బ్రహ్మ. రావణుడు తనకు దేవతలు, రాక్షసులు, యక్ష కిన్నర కింపురుషులు, పశుపక్ష్యాదులు దేనివలనా మరణం లేకుండా వరం కోరుకొన్నాడు. కానీ మనుష్యుని గూర్చి లెక్కలేని తనం కారణంగా మనుష్యుల చేతిలో చావకుండా వరం కోరు కోలేదు. అందువలన రావణుడు మనుష్యుని చేతిలోనే మరణిస్తాడు కాబట్టి నారాయణుడు మనుజునిగా శ్రీరామునిగా అవతరించాడు. అంటే రావణాదుల వధకోసమే రామావతారం ఏర్పడినట్లు అర్థమవుతుంది. కాని రామునిగా అవతరించటంలో మరో ముఖ్యమైన పరమార్థం ఉంది. నిజానికి అదే మనం అవశ్యం స్వీకరింపదగినది కూడా.

శ్రీమన్నారాయణుడు మానవావతారం ఎత్తిన కారణాన్ని శాస్త్రం ఇలా చెప్పింది. ***"మర్త్యావతార స్త్విహ మర్త్యశిక్షణం, రక్షోవధాయైవ న కేవలం విభోః॥"*** అని. అంటే 'నారాయణుడు మానవులకు ఎలా బ్రతకాలో శిక్షణనీయటంకోసం శ్రీరామునిగా మానవావతారం ఎత్తాడు తప్ప, కేవలం రాక్షసులను సంహరించటం కోసం మాత్రమే కాదు' అని దాని అర్థం. కాబట్టి ఆయనను ఆదర్శంగా తీసికొని మానవులు జీవించాలి. ఉత్తమ మానవుని ఆదర్శజీవితాన్ని సమాజం ముందుంచవలసిన వాడు కాబట్టే వాల్మీకి నారదుని ***'కోన్వస్మిన్ సాంప్రతంలోకే- గుణవాన్ కశ్చవీర్యవాన్'*** అంటూ పదహారు లక్షణాలు కల మహనీయుడు ఈ లోకంలో ఇప్పుడు ఎక్కడున్నాడు? అని అడిగాడు. నారదుడు ఇక్ష్వాకువంశంలో పుట్టిన శ్రీరాముడను వ్యక్తి అటువంటి గుణాలు కలవాడని చెప్పగా, వాల్మీకి రామాయణం రచించాడు.

రావణవధ కొరకు మాత్రమే ఆయన అవతారమైతే ఆ చెప్పిన అన్ని గుణాలు అవసరం లేదు. ఉత్తమ ఆదర్శమానవుని సమాజం ముందు ఉంచ నెంచినందువల్లే అటువంటి గొప్ప లక్షణాలను రామునిలో చూచాడు, చూపాడు. కాబట్టి ఆయనను ఆదర్శంగా తీసికొని మానవులు జీవించాలి. రాముని జీవితంలో వచ్చిన సంఘటనలన్నీ మన జీవితంతో రావాలని లేదు. మన జీవితంలో మనకు తటస్థపడే విషయాలలో శ్రీరాముడు ఎలా ప్రవర్తించాడో అలా మనం ప్రవర్తించాలి. మన కర్తవ్యం విషయంలో మన ముందు ఉన్న ఆదర్శం శ్రీరామచంద్రుడు. తల్లిదండ్రులతో ఎలా మసలు కోవాలి? భార్యయెడ ఎలా ఉండాలి? గురువుల నెలా పూజించాలి? ఆత్మీయులైన వారితో ఎలా ప్రవర్తించాలి? సోదరులు, మిత్రులు, ప్రజలు ఇలా శత్రువులతో సహా మనం ఎలా ప్రవర్తించాలో రాముని


**శ్రీరామనవమి
మార్చి-30 సందర్భంగా...**

జీవితం నుండి గ్రహిస్తే మనం ధర్మమార్గంలో ఉన్నట్లు. ఎందు కంటే ఆయన ధర్మస్వరూపుడు కదా! ధర్మశాస్త్రాలు లక్షణమయితే శ్రీరామచంద్రుడు లక్ష్యం. 'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ', ('తల్లి, మాతృభూమి స్వర్గముకంటె గొప్పది') అన్న రాముని మాట నాటికే కాదు, నేటికి ఏనాటికీ గ్రహింపదగినదే. తండ్రి ఇచ్చిన వరాలను గూర్చి తెల్పిన కైకతో రాముడిలా అంటాడు. "ప్రతి వ్యక్తికీ జన్మనిచ్చిన తండ్రి ప్రత్యక్షదైవమే! అట్టి తండ్రి సజీవుడై ఉండగా ఆయనకు అనుకూలంగా ప్రవర్తించ టమే ప్రతి ఒక్కరికీ కర్తవ్యం" అని అంటూ, ఆయన మాట పాటించటం కంటె వేరొకధర్మం లేదంటాడు. స్త్రీ విషయంలో భర్తయే దైవమని, దేవతాదులను పూజింపకపోయినా, భర్తను పూజించే స్త్రీకి ఉత్తమగతులు కల్గుతాయని, వ్రతోప వాసాదులెన్ని చేసినా భర్తను అనుసరింపని స్త్రీకి నరకం తప్పదని, తల్లియైన కౌసల్యతో అంటాడు. అలా తండ్రియెడ పుత్రుడు, భర్తయెడ భార్య ఉండవలసిన రీతిని చెప్పాడు. భార్యయెడ భర్త ఎలా ఉండాలో ఆచరించి చూపాడు.

స్త్రీయెడ రామునకు అపారగౌరవం. శత్రుఘ్నుడు మంథరను చంపబోగా, భరతుని ఆపి 'స్త్రీని చంపితే అన్న మనతో మాట్లాడడు. అందుకే నేను నా తల్లి కైకను సంహ రింపక' వదిలాను అంటాడు. రాముడు తనకంతటి అపకారం చేసినా కైక, మంథరలనెన్నడూ నిందింపలేదు. లక్ష్మణుడు మూర్ఛబోయిన సమయంలో రాముడు పడిన బాధ ఆతని సోదర ప్రేమకు నిదర్శనం.

శ్రీరాముని పట్టాభిషేకం గూర్చి ప్రజల అభి ప్రాయం కోరినపుడు వారంతా 'రాముడు తమ కష్టాన్ని తన కష్టంగా భావించి దుఃఖిస్తా'డని ప్రజలయెడ రాముడు ఎంత అభిమానంగా ఉంటాడో చెప్పారు. ఆటవికు డైన గుహునితో, వానరుడైన సుగ్రీవునితో, రాక్షసు డైన విభీషణునితోను రాముడు ప్రవర్తించిన విధానం స్నేహితులతో మనుష్యులెలా ప్రవర్తించాలో తెలియ జేస్తుంది. స్నేహితుని శుత్రువు తనకూ శత్రువే అని వాలిని సంహరించి చంపిన విధానం గూర్చి ముందు వాలిచే నిందింపబడినా సత్యం గ్రహించి వాలి చేతనే నమస్కరింప బడ్డాడు.

యుద్ధరంగంలో బడలిక పడిన రావణునిపై బాణాలు సంధింపక సేదదీరి రమ్మనటంలో; మరణించిన శత్రువులు వాలి, రావణులకు సక్రమంగా అంత్యేష్టి జరిపించి **'మరణాంతాని వైరాణి'** అని శత్రువులు మరణించాక ఇక ద్వేషం చూపకూడదనే శాత్రవనీతిని రాముడు ఆచరించి తెల్పాడు. విశ్వామిత్రుని పాదములొత్తి, వసిష్ఠుని పూజించి గురువుల యెడ మనుష్యులెట్టి పూజ్యభావంతో ఉండాలో తెలియజేశాడు. ఇలా ప్రతి వ్యక్తితోను ఎలా ప్రవర్తించాలో అలా ప్రవర్తించి చూపి శ్రీరాముడు **'మర్యాదా పురుషోత్తము'**డనే ఖ్యాతి పొంది మనుష్యులకు ఎలా బ్రతకాలో నేర్పినవాడయ్యాడు. అదియే శ్రీరాముని అవతారానికి ముఖ్యలక్ష్యం.



మార్చి 22న **ఉగాది** పర్వదిన సందర్భంగా...

# వెలుగుల నిధి

– శ్రీ జంధ్యాల శరత్‌బాబు, 99483 45013

ముచ్చటగా మూడు అక్షరాల పండుగ 'ఉగాది'. **'శోభకృతు'** పేరులోనే శుభ, శోభ, వైభవం, ప్రాభవం, కళ, కాంతి, దీప్తి, స్ఫూర్తి అన్నీ ఉన్నాయి. కృతంలో 'యుగం' ఇమిడి ఉంది. అందునా ఇది వసంత నవోత్సవ ఆరంభం. ఋతువుగా సౌందర్యాన్ని, రాగంగా మాధుర్యాన్ని ప్రసాదించే మహోత్సాహ సందర్భం. ఆది పర్వదినం, యుగానికి ఆదిగా యుగాది సంరంభం.

కాలం ఆగదు. సాగుతూనే ఉంటుంది. కరిగిపోతూ ఉండే కాలాన్ని లెక్కలతో గణించడం భారతీయులకు బాగా తెలుసు. అంతకు మించి, కాలమనేది మనందరికీ దైవ స్వరూపం. అనంతకాల గమనంలో మనం ఎక్కడ ఉన్నామనేది తెలుసుకుని తీరాలి. మరి ఈ 'శోభకృతు' నామ సంవత్సర ఉగాదిన కళ్లు విప్పార్చి చూడాలే కానీ, చెవులు రిక్కించి ఆల

## 2023, ఏప్రిల్ నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 03-05 | తిరుమల శ్రీవారి వసంతోత్సవం |
| 06 | తుంబురుతీర్థ ముక్కోటి |
| 14 | తమిళసంవత్సరాది, డా॥ బి.ఆర్.అంబేద్కర్ జయంతి |
| 22 | పరశురామజయంతి, గంగానది పుష్కర ప్రారంభం |
| 23 | అక్షయతృతీయ |
| 25 | శ్రీ రామానుజ జయంతి, శ్రీ శంకర జయంతి |
| 26 | శ్రీరామజయంతి |
| 29 నుండి మే 01 వరకు | తిరుమల శ్రీపద్మావతీశ్రీనివాసుల పరిణయం |

కించాలే కానీ... ఎంతెంత మహదానందమో ప్రతీ ఒక్కరి సొంతమవుతుంది. వత్సరం, వర్షం, వసంతం, ఏడాది, శరత్తు– ఏ పేరుతో పిలిచినా పలుకుతుంది సంవత్సరం.

శాంతి సౌఖ్యాలు ఇవ్వాలని, భోగభాగ్యాలు అందించాలని కాలాన్ని ప్రార్థిస్తాం మనమంతా. కాలగణనకు సమధిక ప్రాధాన్యమిచ్చి, ఉగాదిని ఊరూవాడా వేడుకగా చేసుకుంటాం. ఇందులో పలు అంతర్భాగాలున్నాయి. ఉదయమే అభ్యంగన స్నానం, సరికొత్త వస్త్రధారణం. ఆ వెంటనే నూతన సంవత్సర నామాన్ని సంకల్పశుద్ధితో ప్రకటించాలి. ఆరు రుచుల ఉగాది పచ్చడిని భక్తిశ్రద్ధలతో ఆస్వాదించాలి. పంచాంగశ్రవణం, దైవ దర్శనం ప్రధానమైనవి. వీటన్నింటికీ అద్భుత నేపథ్యముంది.

మన భారతీయుల సంప్రదాయం అత్యుత్తమం. మనదైన వారసత్వం, పద్ధతులు పాటించినకొద్దీ మనసు, శరీరం తేజోవంతమవుతాయి. ఉగాది ప్రసాదం అంటే **'వేపపూత'** పచ్చడి. ఆ పూతరెమ్మలు, లేత మామిడిముక్కలు, చెట్టు చిగుళ్లను చేర్చాలి. కొత్తబెల్లంతో పాటు చింతపండు పులుపును జత చేయాలి. వీటన్నింటితో దేహారోగ్యం. ఇందులోని వేపపువ్వు చేదు వ్యాధి నివారకమంటోంది వైద్యశాస్త్రం. బెల్లం తీపి, చింతపండు పులుపులూ ఆరోగ్యప్రదాయకాలు.

ఇక, పంచాంగ శ్రవణం అత్యంత ఆసక్తికరం. వార్షిక శుభాశుభాల వివరాలు తెలుసుకునే తరుణం. తిథితో పాటు వారం, నక్షత్రం, యోగాదుల ఫలితాలు ఆలకించే సమయం. ఈ ఆచారాల్లో ప్రాచీన విజ్ఞాన విశేషాలున్నాయి. ఆరోగ్యభాగ్యం పొందే అవకాశాలూ పుష్కలం.

ఉగాది తరుణాన గత వర్ష శుభాశుభసంగతులన్నింటినీ సమీక్ష చేసుకోవాలి. భావిభాగ్యమార్గాన్ని ఆలోచనా లోచనాలతో తిలకించి ముమ్ముందుకు కొనసాగాలి. బడిలో, గుడిలో, మడిలో, ఒడిలో ఆనందాలు నిండిననాడే పసిడి ఉగాది అని 'కరుణశ్రీ' అంతర్భావన. తెలుగు ఉగాది అయినా, వెలుగు పునాది అయినా సకల జనహితమే అభిమతం. ఈ పర్వదిన శుభ అనుభవాన్ని నలుగురికీ పంచినప్పుడే నిజమైన ఉగాది. ఒక్కడి పండుగలో కాదు– ఉమ్మడి, ఊరుమ్మడి వేడుకలోనే, ఆ వాడుకతోనే తృప్తీ సంతుష్టీ వెల్లివిరుస్తాయి, ఆ ఏకత్వం, మమేకత్వ తత్త్వాన్ని శోభకృతులోనే మరింతగా చూడగలం. ఇదంతా ఎవరికి వారికే అనుభవైకవేద్యం.

పండుగలూ పబ్బాలూ భక్తజనుల్లో సమ గ్రతకు దోహదపడతాయి. అవి మూర్తిమత్వ వికాసానికి, సామాజిక శక్తి సంపన్నతకీ మూలాధారమై నిలుస్తుంటాయి. అన్ని అంతరాలకీ అతీతంగా 'మనమంతా ఒక్కటే' అనిపిస్తాయి. ఉగాది లేదా యుగాదికి సంబంధించి, యుగం అంటే జంట అనే అర్థమూ ఉంది. అవే ఉత్తరాయణం, దక్షిణాయణం. అయనం అనే పదానికి అర్థం– పయనించడం. ఉత్తరాయణ మనేది జనవరి– జూలై నెలల మధ్య ఉండేది. ఆ ఆహ్లాదకర వాతావరణమే తీర్థయాత్రలకు అన్నివిధాలా అనువు. అందువల్లనే ఉగాదిన దైవ దర్శనానికి ఎంతెంతో ప్రాధాన్యముంది. సరికొత్త చిగుళ్లు తొడిగి, పుష్పించి, ఫలించి, చెట్లకు కాయలు కాచి మధుర పదార్థాలు అందించేదీ ఈ కాలంలోనే. శిశిరం తర్వాత వసంతమే కాబట్టి, ఇప్పుడు వృక్షాలన్నీ కనువిందు చేస్తుంటాయి. ప్రకృతి ఇంకెంతో శోభాయమానంగా రూపుదిద్దుతుంటాయి. ప్రత్యేకించి తెలుగు వారికి ఇదే 'తొలి పండుగ'. ఉగాదినాడే నూతన కార్యాలన్నింటికీ శుభారంభం.

గోపూజకీ ఈ పర్వదినాన గణనీయ ప్రాముఖ్యముంది. ఆవునే మనం గోమాత అని పిలుస్తుంటాం. ఇప్పటికీ అనేకచోట్ల ఆవులకు పండ్లు, ఇతర ఆహారాలు ఇస్తుంటాం. గోవులను పూజించడమన్నది మన తరతరాల ఆచార వ్యవహారం. ఆ మాతను దేవతాస్వరూపిణిగా పరిగణించడం మనకు రివాజు. దేవదానవులు క్షీరసాగరాన్ని మథించినప్పుడు నంది, సురభి, సుశీల, సుమనాది ఆవులు ఉద్భవించాయంటారు. ఉదయాన్నే నిద్రలేవగానే గోవుల్ని చూడటం శుభప్రదమని భావించేవారు అనేకమంది ఉన్నారు. ఉగాది వేళ ఆవుపూజహితప్రదాయకం.



ఉగాది శుభదినాన సర్వప్రధానం– దైవదర్శనం. 'దర్శనం' అంటే చూడటం అనేది సామాన్య అర్థం. 'బుద్ధి, తెలివి, ధర్మదృష్టి, అద్దం, నేత్రం, శాస్త్రం' అనేవి దర్శనానికి విశేషఅర్థాలు. ప్రవేశద్వారాలవద్ద మామిడి ఆకులను కట్టి ఉంచడం సహజసాదరస్వాగతానికి సూచిక. ఇళ్ల ముందర రంగవల్లులను తీర్చిదిద్దడం సామాజిక, మానసిక మహోల్లాసానికి ప్రతీక. రాత్రివేళల దీపాలు వెలిగించి ప్రత్యేక అలంకరణలు చేయడం వెల్లివిరిసే ఆశాజ్యోతులకు నిదర్శనం. ఇవన్నీ యుగాదిని వర్ణభరితం చేసేవే.

ఉగాది అనగానే ముందునిలిచే పచ్చడి స్వీకారాన్ని శ్లోకం ఇలా వివరిస్తోంది– *'శతాయుర్ వజ్రదేహాయ సర్వ సంపత్కరాయ చ/ సర్వారిష్ట వినాశాయ నింబకం దళ భక్షణం.'* అన్నివిధాలా ఉపశమనం కలిగించే వేపఆకు, పూత అన్నీ ఆరోగ్యసాధకాలే. ఆ చేదును, బెల్లం తీపిని కష్టసుఖాల రూపాలుగా భావించడం జీవితాన్ని సహజసిద్ధంగా స్వీకరించే లక్షణం. వీటితో పాటు అన్ని రుచుల అనుభవాన్నీ ప్రసాద రూపంగా చవిచూపించే ఉగాది మన ఆశలూ ఆశయాల మందిరానికి పునాది.

ధారావాహిక

# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యామాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

*గత సంచిక తరువాయి భాగం....*

అనిన చందాన పరాపరతత్త్వజ్ఞశేఖరులైన శుకాది పరమయోగులును ప్రహ్లాదాదులగు పరమభాగవతులును పావనమగు తిరుమలకొండయెడల అందు సర్వకాలసులభుడై వర్తించు వేంకటాచలపతితోడ సమాన గౌరవ ప్రతిపత్తులుంచి ప్రాకృతశరీరముతోడ స్పృశింపకుండిన తీరును, అట్లే అజ్ఞానము నశింప జ్ఞానభక్తులను అనుగ్రహింపగా పొందిన ఆళ్వారులను *'చేరి గగనచుంబియగు వేంకటాద్రికి మ్రొక్కుడు'* అని, *'మనోహర మత్స్యములు విహరించెడి సోనలుగల శ్రీవేంకటశైలమును ఆశ్రయించి మ్రొక్కులిడుచో మనపాతకములన్నియు తొలగి చనును', 'శ్రీవేంకటము మనకు భగవంతునితో సామ్యము కలిగించు మోక్షమును ప్రసాదించు పర్వతము; ఉజ్జీవింప జేసెడి భగవంతుడుండెడి వేంకటాచలము విశాలభూమిపై నున్నది', 'చల్లని సెలయేళ్లుగల వేంకటాద్రియే నరులకు నిత్య సూరులకును పెన్నిధి', 'వేంకటమే దేవతలు ప్రణమిల్లునది', 'సత్యమగు భక్తిచేత వేంకటమే శారీరకబాధావిమోచనము చేయునది' 'వేంకటశిఖరము (శ్రీస్వామి)'*– మున్నగు స్థలము లందు (మూలపాశురములందు) తిరుమలకొండకును శ్రీనివాసునకును భేదమే లేకుండ తమకు పరమప్రాప్యమని తలచి, తిరుమలను కాళ్లతో త్రొక్కబోము అనుచు అడివారమందే యుండి మంగళాశాసనము చేసి వచ్చుచుండుటను అనుసరించి తిరుమల యందు ఆళ్వారులను ప్రతిష్ఠచేయకుండ తిరుమల అడివారమందే తిరుమలకొండ తోడ అభిన్నవిగ్రహులుగా విజయము చేసియుండు విధముగ ప్రతిష్ఠ జరిపించిన ప్రాచీనకాలముననందే శ్రీచిత్రకూటమునుండి విజయముచేసిన శ్రీగోవిందరాజభగవానుని తిరుమల అడివారమందే శ్రీవేంకటాచలపతితోడ అభిన్నముగ శ్రీవైఖానసాగమోక్త ప్రకారముగ శ్రీప్రతిష్ఠ జరిపింప సంకల్పించి, అధ్యయనోత్సవము మున్నగు కొన్ని ఉత్సవములు పరస్పరవిరోధము లేకుండునట్లు జరిపింప ఆజ్ఞాపించిన ప్రాచీనకాలముననందు కాశిరాజు సంతానార్థియై కుటుంబ సహితుడై వచ్చి శ్రీవేంకటేశ్వరుని సేవించుచుండగ, శ్రీనివాసుడు **'దేహి మే, దదామి తే'** (నాకు ఇమ్ము, (అట్లైన) నీకు ఇత్తును) అని పురాణప్రసిద్ధమైన క్రీడావిశేషమును అందరు తెలిసి తననాశ్రయించి యుజ్జీవింపవలెనని తలచి, పట్టపురాణి కలలో (కనిపించి) 'నేను నీకు సంతానము ప్రసాదింతును, నీవు నీ భూమిని నాకు నిమ్ము' అని యడుగ, ఆమె భర్తృపరతంత్ర యగుటచేత భర్త యనుమతి కావలెననెను. శ్రీవేంకటాచలపతియు అయినచో మా అన్నగారు (ప్రభువగు) గోవింద రాజుల అనుమతి కావలెనని సెలవిచ్చిరని స్వప్నవృత్తాంత మున్నది. కావున, ఒక గుడిలోని పంచబేరములకు ఐక్యమున్న రీతిగనే ఈ ఇరువరకును అర్చావతారమందు ఐక్యము తోచుటను గుర్తించి, శ్రీవేంకటాచలపతి త్రిసంధ్యలందును ఆరాధనము స్వీకరించునపుడు, వేదపారాయణము వినియానందించు సమయమున, శ్రీవేంకటాచల మాహాత్మ్యముతో బాటు శ్రీచిత్రకూటమాహాత్మ్యమును, అట్లే శ్రీగోవిందరాజస్వామియు చిత్రకూట మాహాత్మ్యముతోబాటు శ్రీవేంకటాచలమాహాత్మ్యమును వినియానందించుటకును, సాయంసమయములందు శ్రీవేంకటాచలపతి నిత్యానుసంధానమును ఆకర్ణించునపుడు *'ఊన్ వాడ ఉణ్ణాదు'* (శరీరము కృశింప భుజింపక), *'వాడ మరుదిడై పోగి'* (మద్దిచెట్ల నడుమ మర్దించు నట్లేగి) అని యారంభమగు తిరువాయ్‌మొళిపాశురములను (గీతములను) రెండింటిని ఆకర్ణించునట్లును, శ్రీగోవిందరాజస్వామియు అట్లే *'ఒళివిల్ కాలమ్'*(విరామమెరుగక, కాలము), *'ఉలగముండ పెరువాయా'* (లోకములను మ్రింగిన పెద్దనోరు గలవాడా!) మున్నగువానిని వినునట్లుగను తిరుమల తిరుపతి అను రెండు స్థలములను కలిసి ఒకే దివ్యస్థలము అనుటకు తగినట్లు శ్రీవైష్ణవుల దివ్య భవనములందు ఉత్సవ సమయములందు శ్రీవేంకటేశ్వరుడు, శ్రీగోవిందరాజస్వామి, అలర్మేల్‌మంగతాయారు, ఆళ్వార్ శ్రీపుత్రిక(ఆండాళ్‌అమ్మ) సంభావన అనుచు రెండు స్థలములకు ఏకరీతిగ సంభావన చేయించునట్లు నియమించిరని శ్రీవేంకటమును వాసస్థానముగా చేకొని జీవించు పెద్దలు సెలవిచ్చుచున్నారు.

(ఇంకావుంది)

మన మహర్షులు

# వేదవిజ్ఞాననిధి 'అష్టావక్రమహర్షి'

**- సద్గురు శ్రీశ్రీశ్రీ శివానందమూర్తి**

ఒకప్పుడు ఏకపాదుడనే బ్రాహ్మణుడు తన శిష్యులకు వేదములు, వేదాంగములు చెపుతూ ఉండేవాడు నిరంతరము. కొంతకాలానికి ఆయన భార్య సుజాత గర్భవతి అయింది. ఆమె గర్భంలోని శిశువుకు మూడవమాసం వచ్చింది. ఏకపాదుడు శిష్యులకు వేదం చెప్పేటప్పుడు రోజుకు 18 గంటలు చెపుతూ, వాళ్ళు వేదం చదివేటప్పుడు చేసే తప్పులను సరిదిద్దుతూ స్వరం చెపుతూ వాళ్ళను విసిగిస్తూ ఉండేవాడు. ఆయన చర్యకు సుజాతా దేవి గర్భంలో ఉన్న శిశువు నవ్వి, ఆయనతో "ఏమిటీ మూఢత్వం? శిష్యులకు వేదం నేర్పటానికి ఇన్ని గంటలా? ఇన్నిసార్లు చెప్పాలా? నీవేగనుక మంచి గురువువైతే, ఒక్కసారి వాళ్ళకు చెపితే వాళ్ళకు తెలియాలి కదా! వాళ్ళు సరిగా పలకాలి కదా!" అని తండ్రిని ఆక్షేపించాడు.

కడుపులో ఉన్న శిశువు అలా అనేటప్పటికి ఆయనకు కోపం వచ్చింది. ఆయన శాస్త్రవేత్త, వేదాంగములు చదువు కున్నవాడు, తపస్వి. పుట్టకముందే వాడు తనను ఆక్షేపించటమా! ఆయన కోపంతో, "నా అంతటివాడిని పాఠం చెపుతూ ఉంటే నువ్వు వక్రభాష్యం చేస్తావా? నువ్వు ఎనిమిది వంకరలు కలిగిన శరీరంతో పుడతావు?" అని శపించాడు తనకు పుట్టబోయిన కొడుకును. ఆ కారణంచేత ఆయనకు **'అష్టావక్రుడు'** అని పేరు పెట్టారు. కాని ఆయన పుట్టుకతోనే సమస్తవేదవిజ్ఞానాన్ని నిధిగా కలిగినవాడుగా పుట్టాడు.

ఏకపాదుడు అష్టావక్రుని పురిటి ఖర్చుల ధనంకోసం జనకచక్రవర్తి కొలువుకు వెళ్ళాడు. ఆయన ఏకపాదుణ్ణి, "నువ్వు ధనంకోసం వచ్చావు సరేకానీ, నీకు ఉన్న విద్య ఏమిటి? దేనిమీద నీకు అధికారము ఉంది? ఎట్లాంటి విజ్ఞానము ఉంది?" అని అడిగాడు.

ఏకపాదుడు అందుకు జవాబుగా, "నేను వేదవేదాంగా లను చదువుకున్నాను. సత్యాన్ని పూర్తిగా తెలుసుకున్నవాడిని" అని స్వోత్కర్షగా చెప్పుకున్నాడు తనను గురించి.

అప్పుడు జనకుడన్నాడు – "అలా అయితే నా ఆస్థానంలో ఉన్న వందితో నువ్వు వాదించి మహాపండితుడివి అని తేలితే, నువ్వు ఎంత అడిగితే అంత ఇస్తాను" అన్నాడు. వంది వరుణదేవుడి కొడుకు. జనకుడి ఆస్థాన విద్వాంసుడు. మహాపండితుడు.


వందితో జరిగిన వాదనలో ఏకపాదుడు ఓడాడు. అంతకుముందు షరతు ఏమిటంటే, ఒక వేళ వందితో వాదించి గెలవకపోతే, అక్కడ ఉన్న ఒక చెఱువులో కూర్చోవాలి. 'జల మజ్జిత' అని దానికి పేరు. ఏకపాదుడు తను పండితుడినని అహంకరించినందుకు పడిన శిక్ష అది. అలా ఓడిపోయి జలమజ్జితుడై తిరిగి ఇంటికి పోలేదు. సుజాత పుట్టింటికి వెళ్ళింది చేసేదిలేక.

సుజాత తండ్రిపేరు ఉద్దాలకుడు. సుజాత తమ్ముడు శ్వేతకేతు అష్టావక్రుడికి మేనమామ. వీళ్ళిద్దరికీ ఉద్దాలకుడే విద్యాబోధన చేస్తూండేవాడు. కొడుకుకి, మనుమడికి ఆయనే విద్యనేర్పాడు. అయితే పుట్టినప్పటినుండీ తండ్రిని చూడక పోవటంచేత ఉద్దాలకుణ్ణి తండ్రి అని, శ్వేతకేతును అన్న అని అనుకునేవాడు అష్టావక్రుడు.

ఒకనాడు శ్వేతకేతుకు, అష్టావక్రుడికి జరిగిన సంవాదంలో శ్వేతకేతు అష్టావక్రుడితో, "నీ తండ్రి దగ్గరికి పో! ఇక్కడ మా ఇంట్లో ఎందుకు ఉన్నావు?" అన్నాడు. అప్పుడు అవమానభారంతో, తన తండ్రివేరే ఉన్నాడని తెలియక తల్లి దగ్గరికి వెళ్ళి, "అమ్మా? నా తండ్రి ఎవరు? ఎక్కడ ఉన్నాడు?" అని అడిగాడు అష్టావక్రుడు.

అతడి ప్రశ్నకు సమాధానంగా ఆమె అష్టావక్రుడితో, "నాయనా! నీవు పుట్టటానికి ముందే ధనం కోసమని రాజా స్థానానికి వెళ్ళిన నీ తండ్రి వందితో వాదించి ఓడిపోయి అక్కడ శిక్షననుభవిస్తున్నాడు" అని చెప్పింది. "నేను వెళ్ళి తండ్రిని విడి పించుకుని వస్తాను" అని అష్టావక్రుడు శ్వేతకేతును కూడా తీసుకుని రాజాస్థానానికి వెళ్ళాడు. మళ్ళీ ఇద్దరూ స్నేహంగానే ఉన్నారు.

ఉద్దాలకుడు చెప్పిన జ్ఞానము అమోఘమైనటువంటిది. ఆయన మహాపండితుడు. గొప్పజ్ఞాని. ఆయన బోధించిన జ్ఞానము, విద్యతో వారు ఆస్థానానికి వెళ్ళితే, ద్వారపాలకులు వాళ్ళను అడ్డగించారు. "రాజాస్థానానికి మీలాంటి పిల్లలు పోకూడదు. లోపలికి వెళ్ళకూడదు. పెద్దలు, బ్రాహ్మణులు,



పండితులైనవారు మాత్రమే వెళ్ళాలి. ఏదయినా పాండిత్య విషయంవస్తే సభలో చెప్పాలి అంతే. అదీ వయోవృద్ధులే వెళ్ళాలి. అందుకని లోపలికి పంపటానికి వీలుపడదు" అన్నారు.

"ఇది ఏమి రాజాస్థానము! వయసుచూచి పండితులనుకునేవారి ఆస్థానమా ఇది!" అని తిరస్కరించి అష్టావక్రుడు, "వయసుకు, జ్ఞానానికీ సంబంధం లేదు" అని రూఢిగా చెప్పాడు. ఆ ద్వారపాలకుడు కూడా పండితుడే. అందుకే వెంటనే ఈయన సామాన్యుడు కాదని గ్రహించాడు. వెంటనే రాజుదగ్గరికి వెళ్ళి, "మహారాజా! పండితులైన ఇద్దరు పిల్లలు తమరి దర్శనానికి వచ్చారు. వాళ్ళను అనుమతిస్తారా?" అని అడిగితే, రాజు సరేనన్నాడు. వెంటనే ద్వారపాలకుడు-అష్టావక్రుడు, శ్వేతకేతులను ఆస్థానానికి తీసుకువెళ్ళాడు. రాజు వాళ్ళను పలకరించి, "ఏమిటి మీరు పండితులా! మీరు బ్రహ్మచారులా?" అని అడిగాడు. వాళ్ళు రాజుతో, "అవును. మేము మీ ఆస్థానపండితుడైన వందితో వాదించటానికి వచ్చాము" అన్నారు. "అలాగా! ఓడిపోతే శిక్ష ఏమిటో తెలుసా?" అన్నాడు రాజు. "ఏముంది? జలాశయంలో కూర్చోబెడతారు. అంతేకదా! మాకు తెలుసు" అన్నాడు అష్టావక్రుడు. రాజు ఆస్థానంలో అనేకమంది పండితులు, జ్ఞానులు, మునులు, యోగులు ఎంతోమంది ఉన్నారు. ఎనిమిది సంవత్సరాల వయసు కలిగిన అష్టావక్రుడు వందితో వాగ్వివాదానికి దిగాడు. సృష్టిలో ఉండేటటువంటి సత్యములలో వంది ఒకటి చెపితే, దాని పైసత్యాన్ని ఇంకొకటి చెప్పాలి తను. అదీ అక్కడ పందెం. ఒకటి అనే సంఖ్య ఏమేమి చెపుతుంది సృష్టిలో, ఆ పరమసత్యం చెప్పాలి. ఈ ప్రకారంగా ఎక్కడయితే ఆ పైసంఖ్య గురించి అవతలివాడు చెప్పలేక ఆగిపోతాడో, అక్కడ అతడు ఓడిపోయినట్లు.

"ప్రజ్వలించేది అగ్ని ఒకటే. సూర్యుడు ఒకడే! శివుడు ఒక్కడే సర్వవ్యాపి" అని ఒకటిసంఖ్యకు సంబంధించిన మూడు సత్యాలు వంది చెప్పాడు. అప్పుడు అష్టావక్రుడు రెండుసంఖ్యకు సంబంధించిన రెండుసత్యాలు చెప్పాడు. "ఇంద్రాగ్నులిద్దరు. నారదపర్వతులిద్దరు, దేవతలైన అశ్వినేయులిద్దరు. సంసార మూలం అయిన భార్యాభర్తలు ఇద్దరు" అని చెప్పి రెండుసంఖ్య నిరూపించాడు. అవి శాశ్వతములైన సత్యాలు అయి ఉండాలి. ఈ ప్రకారంగా 12వ సంఖ్య వరకూ చెప్పుకుంటూ వెళ్ళారు. 12వ సంఖ్య అష్టావక్రుడు చెప్పాడు. 13వ సంఖ్య వంది చెప్పలేకపోయాడు. "ఓడిపోయాను నేను!" అన్నాడు వరుణ కుమారుడైన వంది.

నీకేం కావాలని అష్టావక్రుడిని జనకమహారాజు అడిగాడు. అష్టావక్రుడు "నా తండ్రిని విడిపించుకోవటానికి వచ్చాను. ఆయన శిక్షలో ఉన్నాడు. ఇంతకుముందు మీరు నిర్ణయించిన ప్రకారంగా ఈ వందిని ఆ చెరువులో కూర్చోబెట్టి నా తండ్రిని బయటకు పంపించండి!" అన్నాడు. దానికి జవాబుగా వంది, "కేవలం అది ఒక వంక మాత్రమే! ఇలా చాలామంది బ్రాహ్మణులను తీసుకొచ్చి వాళ్ళను వాదనలో గెలిచి, వాళ్ళ మహత్త్వాన్ని తెలుసుకున్నవాణ్ణి. వాళ్ళకు నిజంగా శిక్ష వెయ్యలేదు. నా తండ్రి అయిన వరుణదేవుడు ఒక మహాయాగం సంకల్పించి చేస్తున్నాడు. దానికి ఋత్విక్కులు దొరకటం లేదు. అందుకని ఇలాగ వీళ్ళను ఆకర్షించి ఓడించి అక్కడికి పంపించి, అక్కడ ఆ యజ్ఞం సక్రమంగా జరిగేటట్లు చూస్తున్నాను. అయ్యా! నీతండ్రి వరుణదేవుడి యజ్ఞంలో ఉన్నాడు చూడు!" అని చెప్పి ఆయనను పిలిపించి సన్మానం చేశాడు. అందుకు ఫలంగా వందితో, "నిన్ను క్షమిస్తున్నాను!" అన్నాడు అష్టావక్రుడు. ఆ ప్రకారంగా 8ఏళ్ళ పిల్లవాడు వందిని క్షమించి విడిచిపెట్టాడు. అష్టావక్రుడు లోకవిఖ్యాతుడయ్యాడు.

# వెన్నెలకు కొలలేదు-అన్నమయ్యకీర్తనకి వెలలేదు

- డా॥ అద్దంకి శ్రీనివాస్

*మార్చి 18 అన్నమాచార్యుల వర్థంతి సందర్భంగా...*



ఒకనాడు తెలుగునాట ప్రతి తల్లీ తన చిన్నారి ముద్దు బిడ్డ అన్నం తినడానికి మారాం చేస్తుంటే ఆ బుజ్జిని చంకలో వేసుకుని ఆరుబయటికి వచ్చి చంద్రుణ్ణి చూపించి ***"చందమామ రావే జాబిల్లి రావే కొండెక్కి రావే కోటిపూలు తేవే, బండెక్కి రావే బంతిపూలు తేవే వెండి గిన్నెలో వేడిబువ్వ తేవే, అన్నిటినీ తెచ్చి మా పాపాయి కివ్వవే"*** అని పాడుతూ అన్నం తినిపించే మధుర సన్నివేశం ప్రతి ఇంటా నేత్రానందాన్ని, హృదయానందాన్ని కలిగించేది. అయితే అంత చక్కటి పాటనురాసింది తాళ్లపాక అన్నమాచార్యులని ఎవరికి తెలుసు? పాట ప్రజల్లోకి వెళ్ళినంతగా కవి వెళ్ళలేదు. అయినా పాట బతికిందీ అంటే కవి బతికినట్లే లెక్క. పసిపిల్లల్ని ఉయ్యాల తొట్లెలోనో, కాళ్ళమీదనో పడుకోబెట్టి పాడే ఈ కింది జోలపాట కూడా అన్నమాచార్యులదే ***"జో అచ్యుతానంద జోజో ముకుంద, లాలి పరమానంద లాలి గోవింద".***

ఈ విధంగా ప్రజలనాల్కలపై నాట్యమాడే విధంగా, ప్రజలు పాడుకుని పరవశించటానికి అనువుగా, నిరక్షరాస్యుల్ని గాయకుల్ని చేసే విధంగా, జానపద కళారీతుల్ని ప్రతిబింబించేలా కీర్తనలు రాసి ప్రజాకవి అయ్యాడు అన్నమయ్య.


తాళ్లపాక అన్నమాచార్యులు తెలుగులో మొట్టమొదటి వాగ్గేయకారుడు మనకు తెలిసినంతవరకు. పదహారోఏటనే వేంకటేశ్వరుని సాక్షాత్కారం పొందిన "పదకవితాపితామహుడు". అన్నమయ్య మొత్తం 32వేల సంకీర్తనలు రాశాడని తెలుస్తున్నా 12 వేలు మాత్రమే దొరికాయి.

***"హరి యవతార మితడు అన్నమయ్య, ఆకసపు విష్ణుపాదమందు నిత్యమై ఉన్నవాడు, భావింప శ్రీవేంకటేశు పాదములందె వున్నవాడు"*** అని అన్నమయ్యను అతని పుత్రపౌత్రులు కీర్తించడంలో అతిశయోక్తిలేదు. ***"ఏ వేల్పు సర్వేశ్వరుడే వేల్పు పరమేశుదే వేల్పు... ఘనము, ఆవేల్పు తిరువేంకటాద్రి విభుడు"*** అంటూ తన్మయత్వంతో తనివి తీరా తెలుగు వారి ఇలవేల్పు అయిన వేంకటేశ్వరస్వామి దివ్యమంగళస్వరూపాన్ని నోరారా వర్ణించిన తెలుగుతల్లి ముద్దుబిడ్డ అన్నమయ్య. తనకు ముందున్న పురాణ, కావ్యపద్ధతుల్ని కాదని సరికొత్తరీతిలో సంకీర్తనా సాహిత్యాన్ని సృష్టించిన సాహితీతపస్వి, తెలుగుకవిత్వానికి ఒక అపర దేవతామూర్తిగా అవతరించాడు అన్నమయ్య.

అతడు ఆడిన మాటెల్ల అమృతకావ్యమైంది. పాడిన పాటెల్ల పరమగానమైంది. ప్రతి కీర్తననీ మధురభక్తితో అలౌకిక జగత్తులో రచించి ఆ సౌగంధికపుష్పాల్ని దేవదేవుని పాదాలకు సమర్పించాడు అన్నమయ్య. అన్నమయ్య కీర్తనల్లో పెళ్ళి, జోల, గొబ్బిళ్ళ, ఏల, సంవాద, తుమ్మెద, కోలాటపు, సువ్వి, చిందు, తందానపాటలు.. ఇలా ఎన్నో రకాలున్నాయి. కీర్తనల్లో గల విషయాన్ని బట్టి భక్తిపాటలు, శృంగారకీర్తనలు, వేదాంతకీర్తనలు, సాంసారికకీర్తనలు, వేడుకపాటలు,.. మొదలైన విధంగా కూడా విభజించవచ్చు. ఏ విభజనకీ లొంగని పాటలూ ఉన్నాయి, అన్ని రకాలకూ చెందిన పాటలూ ఉన్నాయి.

వివిధ జానపద గేయలక్షణాల్ని ఆకళింపు చేసుకోవటం, భగవంతునితో మమేకం చెందటం, లోకపరిశీలనాశక్తిని కలిగి ఉండటం, వాడుక భాషకు ప్రాముఖ్యత ఇవ్వటం, జీవితతత్త్వాన్ని విడమరిచి చెప్పటం- ఇవీ అన్నమయ్య కీర్తనల గొప్పతనానికి మూల కారణాలు. అన్నమయ్య పెండ్లిపాటలు చాలా ఉన్నాయి. ఉదాహరణకు- ***'పిడికిటి తలంబ్రాల పెండ్లికూతురు, కొంత పెడమరలి నవ్వేటి పెండ్లికూతురు'*** అంటూ అలమేలు మంగ అలంకారవైభవాన్ని, హావభావ విలాసాల్ని అన్నమయ్య వర్ణించినా కొంచెం అటూ ఇటూగా తెలుగువారింటి పెళ్ళికూతుర్నే దృష్టిలో పెట్టుకున్నాడు.

కృష్ణుడికీ కొండలరాయనికీ అభేదం పాటిస్తూ గొబ్బిళ్ళ పాటలు రాశాడు. మార్గశిరమాసం బాలికలు గుమ్మాల ముందు గొబ్బిళ్ళుపెట్టి వాటి చుట్టూ గుండ్రంగా తిరుగుతూ చప్పట్లు కొడుతూ నాట్యభంగిమలో పాడే ఈ పాట అత్యంత మనోహరం- ***"కొలనిదోపరికి గొబ్బిళ్ళో యదు కులస్వామికిని గొబ్బిళ్ళో".*** ఇందులో శ్రీకృష్ణుడు గోవర్ధనగిరిని ఎత్తి గోపకులను రక్షించిన విధం సూచించబడింది. "కొండొక", "వెండి పైడి", "కొండలయ్య" వంటి తెలుగుదనం ఉండనే ఉంది.



అన్నమయ్య ***"వేడుకుందామా వెంకటగిరి వేంకటేశ్వ రుని, ఆమటి మ్రొక్కుల వాడే ఆదిదేవుడే వాడు"*** అంటూ మనల్ని కూడ తన జట్టులో కలుపుకుంటాడు. మనతో నడిచివచ్చి అలిపిరి, తలయేరుగుండు, మోకాళ్ళ ముడుపు మొదలైన వాటిని అక్షరీకరించి చూపిస్తాడు.

***"అదివో అల్లదివో శ్రీహరివాసము", "కొండలలో నెలకొన్న కోనేటిరాయుడు వాడు"*** వంటివి ప్రచారం పొందటా నికి కారణం ఛాందసమైన భక్తితత్త్వం కాదని గ్రహించాలి. జీవనతత్త్వాన్ని బోధించే భక్తితత్త్వం ఆ కీర్తనల్లో ఉంది. వైరాగ్య చింతనతో, తాత్త్వికదృక్పథంతో, నిర్మలమైన ఆరాధనాభావంతో రాయటం వల్లనే అతని తలపులు తెలుగువాడి మోక్షగృహానికి తలుపులయ్యాయి.

సంవాదపాటలు ఎన్ని రాసినా– ***"రావే కోడల రట్టడి కోడల పోవె పోవె అత్తయ్య పొందులు నీతో చాలును"*** అనే అత్తాకోడళ్ళ సంవాదపుపాట అన్నమయ్య లోకజ్ఞతని చాటి చెప్తుంది.

సువ్విపాటలు అన్నమయ్య కీర్తనల్లో విశేషమైనవి. ఇవి దంపుడు పాటల కిందికి వస్తాయి. ధాన్యం దంచేటప్పుడు శరీరక్లేశాన్ని పోగొట్టుకోవటానికి "ఇస్" అనే ధ్వన్యనుకరణ శబ్దమే వేగంగా దంచుతూ అన్నప్పుడు ఆ ఊపులో "సువ్" అన్నట్టు వినిపిస్తుంది. అందుకే ఇలాటి పాటల్ని సువ్వి పాట లన్నారు. వీటికే "రోకటిపాటలు" అనే పేరు కూడా ఉంది.

***"సువ్వి సువ్వి సువ్వి సువ్వని సుదతులు దంచెదరో లాల"–*** అనే సరసమైన పాటలతో పాటు మధురభక్తి భావాలు గల సువ్వి పాటలూ ఉన్నాయి.

అన్నమయ్య 15వ శతాబ్దిలోనే అభ్యుదయభావాలు గల పరమయోగి. వృత్తిపనుల్ని గౌరవించాలన్నాడు. కులభేదాలను, అంటరానితనాన్ని నిరసించి బ్రాహ్మణుడూ, చండాలుడూ అంతా సమానులే అని ఎలుగెత్తి చాటి ***"బ్రహ్మమొక్కటే పరబ్రహ్మ మొక్కటే"*** అని బోధించిన జ్ఞాని అన్నమయ్య.

***"ఏ కులజుడేమి యెవ్వడైన నేమి ఆకడ నాతడే హరి నెరింగిన వాడు"*** అనటంలో అన్నమయ్య విశాలదృక్పథమే కాదు, మానవుడే మాధవుడన్న మహనీయసూక్తి దాగి ఉంది.

అన్నమయ్య కీర్తనల్లో ఉన్న మరొక గొప్పదనం వర్ణనా వైభవం. శృంగారవర్ణనలు, వైరాగ్యవర్ణనలు, ప్రకృతివర్ణనలు, జీవితవర్ణనలు.. అనేకం ఉన్నాయి. దేవదేవుని సౌందర్యాన్ని, అలమేలుమంగ విలాసాన్ని తనివితీరా వర్ణించాడు. జ్యోతిష శాస్త్రంలో చెప్పబడ్డ పన్నెండు రాసులు ఉపమానాలుగా గ్రహించి.. ***"ఇన్ని రాసుల యునికి యింతి చెలువపు రాశి.."*** అంటూ అద్భుతంగా వర్ణించాడు. అన్నమయ్య కవితా వైభవం అతని భాషలో ఉంది. ***"ఏటిలో పైరు", "నీళ్ళ నమలు", "జలధిలో వానలు," "వరదం గలిపిన చింతపండు", "పిండంతే నిప్పట్టు"*** వంటివి ఎన్నో పలుకుబడులు. సామెతలు, సూక్తులు ఆహ్లాదం కలిగిస్తాయి.

***"చాంగుబళా," "జాజర", "తందనాన," "పురే"*** వంటి విశేషణాలు వినూత్నంగా ఉండి గానానికి ఊతం ఇస్తాయి. తెలుగుభాషలో గల స్వచ్ఛమైన భావసంపదకీ, సహజమైన తెలుగుదనానికి అన్నమయ్య కీర్తనలు నెలవులు. "వెన్నెలకు కొలలేదు", అన్నమయ్య కీర్తనకి వెలలేదు.



మార్చి 1 తిరుక్కచ్చినంబి శాత్తుమొఱ

# కాంచీపూర్ణులు తిరుక్కచ్చినంబి

- డా॥ పి.టి.జి.వై.రంగరామానుజాచార్యులు

*దేవరాజ దయాపాత్రం శ్రీకాంచీపూర్ణ ముత్తమమ్,*
*రామానుజ మునే ర్మాన్యం వందేహం సజ్జనాశ్రయమ్*


"శ్రీవరదరాజస్వామి దయకు పాత్రమైనవారు, ఉత్తములు, భగవద్రామానుజులకు చాలా ఆదరణీయులు, సజ్జనులకు ఆశ్రయించదగినవారైన తిరుక్కచ్చినంబిని నమస్కరిస్తున్నాను."

తిరుక్కచ్చినంబి భగవద్రామానుజులచే తమ ఆచార్యులతో సమానులుగా ఆదరింపబడినవారు. శ్రీయామునులకు అంతరంగశిష్యులు. కాంచీనగరానికి తూర్పుదిశలో ఉండే పూవిరుందమల్లి అనే చోట వైశ్యకులంలో వీరరాఘవులకు, కమలాంబకు నాల్గవపుత్రులుగా వీరు మాఘమాసం మృగశిరనక్షత్రంలో జన్మించారు. వీరి పేరు గజేంద్రదాసులు. భార్గవకులంలో అవతరించిన తిరుమళిశై ఆళ్వారుల అనుగ్రహంవల్ల వీరు జన్మించినందున వీరికి 'భార్గవప్రియులు' అనే పేరు కూడా ఉన్నది. యామునులు వీరికి 'పేరరుళాళదాసర్' అనే పేరును పెట్టారు. కాంచీనగరంలో వీరు నివసించినందున 'కాంచీపూర్ణులు' అనే పేరు ఏర్పడింది. కంచి వరదరాజస్వామికి 'ఆలవట్టాన్ని' (వింజామర) వీచే సేవను వీరు చాలా భక్తిశ్రద్ధలతో చేసేవారు. వరదరాజస్వామి వీరితో రాత్రివేళ సంభాషించేవారు అని ప్రసిద్ధి.

అంతిమకాలంలో వీరు మోక్షాన్ని పొందాలని వరదరాజస్వామిని ప్రార్థించగా, "మీరు ఆలవట్టాన్ని వీచారు, నేను మీతో సంభాషించాను. రెండింటికీ సరిపోయింది. నీకు మోక్షం కావాలంటే ఒక పరమ భాగవతుని అభిమానాన్ని పొందితేనే అది నీకు లభిస్తుంది" అని సమాధానం చెప్పాడు. ఆ తరువాత తిరుక్కచ్చినంబి మారువేషంతో తిరుక్కోట్టియూర్‌నంబి దగ్గర పశువులను మేపే సేవను చేసి వారిని మెప్పించి, "ఇతడు మనవాడు" అనే అభిమానాన్ని పొందారు. ఆ అభిమానం కారణంగానే వీరికి మోక్షం లభించింది.

భగవద్రామానుజులు వీరిని ఆశ్రయించాలని చాలా ఆశపడ్డారు. కానీ, అప్పటి సంఘవ్యవస్థను దృష్టిలో పెట్టుకొని నంబి దానికి సమ్మతించలేదు. అవకాశం ఇవ్వలేదు. వరదరాజస్వామిని అడిగి శ్రీరామానుజులకు ఆరువార్తలను తెలియజేసినవారు వీరే. ఈ ఆరువార్తలే భగవద్రామానుజుల విశిష్టాద్వైత దర్శననిర్వహణకు చాలా దోహదం చేశాయి. వీరు వరదరాజస్వామిని స్తుతిస్తూ **'దేవరాజాష్టకం'**అనే ఒక చిరుస్తోత్రాన్ని రచించారు. ఇది శ్రీయామునుల స్తోత్రరత్నానికి సంగ్రహరూపమని పెద్దల అభిప్రాయం.

*శ్రీమత్కాంచీమునిం వందే కల్యాణ గుణశాలినమ్.*




# ఉపనిషత్తుల పరమార్థం

- శ్రీ దావులూరి రామకృష్ణ

ఉపనిషత్తు అనగా 'అజ్ఞాన నాశమును' చేసి బ్రహ్మ ప్రాప్తిని కలిగించే విద్య అని అర్థము లేదా పరతత్త్వమునకు సమీపముగా తీసుకువెళ్లేది. అందుకే దీనిని వేదాంతమన్నారు. ఇవి బ్రహ్మ విద్యను బోధిస్తాయి. దీనికి మూడర్థాలున్నాయి. 1)విశరణం(నాశం) 2)గతి(పొందడం లేక తెలుసుకోవడం) 3)అవసాదనం(శిథిలం కావడం). అంటే అజ్ఞానము నాశం అవుతుంది(విశరణం), బ్రహ్మ సాక్షాత్కారము లభిస్తుంది(గతి), దుఃఖము శిథిలమవుతుంది(అవసాదనం). ఉపనిషత్తులో మూడు కాండములు ఉన్నాయి. అవి జ్ఞాన, ఉపాసన, కర్మకాండములు.

ఉపనిషత్తులను 108 గా పేర్కొనవచ్చు. వానిలో కూడా పది(10) ఉపనిషత్తులు శ్రేష్ఠములు. అవి *ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తరీయ, ఐతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యకము.*



1)ఈశావాస్యోపనిషత్తు శుక్లయజుర్వేదమునకు చెందినది. 2)కేనోపనిషత్తు సామవేదమునకు చెందింది. 3)కఠోపనిషత్తు యజుర్వేదానికి చెందినది. 4)ప్రశ్నోపనిషత్తు, 5)ముండక, 6)మాండూక్యాలు అథర్వణ వేదానికి చెందినవి. 7)తైత్తరీయ ఉపనిషత్తు కృష్ణయజుర్వేదమునకు చెందింది. 8) ఐతరేయ ఉపనిషత్తు ఋగ్వేదానికి చెందింది. 9)ఛాందోగ్యం సామవేదమునకు చెందినది. 10)చాలా పెద్దది బృహదారణ్యకం శుక్లయజుర్వేదానికి చెందింది.

ఉపనిషత్తులు కేవలం ఆత్మవిద్యనందించటమే గాక మానవుడు సమాజంలో ఎలా ప్రవర్తించాలి? జీవితంలో ఏ కర్మలు ఆచరించాలో ఉపదేశిస్తాయి. ఎలా మెలగాలన్న మానవుడు తన బుద్ధిని ఆశ్రయించాలి. 'బుద్ధిః కర్మానుసరణీ' అని నానుడి. దానిని బట్టి మానవుడు కర్మలనాచరించి, వాటి ఫలితాలనుభవిస్తున్నాడు.

బుద్ధిని సారథిగా చేసుకున్న వ్యక్తి జీవనప్రయాణము సాఫీగా సాగుతుందని కఠోపనిషత్తు చెప్తుంది. మనిషికి మంచి జీవితాన్ని ఇవ్వాలన్నా బతుకుకు భరోసా, భద్రతా కల్పించాలన్నా, భవిష్యత్తుకు బంగారుబాట వెయ్యాలన్నా బుద్ధితోనే సాధ్యమౌతుంది.

**ఆత్మనం రథినం విద్ధి శరీరం రథమేవ తు।**
**బుద్ధింతు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥ (కఠోపనిషత్తు 1-3-3)**

జీవనరథానికి బుద్ధిని సారథిగా చేసుకోవాలి. మనస్సును పట్టుకుని ముందుకు సాగాలి. సరైన సారథి ఉన్నప్పుడే రథం సక్రమంగా సాగుతుంది. ఆ సారథి కూడా పగ్గాన్ని పట్టుకోవడంలో నేర్పరితనం కలవాడై ఉండాలి. బుద్ధి, మనస్సు అనేవి ఎంత నిర్మలంగా, దృఢంగా ఉండాలో చెబుతుందీ మంత్రం.

**యస్తు విజ్ఞానవాన్ భవతి యుక్తేన మనసా సదా।**
**తస్యేంద్రియాణి వశ్యాని సదశ్వా ఇవ సారథేః ॥ (కఠోపనిషత్తు 1-3-6)**

మనసు స్వాధీనంలో ఉంటే ఇంద్రియాలు స్వాధీనంలో ఉంటాయి. అందుకే మనసును స్వాధీనంలో ఉంచుకోవడానికి సద్గురువులను ఆశ్రయించి గోవిందుని పాదాలను పట్టుకోవాలి.

**ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్య వరాన్ నిబోధత**
**క్షురస్యధారా నిశితా దురత్యయా దుర్గం పథస్తత్కవయో వదన్తి**
**(కఠోపనిషత్తు 1-3-14)**

"మానవుడా మేలుకో. అవిద్య అనే నిద్ర నుంచి మేల్కొనేందుకు ఉత్తమసాంగత్యము చేయండి. పరమాత్మతత్త్వాన్ని తెలుసుకోండి" అని ఉపనిషత్తులు బోధిస్తున్నాయి.

*సర్వేజనాః సుఖినో భవంతు.*

# ప్రబంధప్రసిద్ధులు శ్రీకులశేఖరాళ్వారులు

- డా॥ ఐ.ఎల్.ఎన్.రాజేష్

**మార్చి 3 కులశేఖరాళ్వార్ వర్ష తిరునక్షత్రం**

**కుంభే పునర్వసౌ జాతం కేరలే చోళ పట్టణే।**
**కౌస్తుభాంశం ధరాధీశం కులశేఖరమాశ్రయే॥**

ప్రభవనామ సంవత్సరము మాశినెల శుక్లపక్ష ద్వాదశి గురువారంనాడు పునర్వసు నక్షత్రంలో దృఢవ్రతుడు అనే ప్రభువునకు కులశేఖరాళ్వారులు తిరువంజిక్కళమ్ అనే క్షేత్రంలో జన్మించారు. భగవంతుడైన శ్రీమన్నారాయణుడు ధరించే 'కౌస్తుభమణి' అంశతో ఈ ఆళ్వారులు అవతరించారు.


సహజంగానే ఆధ్యాత్మిక చింతనను కలిగిన కులశేఖరుడు పరతత్త్వాన్ని గూర్చి విచారణను చేసి, శ్రీమన్నారాయణుడే పరతత్త్వం అనే విశ్వాసాన్ని పొందాడు. శ్రీరామాయణగాథ అంటే ఈయనకు చాలా ఆసక్తి.

ఒకనాడు శ్రీరామాయణగాథను ఒక పండితుడు ఉపన్యసిస్తూ ఉండగా, రాముడు ఒక్కడే జనస్థానంలో ఖరదూషణాదులను వధించే సందర్భం ప్రస్తావనకు వచ్చింది. ఆ కథలో లీనమైన కులశేఖరుడు "రామునకు సహాయం చేసేవారు ఎవ్వరు లేరా? మనం వెంటనే సహాయం చేద్దాం. బయలుదేరండి" అని అంటూ తన అధికారులను సైన్యాన్ని సిద్ధం చేయమని ఆజ్ఞాపించి, జనస్థానానికి బయలుదేరాడు.

కులశేఖరుని మానసిక స్థితిని గమనించిన ఆయన మంత్రి ఆ ఉపన్యాసకుని వెంటనే "రాముడు ఒక్కడే వేలాది రాక్షసులను అసహాయశూరుడై వధించాడని వివరించ"మని చెప్పాడు. ఉపన్యాసకుడు కూడా ఆ విధంగానే కథా ప్రసంగాన్ని చేయగా, కులశేఖరుడు ఆ ప్రసంగాన్ని విని తృప్తి చెంది, తన ప్రయాణాన్ని నిలుపుకున్నాడు.

శ్రీరంగంలోని శ్రీరంగనాథుడు అంటే కులశేఖరునకు అంతులేని భక్తి. భగవద్భక్తులు అంటే ఎనలేని ఆదరాభిమానాలు. ప్రతిదినం శ్రీరంగయాత్రను చేయడానికి ఈయన బయలుదేరేవాడట. రాజు రాజ్యపాలన వదిలిపెట్టి వెళ్ళిపోతాడేమో అని భయపడిన అధికారులు, మంత్రులు ఎవరో ఒక భాగవతుని ఆయన దగ్గరకు తీసుకుని రాగా, ఆ భాగవతుని ఆరాధనకోసం తన ప్రయాణాన్ని కులశేఖరుడు నిలుపుకునేవాడట. ఈ విధంగా ప్రతిదినం కులశేఖరుని శ్రీరంగప్రయాణ ప్రయత్నం, భాగవత సమారాధన కోసం అతడు తన ఆ ప్రయాణాన్ని నిలుపుకోవడం జరిగేదట.

రాజ్యపరిపాలనపై శ్రద్ధ చూపించకుండా, కేవలం భక్తిమార్గంలోనే కులశేఖరుడు కాలాన్ని గడపడాన్ని, భగవద్భక్తులను ఆరాధించడంలోనే ఆసక్తిని చూపడాన్ని గమనించిన మంత్రులు, అధికారులు అతని మనసును మార్చడంకోసం ఒకసారి రాచభవనంలో ఉండే శ్రీరామవిగ్రహానికి అలంకరించిన వజ్రాల హారాన్ని దాచి పెట్టి, దానిని భాగవతులు ఎవ్వరో దొంగలించారని నేరారోపణ చేశారు. కానీ, కులశేఖరుడు దానిని నమ్మక, భాగవతులు ఎప్పుడూ అటువంటి అపచారంచేయరని పలికి,



దానిని ఋజువుచేయడం కోసం ఒక బిందెలో పామును పెట్టి తెమ్మని చెప్పి, అందులో తన చేతిని పోనిచ్చి, తాను చెప్పే మాట సత్యమైతే పాము కాటు వేయదని ప్రమాణం చేసి, నిజాన్ని నిరూపణ చేశాడు. అంతటితో మంత్రులు, అధికారులు తమ తప్పును తెలుసుకొని రాజు మనస్సును మార్చాలనే తమ ప్రయత్నాన్ని మానుకున్నారు.

కులశేఖరాళ్వార్లు **'పెరుమాళ్ తిరుమొళి'** అనే ద్రావిడ ప్రబంధాన్ని, **'ముకుందమాల'** అనే సంస్కృత స్తోత్రాన్ని రచించారు. తిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామి గర్భాలయంలో తాను గడపగా పడి ఉండి, నిత్యం ఆ స్వామిని దర్శించాలని ఈ ఆళ్వార్లు ఆశపడినందున శ్రీవేంకటేశ్వరస్వామి గర్భాలయంలో ఉండే గడపకు **"కులశేఖరప్పడి"** అనే పేరు ప్రసిద్ధమైనది.

# శ్రీవారి సన్నిధిలో... శ్రీరామనవమి ఆస్థానం

తిరుమలలో చైత్రశుద్ధ నవమి శ్రీరాముని జన్మదినమైన శ్రీరామనవమిరోజు విశిష్ట ఉత్సవంగా జరుపబడుతున్నది. ఆ ఉత్సవాన్నే "శ్రీరామనవమి ఆస్థానం" అంటారు.

శ్రీరామనవమి పండుగరోజున ఉదయం ఆనంద నిలయంలో ప్రతిరోజు మాదిరే సుప్రభాతం జరిగిన తర్వాత భోగశ్రీనివాసమూర్తికి, శ్రీవేంకటేశ్వరస్వామివారి మూల విరాణ్మూర్తి బంగారుపాదపద్మాలకు ఆకాశగంగా తీర్థజలాలతో అభిషేకం జరుగుతుంది. ఆ తర్వాత ప్రత్యేకంగా శ్రీసీతారామ లక్ష్మణ హనుమంతుని పంచలోహ ఉత్సవమూర్తులకు కూడ ఏకాంతంగా అభిషేకం జరుపబడుతుంది. అభిషేకం అయిన తర్వాత ఈ శ్రీరాముని విగ్రహాలకు పట్టువస్త్రాలతో, విశేష ఆభరణాలతో, పుష్పమాలలతో అలంకారం జరుగుతుంది.

శ్రీరామనవమినాటి సాయంత్రం బంగారువాకిలిముందు శ్రీసీతారామలక్ష్మణుల మూర్తులను ఒక పల్లకిపై వేంచేపు చేసి సర్వాభరణాలతో, పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరిస్తారు. పిదప మరొక పీఠంపై హనుమంతుని కూడా వేంచేపు చేస్తారు. శ్రీరామనవమి పండుగ సాయంత్రం శ్రీరాములవారిని మాత్రం బంగారు హనుమద్వాహనంపై వేంచేపుచేసి తిరుమల పురవీధుల్లో ఊరేగింపు జరుగుతుంది.

ఉత్సవానంతరం ఆలయంలో బంగారువాకిలి దగ్గర బంగారుసర్వభూపాలవాహనంలో శ్రీసీతారామలక్ష్మణులకు, ఆస్థానం జరుగుతుంది. వీరి ప్రక్కన మరొక పల్లకిపై దక్షిణాభి ముఖంగా ఆంజనేయస్వామిని కూడ వేంచేపు చేస్తారు. ఇలా సర్వభూపాలవాహనంలో కొలువుదీరి ఉన్న శ్రీసీతారామలక్ష్మణ హనుమంతులకు అర్చకులు, పూజానివేదనలు చేసి వారిపై కుంకుమాక్షతలను ఆరోపణచేస్తారు. అనగా అక్షతలు చల్లుదురు. పిదప శ్రీరామచంద్రుల వారి అనుజ్ఞతో శ్రీమద్రామాయణంలో శ్రీరామజననవృత్తాంతాన్ని పౌరాణికులు శ్రావ్యంగా పఠిస్తూ వివరిస్తారు. పురాణ పఠనం అయిన తరువాత పౌరాణికులకు తాంబూల సత్కారం జరుపబడుతుంది. ఆ తర్వాత శ్రీసీతారామ లక్ష్మణహనుమంతులకు ఘనంగా నివేదన హారతులు సమర్పించ బడతాయి. ఆ తర్వాత ప్రసాదవినియోగం అయిన తర్వాత శ్రీసీతారామలక్ష్మణ హనుమంతులను ఆనందనిలయంలో ప్రవేశ పెట్టడంతో శ్రీరామనవమినాటి ఆస్థానంఘనంగా పూర్తి అవుతుంది.

శ్రీరామనవమినాడు తిరుమల పుణ్యక్షేత్రంలో జరిగే శ్రీరామనవమి ఆస్థానోత్సవం ద్వారా, ఆ త్రేతాయుగంనాటి రాముడే ఈనాటి వేంకటాద్రిరాముడు అని స్పష్టం చేస్తూ ఆ ఇద్దరూ ఒక్కరే అన్నట్లుగా రూఢి అవుతున్నది. ఇదే అభిప్రాయం తోనే కీర్తించిన అన్నమాచార్యుల వారి కీర్తనతో మనం అందరం శ్రీనివాసుని ప్రార్థించుదాం!

రామచంద్రు డితడు రఘువీరుడు
కామిత ఫలము లియ్యగలిగె నిందరికి
గౌతము భార్యపాలిట కామధేనువితడు
ఘాతల. గౌశికులపాలి కల్పవృక్షము
సీతాదేవి పాలిటి చింతామణీతడు
యీతడూ దాసుల పాలిట యిహపర దైవము.


శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు



పాఠకులకు, రచయిత(త్రు)లకు, ఏజెంట్లకు అందరికీ....

దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుని కరుణాకటాక్షవీక్షణాలు అందరిపై సదా ప్రసరించాలనీ మరియు ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలనీ స్వామివారిని ప్రార్థిస్తూ...

మీ.. ప్రధానసంపాదకుడు

# మహాసాధ్వి సుకన్య

- డా॥ ఎస్.లక్ష్మి

భారత మహిళాలోకానికి 'సుకన్య' జీవితం గొప్ప ఆదర్శం. ఆదర్శపత్నికి ఆమె చక్కటి ఉదాహరణ.

శర్యాతిమహారాజు ఏకైక కుమార్తె సుకన్య. ఆమె చదువులో సాక్షాత్తు సరస్వతి. అందంలో ఇంద్రపత్ని శచీదేవితో సమానురాలు. ఒకసారి వసంతకాలంలో మహారాజు శర్యాతి తన కుటుంబంతో కలసి వనవిహారానికి వెళ్ళాడు. అక్కడ యువరాణి, ఆమె చెలికత్తెలు కలసి ఆటలాడసాగారు.

అదే వనంలో చ్యవనుడనే పేరుగల మహర్షి చాలా కాలంగా తపస్సు చేస్తున్నాడు. చాలాకాలం అలా తపస్సులో ఉండిపోవడంతో ఆయన శరీరంచుట్టూ పుట్టలు పెరిగి ఆయన్ను పూర్తిగా కప్పివేశాయి. అరణ్యానికి వచ్చిన సుకన్య, ఆమె చెలి కత్తెల మధురస్వరాలతో ఆ మహర్షి ధ్యానసమాధి నుండి మేల్కొన్నాడు.



అడవిపూలు ఏరుకుంటున్న సుకన్య ఆ పుట్టకు ఉన్న రెండురంధ్రాలనుంచి రెండు రత్నాలలాంటివి మెరుస్తుండడం గమనించింది. నిజానికి అవి చ్యవనమహర్షి నేత్రాలు. ఆ సంగతి తెలియని సుకన్య, అవి ఏమిటో తెలుసుకోవాలనే కుతూహలంతో పక్కనే పడి ఉన్న వాడిగా ఉన్న ఓముల్లును తీసుకొని, మెరుస్తున్న ఆ రత్నాల్లాంటి వాటిని పొడిచింది. అలా సుకన్యతెలియక చేసిన ఆ అపరాధంవలన చ్యవనుడి కళ్ళుపోయాయి. అయితే ఆ మహాను భావుని పట్ల అపరాధం జరిగినందుకు రాజుకి, అతని పరివారానికి మలమూత్రాదులు స్తంభించి పోయాయి. దానితో ఈ విపరీతానికి గల కారణం గురించి అన్వేషించారు. అంతట వారికి చ్యవనమహర్షికి రాజకుమారి వలన కలిగిన పొరపాటు గురించి తెలిసింది. పశ్చాత్తాపంతో రాజు చ్యవనమహర్షికి తమ కుమార్తె వలన జరిగిన అపరాధానికి పరిహారంగా, తన కుమార్తెను వారి సేవలు చేసేందుకు వినియోగి స్తానని తెలిపి, కుమార్తె అంగీకారంతో ఆ మహర్షికిచ్చి వివాహం జరిపించాడు. అంతట రాజుకి, సమస్త రాజపరివారానికి కలిగిన ఆపద తొలగిపోయింది. మహాత్ములైన వారి ఎడల తెలిసిచేసినా, తెలియకచేసినా అపరాధం జరిగితే వారు ఊరకున్నా ప్రకృతి ధర్మం తనంతట తాను ఏవిధంగా ప్రవర్తిస్తుందో తెలిపేందుకు ఇది చక్కటి ఉదాహరణ.

చ్యవనుణ్ణి పెళ్ళాడిన యువరాణి సుకన్య ఆశ్రమజీవితం గడపసాగింది. వృద్ధుడూ, తన మూలంగా అంధుడూ అయిన భర్తకు ఎంతో

శ్రద్ధ, ప్రేమలతో సేవచేయసాగింది. ఆశ్రమజీవితానికి అనుగుణంగా కఠోరనియమాలను పాటిస్తూ, తీవ్రంగా తపస్సుచేస్తూ వచ్చింది. అలాగే, ప్రయాణంలో బడలికతో తమ ఆశ్రమం మీదుగా వెళుతున్న అతిథులను తల్లిలాగా ఆదరించి, వారి అవసరాలను తీర్చసాగింది. ప్రేమపూరితపత్ని, వినయసంపన్న అయిన శిష్యురాలు– ఈ రెండింటి మేలు కలయికగా ఆమె మెలగసాగింది.

ఒకరోజున సుకన్య నదీతీరానికి స్నానానికి వెళ్ళింది. సౌందర్యవంతులూ, వైద్యవిద్యలో నిష్ణాతులు, కవలలు అయిన అశ్వినీదేవతలు ఆమెను అక్కడ చూశారు. సుకన్య అందమైన రూపాన్ని చూసి మోహించిన అశ్వినీదేవతలు తామెవరో ఆమెకు చెప్పకుండా, తమలో ఒకరిని భర్తగా ఎంచుకోవాల్సిందిగా కోరారు. అయితే, సుకన్యమాత్రం తనకు చ్యవనుడితో వివాహమైందనీ, ఆయనే తనకు ప్రత్యక్షదైవమనీ తేల్చి చెప్పింది. ఆమె పతిభక్తికి సంతసించిన అశ్వినీదేవతలు తమ నిజ రూపాన్ని ఆమెకు చూపారు. తమకు కరతలామలకమైన వైద్య విద్యతో చ్యవనుడికి మళ్ళీ కంటిచూపు రప్పిస్తామనీ, అలాగే ఆయనకు తిరిగి యవ్వనం ప్రసాదిస్తామనీ చెప్పారు. అయితే, తాము అలాచేయడానికి వారు ఒక షరతుపెట్టారు. చ్యవనుడికి తిరిగి యవ్వనం ప్రసాదించిన తర్వాత తమ ముగ్గురిలో ఒకరిని ఆమె భర్తగా ఎంచుకోవాలని నిబంధన విధించారు.

సుకన్య ఈ సంగతంతా తనభర్త చ్యవనుడికి విన్నవించింది. అశ్వినీదేవతలుచేసిన ప్రతిపాదనకు ఆయన వెంటనే సమ్మతించాడు. అప్పుడు అశ్వినీదేవతలు చ్యవనుణ్ణి తీసుకొని వెళ్ళి, తమతోపాటు నదీజలాల్లో ముంచి, పైకిలేపారు. నీళ్ళలో నుంచి లేచి బయటకు వస్తున్నప్పుడు ఒక విచిత్రం జరిగింది. చ్యవనుడికి మళ్ళీ యవ్వనం, కంటిచూపు రావడంతోపాటు ఇద్దరు అశ్వినీదేవతలు కూడా ముమ్మూర్తులా చ్యవనుడి – లాంటి రూపంతోనే బయటకువచ్చారు. అలా ముగ్గురూ ఒకేవిధంగా ఉండటం సుకన్యను తికమక పెట్టింది. వారిలో ఒకరిని భర్తగా ఎంచుకోవాల్సిరావడం క్లిష్టమైన సమస్యగా మారింది.

అయితే, పరమసాధ్వి, సౌశీల్యవతీ అయిన సుకన్య తన పాతివ్రత్యమహిమతో అసలైన చ్యవనుడు ఎవరో కనిపెట్టగలిగింది. నేరుగా తన అసలు భర్తవద్దకువెళ్ళి, ఆయన పాదాలకు నమస్కరించింది. సుకన్య పాతివ్రత్యాన్ని పరీక్షించిన అశ్వినీదేవతలు ఆమె పతిభక్తిని కొనియాడారు. చ్యవన మహర్షిని, సుకన్యనూ ఆశీర్వదించి, అంతర్ధానమయ్యారు. ఆనాటినుంచీ ఈనాటివరకూ భారతనారీలోకంలో ఆదర్శప్రాయురాలైన పతివ్రతాశిరోమణిగా సుకన్యకథ చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది.



108 దివ్యదేశాలు

# తిరుచ్చేరై


– ఆచార్య చక్రవర్తి రంగనాథన్

**శ్రీమత్సార సరోజినీతట భువి శ్రీసారనాథో హరిః**
**పుణ్యం సారవిమానమత్ర మహిషీ శ్రీసారనాయక్యసౌ।**
**క్షేత్రం సారమ్ అతీవ సహ్యగిరిజా కృత్వా తపో దుష్కరం**
**గంగా ఖ్యాతిమ్ అవాప తత్ర హరిణా ప్రాచీ ముఖేన ఆదరాత్॥**

అసారమైనటువంటి ఈ సంసారసాగరంనుండి జీవులని ఉజ్జీవింపచేయడానికి దేవదేవుడు సంకల్పించుకుని భూలోకంలో 108 దివ్యక్షేత్రాలలో కొలువుతీరి ఉన్నాడు. ఆ ప్రకారంగా కుంభకోణానికి తూర్పుదక్షిణదిక్కులో 15 కిలోమీటర్ల దూరంలో రెండునదుల మధ్య 'నాచ్చియార్‌కోవిల్' అనే దివ్యదేశానికి ఐదు కిలోమీటర్ల దూరంలో, మూడు ప్రాకారములతో, రెండు రాజ గోపురాలతో అద్భుతమైన ప్రకృతిశోభతో విలసిల్లేటటువంటి దివ్యక్షేత్రమే **'తిరుచ్చేరై'**. ఈ క్షేత్రమునకు **'సారక్షేత్రమని'**, **'పంచ సారక్షేత్రమని'**, **'తిరుచ్చేరై'** అని వ్యవహారం కలదు.

## స్థలపురాణం

వేదాలను కాపాడడానికై బ్రహ్మదేవుడు ఒక చక్కటి మట్టికుండను తయారు చేయాలని సంకల్పించుకుని, మట్టికుండని తయారు చేయడానికి సిద్ధపడ్డాడు. ఎంత ప్రయత్నించినా కూడా ఆ కుండ తయారు కావడం లేదు. ఇలా ఎన్నో కుండలను తయారు చేశాడు, కానీ అవి అలాగే పగిలిపోతున్నాయి. ఇక ఈ వేదాలని కాపాడడానికి వేదనాయకుడు అయినటువంటి భగవంతుడైన శ్రీమన్నారాయణుని ప్రార్థించగా, దేవదేవుడు తాను వేంచేసి ఉన్నటువంటి తిరుచ్చేరైలోని మట్టి ద్వారా ఈ కుండను తయారు చేయమని ఆజ్ఞాపించాడు. బ్రహ్మదేవుడు అలాగే తీసుకొని సారమైనటువంటి వేదములను కాపాడడానికై, సారవంతమైన భూమినుండి గ్రహించిన మట్టితో కుండను తయారు చేశాడు. బ్రహ్మాండపురాణంలో ఆరు అధ్యాయాల్లో ఈ విషయం చెప్పబడి ఉన్నది. అంచేత సారమైన వేదములను ఈ క్షేత్రంయొక్క మట్టి చేత తయారు చేయబడిన కుండలో కాపాడాడు కనుక ఈ క్షేత్రానికి 'సారక్షేత్రమని' పేరు వచ్చినది.



ఈ క్షేత్రంలో ఒక విశేషం– స్వామి పక్కన అమ్మవారు సారనాయకిగా, శ్రీదేవి, భూదేవి, నీళాదేవి, మహాలక్ష్మి అని ఐదుమంది దేవేరులతో వేంచేసి ఉన్నాడు. మూలమూర్తి అయినటువంటి సారనాథుడు తూర్పుముఖంగా నిలుచున్న భంగిమలో అందరినీ అనుగ్రహిస్తూ ఉన్నాడు. పంచసార క్షేత్రం అంటే– 'స్వామి సారనాథుడు, సారక్షేత్రము, సారవిమానము, సార నాయకి, సారపుష్కరిణి' అని.

అలాగే శ్రీరాముడు, హనుమంతుడు, రుక్మిణి, సత్యభామ, శ్రీనరసింహుడు, మహాలక్ష్మి, నీళాదేవి మొదలగు దేవతామూర్తులకు ప్రత్యేకమైనటువంటి సన్నిధి కూడా కలదు. స్థలవృక్షము రావిచెట్టు.

## ఇంకొక ఐతిహ్యం

గంగ యమున సరస్వతి కావేరి ఈ నదులంతా కూడా ఇక్కడ మనుష్య రూపంలో సంచరిస్తున్నటువంటి సందర్భంలో విశ్వావసు అనేటువంటి గంధర్వుడు వాళ్లను చూచి నమస్కరించి వెళ్ళాడట. ఈ ఘటనను చూసిన వెంటనే అందరికీ ఒక విధమైనటువంటి సందేహం ఏర్పడింది. ఎవరిని చూసి నమస్కరిస్తున్నాడు? అని. అంటే ఆ నమస్కారానికి అర్హులు ఎవరు గంగయా, కావేరియా లేక సరస్వతియా అని. తిరిగి అదే మార్గంలో ఆ గంధర్వుడు వస్తూ మరలా నమస్కరించాడు. ఆ సమయంలో కావేరి నేరుగానే వెళ్లి 'మీరు ఎవరికి నమస్కరిస్తున్నారు?' అని అడిగిందట. అప్పుడు గంధర్వుడు 'ఎవరైతే మీలో గొప్పవారో వారికి నమస్కరించాను' అని చెప్పి వెళ్ళిపోయాడు. నన్నే నమస్కరించాడు అని ఇలా ఒకరికి ఒకరు పోటీపడుతున్నారట.

తిరుచ్చేరైలో మూలమూర్తి పేరు 'సారనాథుడు'



ఇలా పరస్పర కలహం ఏర్పడింది. కావేరి గంగా వీరి ఇరువురు బ్రహ్మదేవుడి దగ్గరికి వెళ్లి తమ యొక్క సందేహాన్ని వెలిబుచ్చారు. బ్రహ్మదేవుడు ఈ గంగకే నమస్కరించాడు. ఎందుకంటే ఆ త్రివిక్రమావతారంలో ఆ విష్ణువుయొక్క పాదం నుండి ఉద్భవించింది కనుక. కానీ కావేరీనది నేరుగా ఆ భగవంతుణ్ణి ప్రార్థించిందట. భగవంతుడు ఆ కావేరీనదికి ప్రత్యక్షమై 'గంగా నది కన్నా కావేరీనది ఉత్కృష్టమైనది అని పిలువబడుతావు' అని తెలిపాడు. ఆ ప్రకారంగా, ఆ ఉభయకావేరీ నడుమనే రంగనాథుడు వేంచేసి అనుగ్రహిస్తున్నాడు. ఈ ఐతిహ్యంలో కావేరీనది వైభవాన్ని విశేషంగా తమిళ త్రైమాసంలో పుష్య నక్షత్రంలో అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. కావేరీనది ఒక బిడ్డను తన చేతిలో పెట్టుకున్న విధంగా కూడా మనంచూడొచ్చు. కనుక ఇలా కావేరీనదిని భగవంతుడు అనుగ్రహించాడు.

మార్కండేయమహర్షి తమ తపస్సుమూలంగా సారనాథ స్వామిని దర్శించుకున్నాడు. తిరుమంగై ఆళ్వారు ఒక్కరే 13 పాశురాలతో ఈ సారనాథభగవంతుని మంగళాశాసనం చేశారు. భాగవత శ్రేష్ఠతను ప్రతిపాదించారు. ఈ క్షేత్రంలో పాంచరాత్ర ఆగమంగా ఆరాధనలు జరుగుతాయి. ఈ స్వామిని ఎవరైతే దర్శించుకుంటారో వారికి సకలపాపములు తొలగి భగవంతుని యొక్క అనుగ్రహాన్ని పొందుతారు.

## శ్రీవారి ఆలయంలో.. ఉగాది ఆస్థానం

శ్రీవైకుంఠంనుండి భక్తులకోసమే భూలోకానికి తరలి వచ్చి, తెలుగునేలలో ఇల్లు గట్టుకొని తెలుగువారి ఇలవేలుపుగా, ఇలువేల్పుగా స్థిరంగా నిలిచిన శ్రీవేంకటేశ్వరస్వామి కూడ తెలుగు వారి మాదిరే తెలుగు సంవత్సరాది పండుగను చేసుకుంటున్నారు. దానినే "ఉగాది ఆస్థానం" అంటారు.

బంగారువాకిలి ముందరగల తిరుమహామణిమండపం (ఘంటామండపం)లో, బంగారువాకిలికి ఎదురుగా ఉన్న గరుడాళ్వారుకు అభిముఖంగా, బంగారుసర్వభూపాలవాహనంలో దేవేరులతో కూడ శ్రీమలయప్పస్వామివారిని వేంచేపు చేస్తారు.

శ్రీమలయప్పస్వామివారి ఎడమ ప్రక్కన మరొకపీఠంపై దక్షిణాభిముఖంగా శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనులవారిని కూడ వేంచేపు చేసి ఆభరణాలతో, పూలమాలలతో అలంకరిస్తారు. ఆనందనిలయంలోని మూలవిరాణ్మూర్తికి బంగారువాకిలి దగ్గర సర్వభూపాలవాహనంలో వేంచేసివున్న శ్రీవారి ఉత్సవమూర్తులకు, సేనాధిపతి విష్వక్సేనునికి విశేషమైన పడి ప్రసాదాలు, అన్నప్రసాదాలు నివేదింపబడతాయి. అర్చకులు, జియ్యంగార్లు సమర్పించిన ఆరుపట్టువస్త్రాల్లో నాలిగింటిని శ్రీవేంకటేశ్వర స్వామివారి మూలమూర్తికి అలంకరిస్తారు. ఒక వస్త్రాన్ని కిరీటానికి, రెండవదాన్ని నందకఖడ్గానికి, మూడవదాన్ని ఆదితోమాలగాను, నాలుగవదాన్ని ఉత్తరీయంగాను అలంకరిస్తారు. మిగిలిన రెండుపట్టువస్త్రాల్లో ఒకదాన్ని ఉత్సవమూర్తులైన శ్రీమలయప్పస్వామికి, రెండవదాన్ని విష్వక్సేనులకు అలంకరిస్తారు.

ఆపై శ్రీవారికి ఆస్థానం జరుగుతుంది. శ్రీస్వామివారి పాదాలమీద ఉన్న పంచాంగాన్ని తీసుకొని ఆస్థానసిద్ధాంతి శ్రీస్వామివారికి నూతనపంచాంగశ్రవణం చేయిస్తారు. ఆనాటి తిథి, వార నక్షత్రాలతో పాటుగా నూతన సంవత్సర ఫలితాలు, లాభనష్టాలు, నవగ్రహాలగతులు, సస్యవృద్ధి, పశువృద్ధి మున్నగు విషయాలతోపాటు 27నక్షత్ర జాతకుల కందాయఫలాలు, రాజ పూజ్యత, అవమానాలను పంచాంగశ్రవణంలో శ్రీస్వామివారికి వినిపించబడతాయి. ఇక ఆ సాయంత్రం తిరుమల పురవీథుల్లో శ్రీదేవిభూదేవిసమేతంగా శ్రీమలయప్పస్వామి ఊరేగుతూ భక్తులకు నూతనసంవత్సర ఆశీస్సులతోపాటు దివ్యదర్శనాన్ని అనుగ్రహిస్తారు.



తిరుమల శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానం
(22-03-2023)

# శ్రీరామచంద్రచరణౌ శరణం ప్రపద్యే!!!

- డా॥ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు, 94919 46070



సకల సద్గుణాలను తనలో ఇముడ్చుకుని.. తన శీల సంపదతో ప్రపంచానికంతటికీ ఆదర్శపురుషునిగా నిలిచిన శ్రీరామచంద్రమూర్తి సకల లోక ఆరాధ్యుడు. శ్రీరాముడి రాజ్యం 'అయోధ్యరాజ్యమే' అయినా తెలుగునేలలోని అనేక ప్రాంతాలు ఆయన పాదధూళితో పునీతమైనట్లుగా చెప్పబడుతూ ఉన్నాయి. శ్రీరాముడు వనవాస, సీతాన్వేషణ సమయంలోనూ, రావణాసురుణ్ణి అంతమొందించి తిరిగి అయోధ్యకు వెళ్ళే సమయంలోనూ ఉండినట్లుగా చెప్పబడిన క్షేత్రాలు తెలుగునేల నలుచెరగులా ఉన్నాయి.

అట్టి క్షేత్రాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం పాలనలో ఉన్న క్షేత్రాలు ముఖ్యమైనవి. శ్రీరామనవమి సందర్భంగా వాటిని దర్శించడం, స్మరించడంవల్ల అనంతమైన పుణ్యఫలాలు లభిస్తాయి. 'సప్తగిరి' పాఠకుల కోసం....

## శ్రీ రాములవారి మేడ, తిరుమల



కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరస్వామి వారు కొలువుదీరిన బంగారు గర్భాలయమైన ఆనందనిలయంలో ఘంటామండపం, స్నపనమండపం అనంతరం ఉన్న ఇరుకైన నడవే 'రాములవారి మేడ'. శ్రీసీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులు శ్రీవారి గర్భాలయంలో శ్రీవేంకటేశ్వరుని పంచబేరాలతో కొలువై ఉండగా, ఈ మేడలో రాములవారి సేవాపరివారదేవతలైన సుగ్రీవాదులు ఎత్తైన అరుగుమీద ఉండడం వల్ల, దీనికి రాములవారిమేడ అనే పేరు ఏర్పడింది. సీతాదేవిని అన్వేషిస్తూ రామ, లక్ష్మణులు వేంకటాద్రిని దర్శించడంవల్ల సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులను ఆలయంలో ఏర్పాటు చేసినట్లు చెప్పబడుతోంది. గర్భాలయంలో ఈ మూర్తులకు శ్రీరామనవమినాడు ఆస్థానం, మరుసటిరోజు పట్టాభిషేకాలను నిర్వహిస్తారు. ప్రతినెలా పునర్వసునక్షత్రంనాడు శ్రీరాములవారు సహస్రదీపాలంకరణసేవలో పాల్గొంటారు. వార్షిక తెప్పోత్సవాలలో కూడా ఒకనాడు శ్రీసీతారామ లక్ష్మణులు తెప్పపై విహరిస్తూ భక్తులను అనుగ్రహిస్తారు. ఈ ఆలయం తిరుపతి నుంచి దాదాపు 22 కి.మీ. దూరంలో ఉంది.

## శ్రీకోదండరామస్వామివారు, ఒంటిమిట్ట



పితృవాక్యపాలకుడై అరణ్యవాసం చేస్తూ ఉన్న శ్రీరాముడు ఈ ప్రాంతానికి చేరుకుని కొంతకాలం గడిపి, రాక్షసుల బారినుంచి మునులను కాపాడారు. ఈవిధంగా మునుల ప్రార్థనలను విని శ్రీరాముడు అంబులపొది, పిడిబాకు, కోదండములను ధరించి ఇక్కడకు వచ్చినట్లూ, అందువల్ల ఈ స్వామివారికి 'శ్రీకోదండరామస్వామి' అని పేరు వచ్చినట్లు తెలుస్తోంది. తర్వాతి కాలంలో జాంబవంతుడు ఈ ప్రాంతానికి చేరుకొని ఒకరోజు రాత్రికావడంతో విశ్రమించాడు. ఆ రాత్రి స్వప్నంలో శ్రీరాములవారు కలలో సాక్షాత్కరించి తాము విగ్రహరూపంలో ఆ ప్రాంతంలో ఉన్నామని, ఆ విగ్రహాలను ప్రతిష్ఠింప జేయమని తెలిపాడు. ఆ మరుసటి దినమే జాంబవంతుడు చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో వెతికి, శ్రీసీతారామలక్ష్మణ విగ్రహాలను బయటకు తీసి ప్రతిష్ఠించినట్లు స్థలపురాణం వెల్లడిస్తూ ఉంది. ఆలయంలోని ప్రధాన గర్భాలయంలో ఒకే శిలలో తయారు చేయబడిన శ్రీసీతారామలక్ష్మణమూర్తులు కొలువుదీరి దర్శనం ఇస్తారు. అందువల్ల ఈ క్షేత్రానికి 'ఏకశిలా'నగరం అని పేరు. ఈ ఆలయం తిరుపతి నుంచి దాదాపు 117 కి.మీ. దూరంలో ఉంది.

## శ్రీకోదండరామస్వామివారు, తిరుపతి



తిరుమల పాదాల చెంత ఉన్న తిరుపతి పట్టణంలో శ్రీకోదండరామస్వామి వారు కొలువుదీరారు. లంకారాజ్యంపై దండెత్తి రావణాసురుణ్ణి అంతమొందించి సీతా దేవిని వెంట బెట్టుకుని శ్రీరాముడు అయోధ్యకు బయలుదేరాడు. అయోధ్యకు వెళ్తూ మార్గ మధ్యలో తిరుపతిలో ప్రస్తుత ఆలయం ఉన్న ప్రాంతంలో కొంతకాలం విశ్రాంతికై ఆగినట్లు ఐతిహ్యం. తర్వాత శ్రీరాముడు అయోధ్యకు బయలుదేరాడు. ఈ సమయంలో జాంబవంతుడు ఇక్కడ ఆలయాన్ని నిర్మింపజేసి దేవతామూర్తులను ప్రతిష్ఠించినట్లు కథనం. తిరుపతి నడిబొడ్డున విశాలమైన ఆలయంలోని గర్భాలయంలో శ్రీరామచంద్రమూర్తి చేతులలో కోదండం, బాణంను ధరించి 'శ్రీకోదండరాముడి'గా కొలువుదీరి ఉండగా.. మామూలుకు భిన్నంగా కుడివైపున శ్రీసీతాదేవి, ఎడమవైక్కన శ్రీలక్ష్మణమూర్తి కొలువుదీరి ఉన్నారు. ఈ ఆలయం తిరుపతి రైల్వేస్టేషన్ నుండి దాదాపు 2 కి.మీ. దూరంలో ఉంది.

## శ్రీపట్టాభిరామస్వామివారు, వాల్మీకిపురం



ఈ ఆలయంలో శ్రీరాముడు 'శ్రీపట్టాభిరామస్వామి'గా కొలువుదీరి భక్తుల కోరికలు తీర్చే దేవుడుగా పేరుపొంది ఆరాధనలు అందుకుంటూ ఉన్నాడు. పూర్వం ఒకసారి జాంబవంతుడు అయోధ్యకు చేరుకుని శ్రీరాముడిని దర్శించుకుని తిరిగి బయలు దేరాడు. మార్గమధ్యంలో ఈ ప్రాంతానికి చేరేటప్పటికి ఒక పుట్టనుంచి వెలుగువస్తూ ఉండడం గమనించి పుట్టను తొలగించి చూడగా.. శ్రీరామచంద్రమూర్తి మూర్తులు లభించాయి. దీనితో ఆలయాన్ని నిర్మింపజేసి స్వామివారలను ప్రతిష్ఠించినట్లు కథనం. వాల్మీకిపురం నడిబొడ్డున విశాలమైన ప్రాంగణంలో ఉన్న ఆలయ ప్రధాన గర్భాలయంలో శ్రీరాముడు సీతా దేవితో పాటు సోదరులందరితో కలిసి కొలువుదీరి దర్శనమిస్తాడు. ఈ ఆలయం తిరుపతి నుంచి దాదాపు 93 కి.మీ. దూరంలో ఉంది. పదకవితా పితామహుడు అన్నమయ్య కీర్తించిన వాల్మీకిపురం శ్రీపట్టాభిరామస్వామిని దర్శించడం వల్ల కోరిన కోరికలన్నీ నెరవేరుతాయి.

## శ్రీకోదండరామస్వామివారు, చంద్రగిరి



ఈ ఆలయంలో శ్రీరాముడు 'శ్రీకోదండరామస్వామి'గా కొలువుదీరి దర్శించినంతనే కుటుంబసభ్యుల మధ్య అన్యోన్యతను కలిగించే దేవుడుగా పేరుపొంది ఆరాధనలందుకుంటూ ఉన్నాడు. చంద్రగిరి విజయనగర పాలకుల స్వాధీనంలో ఉండేది. తరచూ విజయనగరచక్రవర్తులు ఈ కోటకు వచ్చేవారు. వారు ఇక్కడనుంచే తిరుమలకు వెళ్లి స్వామివారిని దర్శించి సేవించేవారు. అటువంటి విజయనగరచక్రవర్తుల స్థానిక అధికారి 16వ శతాబ్దంలో ఒకనాడు అలసిపోయి కోట సమీపంలో విశ్రాంతి తీసుకుంటూ ఉన్న సమయంలో స్వప్నంలో స్వామివారు సాక్షాత్కరించి తన ఉనికిని చెప్పగా ఆయన స్వామివారలను గుర్తించి ఆలయం నిర్మించి ప్రతిష్ఠించినట్లు కథనం. ఆలయ ప్రధాన గర్భాలయంలో శ్రీరాముడు శ్రీసీతాదేవితో పాటు సోదరులందరితో కలిసి దర్శనం ఇవ్వడం విశేషం. వీరందరూ ఏకపీఠంపై ఉండడం విశేషం. ఈ ఆలయం తిరుపతి నుండి దాదాపు 15 కి.మీ. దూరంలో ఉంది. ఈ స్వామిని దర్శించడం వల్ల కుటుంబ సభ్యులమధ్య అనురాగం వృద్ధి చెందుతుంది.

॥ శ్రీరామచంద్రచరణౌమనసా స్మరామి, శ్రీరామచంద్రచరణౌ వచసా గృణామి, శ్రీరామచంద్రచరణౌ శిరసా నమామి, శ్రీరామచంద్రచరణౌ శరణం ప్రపద్యే ॥



28-01-2023న తిరుమలలో జరిగిన 'రథసప్తమి' న సూర్యప్రభవాహనసేవలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్. దంపతులు. వీరితో బాటు తి.తి.దే. తిరుపతి సంయుక్త కార్యనిర్వహణాధికారిణి శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షుల గారి సతీమణి శ్రీమతి వై.స్వర్ణలత మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



28-01-2023న తిరుమలలో 'రథసప్తమి' ఉత్సవం సందర్భంగా కల్పవృక్షవాహనసేవలో పాల్గొన తి.తి.దే. తిరుపతి సంయుక్త కార్యనిర్వహణాధికారిణి శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., సి.ఏ.ఓ. శ్రీ శేషశైలేంద్ర, ఐ.ఆర్.ఎస్., తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షుల గారి సతీమణి శ్రీమతి వై.స్వర్ణలత మరియు ఇతర అధికారులు.



28-01-2023న తిరుచానూరులో 'రథసప్తమి' ఉత్సవం సందర్భంగా సూర్యప్రభవాహనసేవలో శ్రీపద్మావతీఅమ్మవారు వేంచేసి భక్తులను అనుగ్రహిస్తున్న దృశ్యం.



25-01-2023న తి.తి.దే. బర్డ్ ఆస్పత్రిలో అత్యాధునిక నూతన రక్తపరీక్షల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఎ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్. ఈ కార్యక్రమంలో తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారిణి శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., బర్డ్ ఆసుపత్రి ప్రత్యేకాధికారి డా॥ రెడ్డప్పరెడ్డి, శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆసుపత్రి డైరెక్టర్ డా॥ శ్రీనాథ్‌రెడ్డి మరియు ఇతర అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.



26-01-2023న తిరుపతి పరిపాలనాభవనంలో భారతగణతంత్ర వేడుకల్లో జాతీయజెండాను ఎగురవేసి వందనం చేస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఎ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్. ఇందులో తిరుపతి సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., సి.వి.&ఎస్.ఓ. శ్రీ నరసింహకిషోర్, ఐ.పి.ఎస్., అదనపు సి.వి.&ఎస్.ఓ. శ్రీ శివకుమార్ రెడ్డి మరియు తి.తి.దే. ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



31-01-2023న విశాఖశారదాపీఠంలో తి.తి.దే. నిర్వహించిన చతుర్వేదహవన పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న విశాఖశారదా పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామివారు. ఇందులో తి.తి.దే. ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి గారు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



21-01-2023న తిరుమల నారాయణగిరి ఉద్యానవనాల్లో శ్రీపురందరదాసుల ఆరాధన మహోత్సవం జరిగిన దృశ్యం. ఇందులో కర్ణాటక ముళబాగళ్ శ్రీపాదరాజ మఠాధిపతి శ్రీసుజయనిధితీర్థస్వామివారు, తి.తి.దేవస్థానముల సంయుక్త కార్యనిర్వహణాధికారిణి శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షుల గారి సతీమణి శ్రీమతి వై.స్వర్ణలత, దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి శ్రీఆనందతీర్థాచార్యులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



27-01-2023న తి.తి.దేవస్థానమ్స్ మొబైల్ యాప్‌ను ప్రారంభించిన తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఎ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్. ఇందులో తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., గారు పాల్గొన్నారు.

# వేదం 'శ్రీమహాలక్ష్మి'

- డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు

"వేదం మహాలక్ష్మి వంటిది" అనే సామ్యాన్ని అను సరించి వేదవైభవాన్ని తెలుసుకుందాం.

వేదం మహాలక్ష్మివంటిది అనే సామ్యాన్ని ఎవరు తెలియజేశారు? అని అంటే, వేదమే స్వయంగా తెలియజేస్తు న్నది. అంతేకాక, 'యతిరాజసప్తతి', 'లక్ష్మీసహస్రనామస్తుతి', ఇంకా మరి కొన్ని గ్రంథాలు ఈ విషయాన్ని తెలుపుతున్నాయి.

దేశికులు యతిరాజసప్తతిలో వారు భగవద్రామానుజు లను స్తుతిస్తూ, ఒక తనియన్ శ్లోకాన్ని అనుగ్రహించారు. ఆ శ్లోకం ఏమంటే, "ప్రణామం లక్ష్మణమునిః ప్రతిగృహ్ణాతు మామకమ్, ప్రసాధయతి యత్సూక్తిః స్వాధీనపతికాం శ్రుతిమ్" అని. ఈ శ్లోకంలో మనకు ప్రస్తుతం ఆవశ్యకమైనది "స్వాధీన పతికాం శ్రుతిమ్" అనే సూక్తి.

వేదం అనేది ఒక కాంత. ఆమె స్వాధీనపతిక. కావ్య నాయికలలో స్వాధీనపతిక అనే ఒక నాయకి ఉన్నది. తన పతిని తన స్వాధీనంలో పెట్టుకోగలిగిన నాయిక పేరు ఇది. ఈ వేదకాంత అనే స్వాధీనపతికకు ఎవరు పతి? అని అంటే, భగవంతుడైన శ్రీమన్నారాయణుడే. "నిత్యాస్స్వయంవరపతిః వ్యపహంత్వనిత్యామ్" అని శతదూషణి అనే గ్రంథంలో దేశికులు ఒక శ్లోకాన్ని అనుగ్రహిస్తూ, నిత్య అయిన వేదానికి స్వయం వరపతి భగవంతుడే అని అన్నారు. స్వయంవరపతి అంటే తానుగా వరించిన భర్త. అంటే, వేదకాంత తనకు భర్తగా భగవంతుని తానే వరించింది? అని భావం. ఈ విధంగా వేదమనే కాంతకు భర్త శ్రీమన్నారాయణుడు అయినందున, ఆమె లక్ష్మితో సమానమైనదని ధ్వనిస్తున్నది.

పూర్వకాలంలో మహారాణులకు సైరంధ్రులు అనే పేరు కలిగిన సేవకురాండ్రు ఉండేవారు. వారు మహారాణులకు తల దువ్వి, చక్కగా అందంగా అలంకరించేవారు. విరాటరాజుపత్నికి ద్రౌపది సైరంధ్రియై, ఆమెకు సేవలను చేసిన కథ మహా భారతంలో ప్రసిద్ధం కదా. "రాజాధిరాజః సర్వేషామ్" అనే విధంగా రాజాధిరాజు అయిన భగవంతునకు పత్ని అయిన వేదకాంతకు కూడా ఈ విధంగా కొంతమంది సైరంధ్రులు ఉంటారుకదా. వారు ఎవరు? అంటే, భగవద్రామానుజులు అనుగ్రహించిన 'శ్రీసూక్తులే' అని అంటున్నారు దేశికులు. శ్రీభాష్యకారులు పలికిన శ్రీసూక్తులు అనే సైరంధ్రులు వేదకాంత అనే మహారాణిని అందంగా సింగారిస్తున్నారు. వేదకాంతకు శుశ్రూషను చేస్తున్నారు. యతిరాజుల 'సూక్తులు' అనే సైరంధ్రులు వేదకాంతను ఏ విధంగా అలంకరిస్తున్నారు? అని అంటే-

'ఇంతకు ముందు వేదకాంత విషయంలో కొంతమంది ఆమె అందానికి వైభవానికి కల్గించి అపచారం చేశారు. లోటును కలిగించారు. క్లేశాన్ని కలిగించారు. ఏ విధంగా? అంటే, వేదంలోని అర్థాలకు అపార్థాలను చెప్పి, ఆమెకు విరూపాన్ని కలిగించారు. కానీ, శ్రీరామానుజుల శ్రీసూక్తులు వేదకాంత సంతోషించే విధంగా తగిన విధంగా అందమైన అర్థాలను తెలియజేసి ఆమెకు అలంకారం చేసి ఆమె అందాన్ని బహుగుణీకృతం చేశారు. ఈ విధంగా వేదకాంతను అందంగా అలంకరించడంలో, ఆమె శోభను పెంపొందించడంలో సామ ర్థ్యాన్ని కలిగిన శ్రీరామానుజుల సూక్తులు సైరంధ్రులవంటివి అయినవి. మహాలక్ష్మి అనదగిన వేదకాంతకు అవి అద్వితీయ మైన అందాన్ని కలిగించాయి. ఇటువంటి సూక్తులను అనుగ్ర హించిన భగవద్రారామానుజులకు నేను నమస్కరిస్తున్నాను- అని దేశికులు వ్యాఖ్యానించారు.

పై వ్యాఖ్యానం వల్ల మనకు- 'వేదం భగవంతునకు పత్నివంటిది అని, సాధారణ పత్ని కాదు, స్వాధీనపతిక అయిన పత్ని' అనే భావం ఏర్పడుతున్నది.

ఇక్కడ మనం మహాలక్ష్మికి, వేదానికి మధ్య ఉండే ఐదారు చక్కని సామ్యాలను గమనించవచ్చు. మొదటి సామ్యం ఏమంటే, ఈ ఇద్దరూ శుచి అయినవారు, మంగళకరమైనవారు? అనేది. శుచి అంటే పవిత్రమైనది? అని అర్థం. లక్ష్మీదేవి "శుచిం స్వాహాం స్వధాం సుధామ్" అని లక్ష్మీఅష్టోత్తరశతనామ స్తోత్రంలో "శుచి" అని చెప్పబడుతున్నది. మనలను పరిశుద్ధ లను చేసేది, శుద్ధి కలిగిన చోట్ల నివసించేదికదా! లక్ష్మీదేవి. వేదం కూడా శుచి అయినదే. మనకు ఏ కారణం చేతనైనా అపవిత్రత కలిగితే, ఆ అపవిత్రతను పోగొట్టగలిగినది వేదమే

కదా! వేదం ద్వారా ప్రాయశ్చిత్తాన్ని చేసుకోవచ్చు. వేదాన్ని *"అపహతపాప్మా వేదపవిత్రమ్"* అని వేదమే పలుకుతున్నది. అంతటి శుచి అయినది వేదం.

లక్ష్మి మంగళదేవత. *"మాతః! మంగళదేవతే!"* అని ఆమె మంగళదేవతగా ప్రసిద్ధి చెందినది. వేదాన్ని *"మంగళమ్ శేర్ నాన్మఱై"* అని మంగళకరంగా ఆళ్వారులు కీర్తించారు.

ఇంకొక సామ్యం ఏమంటే? ఈ ఇద్దరికీ దైవీస్వభావం ఉన్నది. *"దైవీం వాచ మజనయంత దేవాః"* అనే విధంగా వేదం దైవీ వాక్. మహాలక్ష్మి కూడా *"దంపతీ దైవతం నః"* అని దైవీస్వభావాన్ని కలిగినది.

వేదం, లక్ష్మీదేవి అనే ఇద్దరు స్వాధీనపతికలు– అనేది ఇంకొక సామ్యం. మహాలక్ష్మి స్వాధీనపతిక ఏ విధంగా అవుతున్నది? అని అంటే, భగవంతుడు ఆమె ఇంగితాలను, అభిప్రాయాన్ని గమనించియే సృష్టి, స్థితి, లయాది సమస్త కార్యాలను చేస్తున్నాడు. అంతటి పరిమితిలో ఆమె తన భర్తను



తనకు స్వాధీనం చేసుకున్నది. *"యద్భ్రూభఙ్గాః ప్రమాణం స్థిరచర రచనా తారతమ్యే మురారేః"* అని అన్నారు భట్టర్. వేదం కూడా స్వాధీన పతిక ఏ విధంగా అయినది? అని అంటే, *"మంత్రాధీనం తు దైవతమ్"* అనే విధంగా భగవంతుడు మంత్రానికి అధీనుడు. వేదం మంత్రరూపమైనది కదా. కనుక వేదమంత్ర ప్రతిపాద్యుడైన భగవానుడు ఆ వేదానికి అధీనుడు అని తెలుస్తున్నది కదా!

ఈ ఇద్దరి మధ్య ఉండే మరి ఒక సామ్యం ఏమంటే, 'పారార్థ్యం' అనేది. పతికి పత్ని పరార్థమై ఉంటుంది, పర తంత్రగా ఉంటుంది. అంటే, తన జీవితం, సర్వస్వం పతికే చెందినదని భావించి సమర్పిస్తుంది. *"కొండానై యల్లాల్ అఱియా క్కుల మకళ్ పోల్"* (తనను గ్రహించిన పతిని తప్ప వేరొకనిని తెలియని కులసతి వలె) అని కులశేఖరాళ్వారులు అంటారు. ఆ విధంగా మహాలక్ష్మి భగవంతునకు పరతంత్రయై ఉంటుంది. శ్రుతి కూడా ఆ విధంగానే భగవంతునకు పర తంత్ర. *"సర్వే వేదా యత్పదమామనంతి"* అని, *"వేదైశ్చ సర్వైః అహ మేవ వేద్యః"* అని చెప్పబడే విధంగా భగవంతుని కోసంగానే వేదాలు ఉన్నాయి.

ఈ ఇద్దరికీ నామసామ్యం కూడా ఉన్నది. 'శ్రుతి' అనే పేరు మహాలక్ష్మికి ఉన్నది. 'లక్ష్మి' అనే పేరు వేదానికి ఉన్నది. అది ఏ విధంగా? అంటే, లక్ష్మీసహస్రనామస్తోత్రంలో *"ఓం శ్రుతయే నమః, ఓం వేదరూపాయై నమః"* అనే నామాలు లక్ష్మీదేవికి ఉన్నవి. ఆ విధంగానే, వేదానికి లక్ష్మి నామం ఏ విధంగా ఉన్నది అంటే, వేదమే *"ఋచో యజూంషి సామాని, సా హి శ్రీ రమృతా సతామ్"* అని అంటూ ఋగ్వేద యజుర్వేద సామవేదరూపమైన వేదం 'శ్రీః' అని అంటున్నది. అమృత రూపమైన 'శ్రీ' వేదమే, అని వేదమే తెలుపుతున్నది. ఇది నామసామ్యం.

ఈ విధంగా వేదానికి లక్ష్మీదేవికి మధ్య పలు ప్రకారాలుగా సామ్యం ఉన్నదని తెలిసి, తద్వారా వేదానికి శుచిత్వం, మాంగల్యం, పరిశుద్ధి, దైవత్వం, స్వాధీనపతికాత్వం, పారార్థ్యం మొదలైన పలు మహిమలు ఉన్నట్లు మనం గుర్తించాలి. **'వేదమే లక్ష్మి, లక్ష్మియే వేదం'.**

*ఓమ్ వేదరూపాయై మహాలక్ష్మ్యై నమః*

మార్చి 24
మత్స్యజయంతి సందర్భంగా..

# మత్స్యవిభూతి

- డా॥ సూరం శ్రీనివాసులు

శతపథ బ్రాహ్మణం *"మనవేహ వై ప్రాతః అవనేజ్య ముదకమాజహుర్యథేదం పాణిభ్యామవనే జనాయా"(ప్రథమ కాండ-8-6)* లోనే మత్స్యావతారకథ కనిపిస్తుంది.

విష్ణువు ఒక చిన్న చేప పిల్లలా అవతరించి పెరిగి పెరిగి మహామత్స్యమై వేదాలను ఉద్ధరించటంతో పాటు చరాచర జగద్బీజరక్షణను కూడా చేసి లోకోద్ధరణకు నాంది పలికాడు. మత్స్యపురాణం **"భూతగ్రామస్య సర్వస్య స్థావరస్య చరస్య చ"** ప్రళయకాలం సంభవించినప్పుడు చరాచరభూత సమూహాన్ని రక్షించడానికి నాకు శక్తి కావాలని వైవస్వత మనువు బ్రహ్మను కోరాడట. తత్ఫలితంగా విష్ణువు మత్స్యరూపాన్ని ధరించవలసి వచ్చింది.

అగ్నిపురాణంలో ద్వితీయ అధ్యాయంలోనే **'మత్స్యావతారం వక్ష్యేహం వసిష్ఠశృణుమే హరేః'** మత్స్యావతార ప్రయోజనం దుష్టనాశనం, సజ్జనపాలనం అని కంఠోక్తిగా చెప్పి బీజ సంరక్షణతో పాటు వేదాలను అపహరించిన సోమకుని కూడా సంహరించి విష్ణువు వేదాలను సంరక్షించాడట. మహాభారతం వనపర్వంలోని 187వ అధ్యాయంలో మత్స్యావతారకథ కనిపిస్తుంది. చక్కని సంవాద రూపంగా మత్స్యమనువులు మధ్య సాగే సంభాషణ మనస్సులను ఆకట్టుకుంటుంది. అయితే ఆ సందర్భంలో వేదాపహరణం, వాటి సముద్ధరణం ఈ ప్రస్తావన కనిపించదు. చరాచరబీజ సంరక్షణమే కథా భాగమై అవతార ప్రయోజనాలలోని ఒక్క అంశాన్ని అందంగా ప్రకటించి, ప్రదర్శించిన అధ్యాయమిది. చిన్నకుండస్థాయి నుండీ సముద్రమంత పెరిగిన ఆ చేప వైవస్వతమనువుకు బీజసంరక్షణకార్యాన్ని నిర్దేశించి, దానిని పూర్తి చేయించి, ఆయనను కృతార్థుని చేయటమేకాక లోకాలను పునర్నిర్మించటానికి అవసరమైన విధిని ముగించి నిష్క్రమిస్తుంది. దీనివల్లనే **'ధాతా యథాపూర్వమకల్పయత్'** (అంతకు ముందులాగా బ్రహ్మ సృష్టించాడు) అనటానికి అవకాశమేర్పడింది.

**"సంప్రక్షాళనకాలోఽయం లోకానాం సముపస్థితః"**
**(మహాభారత-వన-187-29)**

ఇది మత్స్యవచనం. సాధారణంగా అవతారాలలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ లేదా ధర్మరక్షణ, అధర్మశిక్షణప్రధాన ప్రయోజనంగా కనిపిస్తాయి. ఇతర అవతారాలలో ఏ ఒకరినో, ఏ కొందరినో రక్షించుటయో, శిక్షించటమో అవతార లక్ష్యం. అయితే ఈ మత్స్యావతారంలో సమస్తవిశ్వాన్ని పునర్నిర్మింపజేయటం అవతార లక్ష్యం. అందుకే ఇది విశిష్టం. శక్తివంతమైన ప్రథమావతారం.

భాగవతంలో వివరంగా వైవస్వతమనువును ఉద్ధరించినట్లుగా ఉన్న ఈ కథను పోతన తన సహజశైలిలో విస్తరించి హృదయరంజకంగా తీర్చిదిద్దాడు. సత్యవ్రతుని (వైవస్వతమనువు) చేత చిక్కిన చేపను, ఆయన ప్రార్థించిన తీరు మాత్స్యన్యాయాన్ని ధ్రువపరుస్తుంది. చిన చేపను పెద చేప తినటం మాత్స్యన్యాయం. అది ప్రకృతికి సహజమైన గుణం. ఆ భీతితో చిరుమీను ఇలా అడిగింది-

**"పాటువచ్చిన జ్ఞాతిఘాతులు పాపజాతి ఝషంబు....**
**రక్షింపు దీనవత్సల! ప్రక్షీణులం గాచుకంటె భాగ్యము కలదే."**

## వైకుంఠపాళి
## :: 86 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1 భా | 2 ర | తి | | 3 ఇ | 4 ల | | 5 భా |
| 6 సా | | తి | | 7 క | | క్ష్మి | | ను |
| 8 వి | శ్వ | | 9 భ | ద్రు | డు | | 10 రు | మ |
| త్రి | | 11 ఆ | | వ | | 12 రే | | తి |
| | 13 గా | య | త్రి | | 14 వే | ణు | వు | |
| 15 శ్వే | | తి | | 16 అ | | క | | 17 అ |
| 18 త | ల్లి | | 19 వి | న | త | | 20 అ | న్న |
| కి | | 21 క | | సూ | | 22 సీ | | మ |
| | | 23 వి | జ | య | | త | | య్య |

ఇది చేప పిల్ల అభ్యర్థన. రూపానికి చిన్నదైనా ఆలో చనలకు పెద్దదే అది. అందువల్ల జడ భరతుడిలా ఆ ముని దానిని రక్షింప నిశ్చయించుకొన్నాడు. కమండలంలోనికి తీసు కున్నాడు. వెంటనే అది పెరగసాగింది. కమండలమంత, కడవంత, మడుగంత, చెరువంత, సముద్రమంత.... అలా పెరిగింది. చివరకు సముద్రం కూడా చాలదని బయటకు తీయమన్నది. ఇదంతా ఒక్కరోజులోనే. అప్పుడు ఆ రాజుకు అనుమానం కలిగింది. సాధారణ మత్స్యమైతే ఒక్క రోజులో అలా పెరగదు కదా. వాస్తవాన్ని సంభవించి ఆ చేపతో ఇలా అన్నాడు–

"ఒక దినంబున శతయోజన మాత్రము
విస్తరించెదు నీవు వినుము చూడ"

ఆ రాజుకు ఒక వాస్తవం తెలిసింది. స్ఫురణకు వచ్చింది. అసాధారణమైన ప్రకృతి రూప స్వభావాలలో దేనికి చెందనిదైనా




అది భగవంతుని లీలావిభూతియే అని అర్థమైంది. ఆ విషయాన్నే ఆ మీనంతో "నువ్వు మత్స్యమెందుకైనావని" ప్రశ్నించాడు.

అప్పుడు మత్స్యరూపంలోని మహావిష్ణువు ఏడు రోజులలో రానున్న ప్రళయాన్ని గురించి, ఆ సమయంలో ఆ రాజు చేయవలసిన పనిని గురించి తెలియజేశాడు. ప్రళయ జలాలలో ఊగుతూ వచ్చే నావను గమనించి ఓషధితతులు, బీజరాశులు దానిలో ఉంచి, సప్తర్షులతో కలసి ఆ నావనెక్క మన్నాడు. ఆపై నావను తన కొమ్ము కొనకు బంధించి తన రక్షణలో నిలవమన్నాడు. అది అలాగే జరిగింది. మత్స్యరూప ధారణ ప్రయోజనాలలో ఒకటి సమకూరింది.

అప్పటిదాకా సృష్టి కార్యక్రమంలో అలసిపోయిన బ్రహ్మముఖంనుండి వేదాలు బయటకు రాగా సోమకుడనే రాక్షసుడు వాటిని దొంగలించినాడట. దొంగలించి నీట మునిగి నాడట. అప్పుడు విష్ణువు మహామత్స్యరూపం ధరించాడు., దానికి చిన్న చిన్న రెక్కలు, పెద్ద పెద్ద మీసాలు, పొట్టి తోకా, బంగారురంగు శరీరమూ, అందమైన మచ్చలూ, చక్కని మొగమూ, ఒక కొమ్మూ, మిరుమిట్లు గొలిపే చూపులూ ఇదీ ఆ దివ్యరూపం. లక్ష ఆమడల పొడవైన మత్స్యరూపమది. అదే 'మత్స్యావతారం'.

ఇదంతా రాత్రి జరిగింది. తెల్లవారుజామున వేద ఘోష విని ఆ మత్స్యమూర్తి సోమకుణ్ణి హతమార్చి వేదాలను రక్షించాడు. మేల్కొన్న బ్రహ్మకు వేదాలు అందుబాటులోనికి వచ్చాయి. వైవస్వతమనువు తపశ్శక్తిని జోడించి విత్తనాలతో, లతలతో పునఃసృష్టికి తోడ్పడినాడు బ్రహ్మకు. ఈ కథను చదివిన వానికి మోక్షసిద్ధి కల్గుతుంది.

హరి జలచరావతారముఁ
బరువడిఁ బ్రతిదినముఁ జదువఁ బరమపదంబున్
నరుఁడందు వాని కోర్కెలు
ధరణీశ్వర! సిద్ధిఁబొందుఁ దథ్యము సుమ్మీ.


విషువకాలంలో బంగారు చేప బొమ్మతోపాటు మత్స్య పురాణ గ్రంథాన్ని దానం చేస్తే ఉత్తమఫలితాలు సిద్ధిస్తాయని అగ్నిపురాణ వచనం శిరోధార్యం.

యువత

# కర్తవ్య నిర్వహణ

– డా॥ కె. రామానుజాచార్యులు

శ్రీరామాయణంలోని కొన్ని ముఖ్యమైన శ్లోకాలకు పెరియవాచ్చాన్ పిళ్ళై అనే ఆచార్యవర్యులు చాలా విశదమైన, విలక్షణమైన వ్యాఖ్యానాన్ని "శ్రీరామాయణ తనిశ్లోకమ్" అనే పేరుతో అనుగ్రహించారు. ఆ గ్రంథంలోని ప్రతి శ్లోకానికి చాలా లోతైన అర్థాలను వారు వివరించారు. శ్రీరాముడు తాటకను సంహరించాడు. తాటక కుమారులైన మారీచ సుబాహులు అనే ఇద్దరు రాక్షసులు విశ్వామిత్రుని యాగాన్ని పాడు చేయడానికిరాగా, వారిద్దరిని నిరసించాడు. వారిద్దరిలో కూడా, సుబాహుని సంహరించి, మారీచుని దూరంగా తరిమికొట్టాడు. ఈ వృత్తాంతాన్ని పై పైన




గమనిస్తే, శ్రీరాముడు ఒక రాజకుమారుడు. తాటక ఒక రాక్షసి. మారీచసుబాహులిద్దరు కూడా రాక్షసులు. వారిని శ్రీరాముడు సంహరించాడు అనే విషయమే మనకు గోచరిస్తుంది. అయితే, జీవులమైన మనలను దృష్టిలో పెట్టుకొని ఈ కథను గమనించినప్పుడు, "ఈ విధమైన వేదాంతతత్వం మనకు ఇందులో గోచరిస్తుంది" అని వ్యాఖ్యాత పెరియవాచ్చాన్ పిళ్ళై తెలియజేస్తున్నారు.

విశ్వామిత్రుడు శ్రీరాముని, లక్ష్మణుని పురస్కరించుకొని తాటకను సంహరింప చేశాడు? అనే ఈ వృత్తాంతం ఏ విధంగా కనపడుతుంది? అని అంటే, కర్మయోగం ద్వారా, జ్ఞానయోగం ద్వారా అవిద్యను నశింప చేసికోవడం? అనే తత్త్వమే ఇక్కడ కనబడుతుంది? అని అంటారు, వ్యాఖ్యాత. అవిద్య అంటే? ఆత్మ పరమాత్మల జ్ఞానం లేకపోవడం. జీవాత్మ స్వరూపం, పరమాత్మ స్వరూపం, అచేతన తత్త్వ స్వరూపం? అనే మూడు విధాలైన తత్త్వాల స్వరూపాన్ని తెలుసుకుంటే, సరి అయిన విద్య, అంటే, జ్ఞానం లభిస్తుంది. విద్య అనే పదంతో ఉపాసనాన్నికూడా నిర్దేశించడం ఉన్నది. సరి అయిన తత్త్వత్రయ జ్ఞానం లేకపోయినట్లయితే, మనం ఎవరం? మనం ఏమి చేయాలి? మన లక్ష్యం ఏమి? దానికి మార్గం ఏమి? మనం ఎటువంటి ప్రయోజనాన్ని పొందాలి?? అనే విషయాలను తెలియడం సాధ్యం కాదు. మన లక్ష్యం ఏమో మనకు స్పష్టంగా తెలియకపోతే, మనం నడిచే నడత కూడా సరిగా ఉండదు. నడిచే దారి సరిగా లేకపోతే, మనం మంచి పని చేస్తున్నామా? లేక, చేయకూడని పనిని చేస్తున్నామా? అనే విషయం కూడా మనకు అర్థం కాదు. అందువల్ల, ఆత్మజ్ఞానం లేకపోవడమే అవిద్య. ఈ అవిద్య వల్ల మనం దేనిని పొందాలి? అనే లక్ష్యాన్ని కూడా తెలిసికోలేక పోతాము. అందుచేత మనం నడిచే మార్గం తప్పు దారి అవుతుంది. అందువల్ల, మనం ఈ జన్మలో ఏమి చేస్తున్నామో తెలియలేక, పుణ్యమని భావించి పాపాలనే చేస్తాము.

మరి ఈ సమస్యను ఏ విధంగా పరిష్కరించుకోవడం? అంటే, దీనికి అంతటికి మూలమైన అవిద్యను తొలగించుకోవాలి. అవిద్యను లేకుండా చేసుకోవాలంటే, ముఖ్యంగా రెండు కావాలి. అవి జ్ఞానం, కర్మ అనే రెండు. అంటే, సరి అయిన జ్ఞానం, దానికి అనుగుణమైన అనుష్ఠానం? అనే రెండు ఉండాలి. అందుచేత, జ్ఞానమూ కావాలి, జ్ఞానానికి తగిన ఆచరణా ఉండాలి. వీనినే జ్ఞానయోగమని, కర్మయోగమని అంటున్నాము. ఈ రెండిటినీ చేయగా, చేయగా, అవిద్య తొలగిపోతోంది, అంటే, ఆత్మజ్ఞానం లేకపోవడం అనేది లేకుండా పోతుంది యథార్థజ్ఞానం కలుగుతుంది. ఆత్మజ్ఞానం కలిగే కొద్దీ పాప పుణ్యాల స్వరూపాన్ని తెలుసుకోగలుగుతాం. పాపాలను చేయడం మానేస్తాం. పాపాలను చేయకూడదు, కానీ, పుణ్యాలను చేయాలి. పుణ్యాలను చేసినప్పటికీ కూడా, వాటి వల్ల కలిగే ఫలాన్ని కోరకుండా చేయాలి. వాటి ప్రయోజనాలను అన్నిటిని "సర్వం శ్రీకృష్ణార్పణమస్తు" అని భగవంతుని సన్నిధిలో సమర్పించాలి. దీనినే శ్రీరాముడు ఆచరించి చూపించాడు. అందుచేత, శ్రీరాముని జ్ఞానయోగంగాను, లక్ష్మణుని కర్మయోగంగాను, అంటే, అనుష్ఠానంగానూ భావించాలి.

శ్రీరామలక్ష్మణులను పురస్కరించుకునే విశ్వామిత్రుడు తాటకను నిరసింపచేశాడు. తాటక అంటే? అవిద్య కదా. అంటే, జ్ఞానరాహిత్యం. తాటక వల్ల పుట్టినవారు? మారీచ సుబాహులు.

అంటే, పుణ్యపాపాలు అనే రెండు. శ్రీరాముడు సుబాహుని సంహరించాడు, మారీచుని దూరంగా తరిమికొట్టాడు. ఈ విధం గానే, మనం పాపాలను లేకుండా చేసుకోవాలి. పుణ్యాలను చేసినప్పటికీ, వాటి ఫలం మనకు చెందకుండా దూరం చేసు కోవాలి. శ్రీరాముడు మారీచుని సంహరించలేదు, దూరంగా తరిమికొట్టాడు. ఆ విధంగానే, మనం పుణ్యకార్యాలను చేయాలి, వాటి ఫలాలనుమాత్రం విడచిపెట్టాలి. ఏం? పుణ్యఫలాలను అనుభవిస్తే ఏమవుతుంది? అని అంటే, అవి మళ్లీ మనలను ఈ లోకంలో జన్మించేటట్లు చేస్తాయి. అవి ఈ లోకాన్నే కాదు, స్వర్గాన్ని కూడా పొందేటట్టు చేయవచ్చు. కానీ, మన లక్ష్యం స్వర్గాన్ని చేరడం కాదు కదా. పునరావృత్తి లేని వైకుంఠానికి చేరడం కదా, మన లక్ష్యం.



తాటకను సంహరించగానే, ఆమెకు పుట్టిన సంతానం మారీచసుబాహులు, తమను కాపాడే తల్లి నశించగానే, వారు కూడా లేకుండాపోయారు. ఆ విధంగానే, అవిద్య నశించిపోతే, దానిని ఆశ్రయించుకుని ఉండే పుణ్యపాపాలనే రెండు తామే స్వయంగా లేకుండా పోతాయి. అవిద్య నశించినందున, దానివల్ల ఆత్మజ్ఞానం ఏర్పడినందున పాపాలను చేయడం మాని వేయవచ్చు. పుణ్యకార్యాలను చేసినప్పటికీ, వాటి ఫలాన్ని పరమాత్మ సన్నిధిలో సమర్పించవచ్చు.

ఈ తత్త్వమే విశ్వామిత్రుడు శ్రీరామలక్ష్మణులను పురస్క రించుకొని తాటకను సంహరించడంలో, తాటక నశించగానే ఆమె కుమారులు ఆయన మారీచ సుబాహులను లేకుండా చేయడంలో, వారిలో కూడా, సుబాహుని వధించడంలో, మారీచుని దూరంగా తరిమి కొట్టడంలో వ్యక్తమవుతున్నది. ఆ విధంగానే, మనం కూడా, కర్మజ్ఞానాలతో అవిద్యను లేకుండా చేసికొని, ఆ అవిద్య వల్ల, అంటే, జ్ఞానం లేక పోవడంవల్ల ఏర్పడిన పాపపుణ్యాలను లేకుండా చేసికోవాలి. వాటిలో కూడా, పాపాలను నశింపజేసికోవాలి. పుణ్యం చేసినప్పటికీ పుణ్యఫలాలను మనకు అంటకుండా చేసు కోవాలి. ఈ వేదాంత తత్త్వమే మనకు ఇక్కడ ఈ వృత్తాంతం వల్ల బోధపడుతున్నది? అని పరమకారుణికులైన వ్యాఖ్యాత పెరియవాచ్చాన్ పిళ్ళై మనకు తెలియజేశారు.

మనం కూడా ఈ తత్వాన్ని అర్థం చేసికొని, మనసులో నిలుపుకొని, ఆ విధంగా ఆచరించి తరిద్దాం. మనకు ఈ మహార్థాన్ని ఉపదేశించిన ఈ మహాచార్యుపట్ల కృతజ్ఞులమై ఉందాం.


**STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT**

**SAPTHAGIRI**

**(MONTHLY)**
**FORM IV**
**See Rule 8**

1. Place of Publication : TIRUPATI
2. Periodicity of its Publication : Monthly
3. Printer's Name : **Sri P.Ramaraju,** M.A.,
   Whether citizen of India : Yes
   Address : Special Officer, TTD Press Compound K.T.Road, Tirupati.
4. Publisher's Name : **Dr.K.Radha Ramana,** M.A.,M.Phil., Ph.D.
   Whether citizen of India : Yes
   Address : Chief Editor Office, TTD Press Compound, K.T.Road, Tirupati.
5. Editor's Name : **Dr. V.G.Chokkalingam,** M.A., Ph.D.
   Whether citizen of India : Yes
   Address : Chief Editor Office, TTD Press Compound, K.T.Road, Tirupati.
6. Name and address of individuals who own the Newspaper and partners or shareholders holding more than one percent of the Total Capital : Tirumala Tirupati Devasthanams

I, **K. Radha Ramana**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

TIRUPATI,
Date : 28-2-2023.

**(Sd.) Dr. K. Radha Ramana,**
Signature of the Publisher

# శ్రీకోదండరామస్వామి ఆలయం, తిరుపతి

మన దేవాలయాలు

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

దివ్యమైన భవ్యమైన తిరుపతి పట్టణం నడుమభాగాన ఇష్టార్థులపాలిటి పెన్నిధిగా వెలసిన పరమపావనమైన దివ్యఆలయం శ్రీకోదండరామస్వామి ఆలయం!

ఈ దేవాలయంలోని గర్భగృహంలో స్థానక భంగిమ (నిలుచున్న)లో దర్శనమిస్తున్న కల్యాణరాముడు శ్రీకోదండరాముడు! కుడివైపున సాక్షాత్తు శ్రీమహాలక్ష్మీ స్వరూపురాలైన సీతాదేవి! మరోప్రక్కన అనగా ఎడమవైపున శ్రీలక్ష్మణస్వామి వేంచేసి ఉండగా వీరిరువురి మధ్యలో ధనుర్బాణాలతో విరాజిల్లుతూవున్న సాక్షాత్తు శ్రీమన్నారాయణుడైన శ్రీరఘురాముని తిరుపతిలోని శ్రీకోదండ రాముని దర్శిస్తే చాలు! మనస్సు పులకిస్తుంది.

వశిష్ఠమహర్షివరేణ్యుల ఆదేశంపై సంతానార్థియైన దశరథుడు వేంకటాచలక్షేత్రం చేరుకొన్నాడు. వశిష్ఠమహర్షి ఆచార్యకత్వంలో పుత్రకామేష్టియాగం చేసిన దశరథమహారాజుకు నలుగురు కొడుకులు పుట్టారు. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు శ్రీరామునిగా, ఆదిశేషుని అంశతో లక్ష్మణుడు, శంఖ, చక్రాంశలతో భరతశత్రుఘ్నులు అవతరించారు.

సాక్షాత్తు వేంకటాచలపతి ఇచ్చిన వరం వల్లే శ్రీరాముడు అవతరించాడని శ్రీవేంకటాచలమాహాత్మ్యం స్పష్టం చేస్తోంది. అంతే గాక ఆ రాముడే నేను, నేనే ఆ రాముణ్ణి అంటూ వేంకటేశ్వరుడు అడుగడుగునా స్ఫురింపజేస్తూనే ఉన్నాడు.

## జాంబవంత - జనమేజయుల ప్రతిష్ఠ

సీతాన్వేషణసమయంలో రామలక్ష్మణులతో పాటు జాంబవంత, హనుమదాదులుకూడా సంచరించినట్లుగా పురాణకథనం. ఆ సమయంలో జాంబవంతుడు కొన్నిచోట్ల సాక్షాత్తు పరబ్రహ్మ మూర్తి అయిన శ్రీరాముని విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు ప్రతీతి!

శ్రీరాముడు నడయాడిన దివ్యప్రదేశంలో జాంబవంతునివల్ల ప్రతిష్ఠింపబడిన విగ్రహ మూర్తులే తిరుపతి పట్టణం నడిబొడ్డున



వెలసిన శ్రీ సీతారామలక్ష్మణులమూర్తులు, అని అనూచానంగా వినవస్తున్న ఐతిహ్యం!

ఆ తర్వాత, కాలాంతరంలో, ద్వాపరయుగాంతంలో జనమేజయచక్రవర్తి ఈ ఆలయాన్ని పునరుద్ధరించి పునఃప్రతిష్ఠించాడని కూడ పెద్దలమాటే కాక, తిరుమల శ్రీవారి ఆలయం "సవాల్ జవాబ్ పట్టీ" అన్న పుస్తకంలో తెలుపబడింది. బ్రిటీష్ కాలంలో "అప్పటి ప్రజలకు, భక్తులకు కొన్ని ప్రశ్నలు వేస్తూ, వాటికి సేకరించిన జవాబులను" క్రోడీకరించిన గ్రంథమే "సవాల్ జవాబ్ పట్టి".

## శ్రీకోదండరామస్వామి ఆలయం

ఏడు బంగారుకలశాలు మిలమిల మెరుస్తున్న మహా ద్వార రాజగోపురంతో పశ్చిమాభిముఖంగా దివ్యమైన ప్రశాంత ధామంగా యాత్రికులకు గోచరిస్తుంటుంది తిరుపతి పట్టణం లోని శ్రీకోదండరామస్వామి ఆలయం.

**ప్రధాన ఆలయం-** ప్రధానఆలయంలో ప్రవేశించేముందుగా ప్రధాన ఆలయాన్ని ముఖమండపం, అర్ధమండపం, అంతరాళం, గర్భాలయం అని నాలుగుభాగాలుగా వింగడించి వాటిని గూర్చి తెలుసుకొంటూ ముందుకు సాగుదాం.

**ముఖమండపం-** వరుసకు 5 స్తంభాల వంతున 6 వరుసలున్న శిల్ప శోభితమైన శిలాస్తంభాలతో నిర్మితమైన ముఖమండపం మధ్య భాగాన ఒక అరుగులాంటి వేదిక నిర్మింపబడింది. ఈ వేదికపై సాధారణ రోజుల్లో స్నపనతిరుమంజనాదులు, ఊంజల్ సేవలు జరుపబడుతుంటాయి. ముఖమండపానికి పడమటి దిక్కున ఇనుప కటాంజనం నిర్మింపబడింది. ఈ ముఖమండపం లోనే శ్రీకోదండరామస్వామికి ఎదురుగా, గరుడాళ్వారుమండపం ఉంది. శ్రీరామునికి ఎదురుగా గరుడమండపం ఉండడం ఎక్కడా కనపడదు. ఇచటి రాముడు సాక్షాత్తు విష్ణువని అర్థం. ముఖ మండపంలోనే ఈశాన్యమూలన రెండు నైవేద్యఘంటలు ఉన్నాయి. నివేదనసమయంలో ఈ ఘంటలు మ్రోగింపబడ తాయి. ఈ ముఖమండపంలో గరుడాళ్వారుకు ముందుభాగంలో 'కౌసల్యాసుప్రజారామ..' అంటూ సుప్రభాతం పఠింపబడుతుంది.

**24వ పేజీలోని.. 'తేడాలు గుర్తించండి' కి జవాబులు**



**అర్ధమండపం-** ముఖమండపాన్ని దాటి లోనికి వెళ్లిన వెంటనే ఉండే గది అర్ధమండపం. ఇది గర్భాలయానికి ప్రదక్షిణా మార్గంగా నిర్మింపబడింది. ఈ అర్ధమండపంలో వాకిలికి ఇరువైపులా ఉన్న రాతి అరల్లో స్వామివారి నగలు, ఆభరణాలు భద్రపరచబడతాయి. ఈ మండపంలోని రెండు స్తంభాలపైన తిరుమల శ్రీనివాసుడు, కంచివరదరాజు శిల్పాలు ఎదురెదురుగా రమణీయంగా మలచబడినాయి.

**అంతరాళం-** నాలుగుమెట్లు ఎక్కి ప్రవేశద్వారందాటిలోనికి వెళితే అంతరాళం ఉంది. ఇరుకుగా ఉన్న ఈ అంతరాళం నుండే గర్భాలయంలోని మూలమూర్తులను భక్తులు దర్శిస్తారు. ప్రతి రోజు ఈ అంతరాళంలోనే గొలుసులతో వేలాడదీయబడిన తూగుటుయ్యాలలో వెన్నముద్ద కృష్ణునికి ప్రతిరోజు రాత్రి ఏకాంతసేవ అనగా పవళింపుసేవ జరుపబడుతుంది.

**గర్భాలయం-** అంతరాళం దాటితే లోన ఉండేదే గర్భాలయం. గర్భాలయం మధ్యభాగాన 2 అడుగుల ఎత్తైన శిలాపీఠంపైన స్థానక భంగిమ(నిలుచున్న)లో ప్రతిష్ఠింపబడిన శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామివారి నిలువెత్తు శిలావిగ్రహ మూర్తులు ప్రతిష్ఠించబడినాయి. కొన్ని పంచలోహమూర్తులు కూడా ఈ గర్భాలయంలో ఉన్నాయి.

**విష్వక్సేనులవారి సన్నిధి-** అర్ధమండపంలోనే ఉత్తరం వైపున దక్షిణాభిముఖంగా శ్రీస్వామివారి సైన్యాధికారి విష్వక్సేనులవారి శిలావిగ్రహం ఉన్నది. శ్రీరాముని సన్నిధిలో శ్రీవేంకటేశ్వరుని సేనాధిపతి విష్వక్సేనుడు ఉండడం కూడా విశేషం.

**భాష్యకారుల సన్నిధి-** ఇదే అర్ధమండపంలోనే దక్షిణంవైపు ఉన్న రాతిఅరలో (గది) భగవద్రామానుజులవారి శిలావిగ్రహం

ప్రతిష్ఠించబడింది. చిన్ముద్ర ధరించి ఉన్న రామానుజుల విగ్రహంతో పాటు, నమస్కారభంగిమలో ఉన్న రామానుజుల చిన్నశిలా విగ్రహాన్ని కూడ ఇక్కడ దర్శించవచ్చు. వీటితోపాటు నమ్మాళ్వారుల మరియు రామానుజుల చిన్నపాటి పంచ లోహమూర్తులు కూడ ఇక్కడ దర్శించవచ్చు.

**శ్రీకోదండరామస్వామి మూలమూర్తులు-**

మధ్యలో ధనుర్బాణాలను ధరించి నిలిచి ఉన్న శ్రీరామచంద్రస్వామికి కుడివైపున సీతమ్మ వారు, ఎడమవైపున ధనుర్బాణాలు ధరించి నిలిచి ఉన్న లక్ష్మణస్వామివారి శిలావిగ్రహాలు ప్రతిష్ఠించబడినాయి. హనుమంతుని శిలామూర్తి గర్భాలయంలో లేకపోవడం విశేషంగా గమనించవలసిన అంశం.

మూలమూర్తి అయిన శ్రీకోదండరామస్వామి నొసటన తెల్లని ఊర్ధ్వపుండ్రాలు ధరించి, చిన్మయహాసంతో తిరుమల శ్రీనివాసభగవానుని మూలమూర్తిని తలపిస్తుంటాడు. సాక్షాత్తు శ్రీనివాసుడే ధనుర్బాణాలతో ఇలా నిలబడ్డాడా? అనిపిస్తుంది.

### శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు, తిరుపతి

**2023, మార్చి 20 నుండి 28 వరకు**

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 20-03-23 | సోమ | ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 21-03-23 | మంగళ | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 22-03-23 | బుధ | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 23-03-23 | గురు | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 24-03-23 | శుక్ర | పల్లకిలోమోహినీఅవతారం | గరుడవాహనం |
| 25-03-23 | శని | హనుమద్వాహనం | సా॥వసంతోత్సవం,గజవాహనం |
| 26-03-23 | ఆది | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 27-03-23 | సోమ | రథోత్సవం | అశ్వవాహనం |
| 28-03-23 | మంగళ | చక్రస్నానం | ధ్వజావరోహణం |




కుడివైపున సీతాదేవితోను, ఎడమవైపున లక్ష్మణునితో ఉన్న స్వామిని దర్శిస్తే సకలశ్రేయస్సులు శుభాలు సిద్ధిస్తాయి. ఇష్టార్థాలు నెరవేరతాయని పెద్దలమాట. ఈ కోదండరామస్వామి తిరుమలేశుని మాదిరే వరప్రసాది.

**ఉత్సవమూర్తులు-** గర్భాలయంలో మూలమూర్తులతో పాటు శ్రీకోదండరామస్వామివారి పంచలోహఉత్సవమూర్తులు, పంచ బేరాలు, భక్తాంజనేయస్వామి పంచలోహమూర్తి, వెన్నముద్ద కృష్ణుని పంచలోహవిగ్రహమూర్తి, సుదర్శన భగవానుని (చక్రత్తాళ్వార్) పంచలోహవిగ్రహమూర్తి చోటుచేసుకున్నాయి.

గర్భాలయాన్ని దాటి తరచుగా శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి ఉత్సవమూర్తులు బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవం, ఊరేగింపుల్లో పాల్గొంటారు. చక్రత్తాళ్వార్ బ్రహ్మోత్సవంలో చివరిరోజున మాత్రమే బయటకు వచ్చి చక్రస్నానంలో పాల్గొంటారు. ఈ చక్రస్నానం ఆళ్వారుతీర్థం అనబడే కపిల తీర్థంలో నిర్వహిస్తారు. అంతేగాక ప్రతి పున్నమినాడు కల్యాణ మండపంలో జరిగే శత కలశాభిషేకంలో కూడ సుదర్శనుడు పాల్గొంటాడు.

శ్రీరామనవమి సందర్భంగా జరిగే పట్టాభిషేకోత్సవంలో పాల్గొనడానికి మాత్రమే ఆంజనేయుని పంచలోహప్రతిమ బయటకి తేబడుతుంది.

*జై శ్రీరామ్!!!*



# మనలను రక్షించే 'కేశవాదిద్వాదశ నామాలు'

- డా॥ఎం.వేంకటాచార్యులు

భగవంతుని సహస్రనామ స్తోత్రం పారాయణ చేయడానికి కొంత సమయం పడుతుంది. ఆ మాత్రం పారాయణం చేసే శక్తి, సమయం లేనివారికోసం అష్టోత్తరశతనామ స్తోత్రాలు ఉన్నవి. ఆలయాల్లో, గృహాల్లో అర్చన చేసేటప్పుడు ఈ స్తోత్రాలే ఉపయోగింపబడుతున్నవి. వీనిని చెప్పుకోవడానికి ఒక పది నిమిషాలు పట్టవచ్చు. అయితే, ఇంకా సులభంగా, తక్కువ సమయంలో భగవన్నామాలను అనుసంధానం చేయడం కోసం ఉన్నవే భగవంతుని **'కేశవాది ద్వాదశనామాలు'.**

**'కేశవ, నారాయణ, మాధవ, గోవింద, విష్ణు, మధుసూదన, త్రివిక్రమ, వామన, శ్రీధర, హృషీకేశ, పద్మనాభ, దామోదర'** అనే నామాలే ఈ 12 నామాలు.

ఈ 12 నామాలు పలుచోట్ల ఉపయోగపడుతున్నాయి. ఉత్తరభారతంలో అయితే, ఈ 12 నామాలే సంవత్సరంలోని 12 మాసాలకు పేర్లుగా వ్యవహరింపబడుతున్నాయి. ఈ క్రమంలో మార్గశిరమాసమే 'కేశవ' నామంతో వ్యవహరింపబడే మొదటి మాసం. ఈ మాసం నుండి ఆరంభించి క్రమంగా 12 నెలలు 12 నామాలతో నిర్దేశింపబడుతున్నాయి. చివరి మాసం అయిన కార్తికమాసం 'దామోదర'మాసమని పిలువబడుతున్నది.

మన ఇళ్లలో భగవదారాధన చేసేటప్పుడు మంత్రపుష్ప సమయంలో ఈ పన్నెండు నామాలతో ఆరంభించి అర్చన చేయడం, చివరిలో కూడా ఈ 12 నామాలను చెప్పడం సంప్రదాయంగా వస్తున్నది.

భగవదాలయాలలో ఆగమానుసారంగా బ్రహ్మోత్సవాలు పూర్తి అయిన తరువాత, ద్వాదశారాధన అనే ఒక కార్యక్రమం చేస్తారు. ఇందులో ఈ 12 ఆరాధనలు ద్వాదశనామ పూర్వకంగానే సంకల్పం చేసి, చేస్తారు.

శ్రీవైష్ణవుడైనవాడు ప్రతి ఒక్కడూ తన శరీరంలో నుదుటి నుండి ఆరంభించి పన్నెండు ఊర్ధ్వపుండ్రాలను ధరించాలి అని నియమం. ఈ 12 పుండ్రాలు కేశవాది ద్వాదశనామ పూర్వకంగానే ధరించాలి అనే నియమం కూడా ఉంది. 'ఫాలభాగం'లో ధరించే పుండ్రానికి **కేశవనామం**. 'ఉదరం మధ్య'లో **నారాయణ నామం**, 'హృదయం'లో **మాధవనామం**, 'కంఠప్రదేశం'లో **గోవింద నామం**, 'ఉదరానికి కుడివైపున' **విష్ణునామం**, 'కుడిచేయి భుజం'పై **మధుసూదననామం**, 'కంఠానికి కుడివైపున' **త్రివిక్రమనామం**, 'ఉదరానికి ఎడమవైపున' **వామననామం**, 'ఎడమభుజం'పై **శ్రీధర నామం**, 'కంఠానికి ఎడమవైపున' **హృషీకేశనామం**, 'వెనుక వైపు నడుమభాగం'లో **పద్మనాభనామం**, 'కంఠానికి వెనుక వైపున' **దామోదర నామం**- అని ఈ విధంగా మన శరీరంలో 12 చోట్ల ధరించే 12 పుండ్రాలకు 12 నామాలు నిర్దేశించారు పూర్వాచార్యులు.

# అదితి
## ఆచరించిన 'బ్రహ్మోదనం'


- శ్రీమతి ఈ.విజయలక్ష్మి

మనం ఏ విధమైన ఆహారాన్ని తీసుకొన్నప్పటికీ, దానిని ముందుగా భగవంతునకు నివేదన చేసి, అటువంటి భగవత్ప్రసాదాన్ని భుజిస్తే, మనకు మంచి గుణాలు, శక్తికలుగుతాయి. అందువల్లనే పెద్దలు భగవంతునకు నివేదన చేయకుండా ఏ ఆహారాన్ని భుజించరాదనే నియమాన్ని విధించారు. దీనికోసం వేదంలో 'ఆగ్రయణం' అనే ఒక వైదిక ప్రక్రియ కూడా విధింపబడింది. శరదృతువులోనే ఈ ఆగ్రయణం నిర్వహింపబడుతుంది. ఆ ఋతువులోనే కొత్తగా పండిన పంటచేతికి వస్తుంది. ఆగ్రయణకర్మను ఆచరించి, దానిని ఆగ్రయణదేవతలకు ముందుగా అర్పించాలి. వైదికాగ్నిలో నూతనంగా పండిన ధాన్యంనుండి లభించిన బియ్యాన్ని వండి, ఆ హవిస్సును ఆగ్రయణ దేవతలకు సమర్పించి, ఆ తరువాతనే ఆ పంటను వాడుకునే క్రమం వేదంలో చెప్పబడింది. ఈ ఆగ్రయణ దేవతలలో అంతర్యామిగా భగవానుడైన శ్రీమన్నారాయణుడు వేంచేసి ఉండి, ఆ ప్రసాదాన్ని స్వీకరించి, భగవద్గీతలో శ్రీకృష్ణుడు కూడా *"యజ్ఞశిష్టాశినః సంతః ముచ్యంతే సర్వకిల్బిషైః"*, 'యజ్ఞం అనబడే భగవదారాధనలో భగవంతునకు సమర్పించి, ఆ భగవంతుని శేషప్రసాద శేషంగా ఆహారాన్ని స్వీకరించేవారు అన్ని పాపాల నుండి విముక్తులు అవుతారు?' అని అన్నాడు. దీనిని తెలిపే వైదికమైన కథ ఒకటి ఉన్నది.

అదితి దేవతలకు తల్లి. ఆమెకు ఒక పర్యాయం చాలా సంతానం పొందాలని ఆశ కలిగింది. అందుకోసం ఆమె ***'బ్రహ్మోదనం'*** అనే ఒక వైదికక్రియను ఆచరించింది. యాగం చేయడానికి ముందుగా బ్రహ్మోదనం అనే ఒక ప్రసాదాన్ని తయారు చేస్తారు. ఇది అగ్న్యాధానానికి ముందు సిద్ధం చేయబడుతుంది. ఈ ప్రసాదం బ్రహ్మకు నివేదన చేయబడుతుంది కనుక, దీనికి **'బ్రహ్మోదనం'** అనే పేరు కలిగింది. అగ్న్యాధానాన్ని చేసే బ్రాహ్మణులకు ఇవ్వబడుతుంది కనుక కూడా దీనికి ఆ పేరు వచ్చింది అని అంటారు. ఈ విధమైన బ్రహ్మోదనాన్ని బ్రహ్మకు నివేదన చేసి, బ్రాహ్మణులకు ఇచ్చిన తరువాత మిగిలిన ఆ బ్రహ్మోదనాన్ని అదితి భుజించింది. దాని ఫలంగా ఆమెకు చక్కని సంతానం కలిగింది. వారికి 'ఆదిత్యు'లని పేరు. అదితి పుత్రులు కనుక వారికి ఆ పేరు వచ్చింది.

అదితికి ఆశ ఇంకా తీరలేదు. ఇంకా సంతానాన్ని పొందాలని ఆమె కోరుకున్నది. అందుకోసం మళ్లీ పూర్వం చేసిన యజ్ఞాన్నే చేయాలని ఆమె అనుకున్నది. మళ్లీ బ్రహ్మోదనం ఆ యజ్ఞంలో సిద్ధం చేయబడింది. కానీ, ఈసారి అదితికి ఒక ఆలోచన వచ్చింది. ఆ బ్రహ్మోదనాన్ని దేవతానివేదన చేయకుండానే తానే భుజిస్తే ఏమి? అని ఆమె అనుకున్నది. ఆ విధంగానే ఆమె ఈసారి దేవతానివేదన చేయకుండానే బ్రహ్మోదనాన్ని భుజించింది. అయితే, ఈసారి ఆమెకు సంతానం కలుగలేదు.

అప్పుడు అదితి తన మనసులో ఆలోచించింది. తనకు ఈసారి సంతానం కలుగుక పోవడానికి కారణం బ్రహ్మోదనాన్ని



దేవతానివేదన చేయకుండా ముందుగా తానే భుజించడమే? అని భావించింది. దేవతలకు నివేదన చేసిన తరువాత, వారి శేషంగా మిగిలిన భాగాన్ని భుజించడంలో ఏదో ఒక విశేషం ఉన్నది? అని గుర్తించింది. అందువల్ల ఆమె ఇంకొకసారి బ్రహ్మౌదనాన్ని సిద్ధం చేసి, దానిని ఆదిత్యులనే దేవతలకు అర్పించి, భుజించింది. అప్పుడు ఆదిత్యదేవతలు ఆమెతో ఒక విషయాన్ని చెప్పారు "నీకు ఒక కుమారుడు జన్మిస్తాడు, అతడు కూడా మాతో ఉండనీ.. ఇంకా నీకు కలిగే మిగిలిన పుత్రులు యాగాదులను నిర్వహిస్తారు" అని వారు అన్నారు.

తరువాత అదితికి ఒక కుమారుడు జన్మించాడు. అతనికి 'వివస్వాన్' అని పేరు. ఆదిత్య దేవతలు కోరినట్టుగా ఈ వివస్వాన్ ఆదిత్యులతో చేరాడు. అతని పుత్రుడే వైవస్వత మనువు. ఆ వైవస్వతమనువే మానవజాతికి అందరికీ మూల పురుషుడు. ఈ విధంగా అదితికి బహుసంతానాన్ని పొందాలనే కలిగిన ఆశ నెరవేరింది.

ఈ వృత్తాంతం వల్ల ఏమి తెలుస్తోంది? అంటే, దేవతలకు నివేదన చేసిన ప్రసాదాన్ని భుజిస్తే, అందులో ఒక విశేషం ఉన్నదని, దానివల్ల మంచి ఫలం కలుగుతున్నదని తెలుస్తున్నది కదా! దేవతలకు అర్పించకుండా అదితి తానే భుజించినప్పుడు ఆమె కోరిన ప్రయోజనం సిద్ధించలేదు. దేవతాసమర్పణ చేసినప్పుడే ఆమె కోరుకున్న ఫలం సిద్ధించింది. దేవతలకు నివేదన చేసిన ప్రసాదానికి అంత మహిమ ఉన్నప్పుడు, ఆ దేవతలకు అందరికి అంతర్యామియై ఉండే భగవానుడైన శ్రీమన్నారాయణునకు సాక్షాత్తుగా నివేదన చేసి, ఆ స్వామి కటాక్షించిన ప్రసాదాన్ని స్వీకరించినప్పుడు ఎంత ఫలం కలుగుతుందో, ఆ ప్రసాదానికి ఎంత మహిమ ఉంటుందో, ఊహించవచ్చు కదా. అందువల్లనే పెద్దలు భగవంతునకు సమర్పించకుండా ఏ ఆహారాన్ని భుజించకూడదనే నియమాన్ని పెట్టారు.

అందువల్ల మనకు లభించిన ఆహారాన్ని భగవంతునకు నివేదన చేసిన తరువాతనే భుజిద్దాం. తద్వారా ఆ భగవంతుని కటాక్షాన్ని పొందడానికి ప్రయత్నం చేద్దాం.

## జనవరినెల క్విజ్-6 సమాధానాలు

**అన్ని ప్రశ్నలకూ సరైన సమాధానం - సూర్యుడు**

**సరైన సమాధానాలు వ్రాసినవారు-**

01) మిట్టాప్రజ్వల్, 5వ తరగతి, ప్రొద్దుటూరు.
02) డి.అభయ్, 6వ తరగతి, తుమ్మపూడి.
03) కె.నాగార్జున, యుకెజి, అనంతపురం.
04) కె.చారుశ్రీ, 4వ తరగతి, కె.ఎం.అగ్రహారం.
05) పరవస్తు ఉషశ్రీ, 9వ తరగతి, రాజమండ్రి.
06) తోట చరిష్మాదేవి, 6వ తరగతి, కాకినాడ.
07) కె.గౌతమ్ శరణ్, 5వ తరగతి, చెయ్యార్.
08) జ్యోతిశ్రీ అక్షయ, 6వ తరగతి, తోటవల్లూరుమండలం.
09) వెంకటసహస్ర, 7వ తరగతి, బెంగళూరు.
10) కె.ఎస్.కార్తికేయ, 8వ తరగతి, కర్నూలు.
11) వర్శితారాం కత్రెడ్డి, 6వ తరగతి, గుణదల.
12) పి.నిరంజన్, 9వ తరగతి, చీపురపల్లి.
13) టి.ఎన్.శ్రీనివాస్, మదురై.
14) ఎం.వి.సాయిచిన్మయ్‌శర్మ, 9వ తరగతి, ప్రొద్దుటూరు.
15) కోమటిరెడ్డి ఆదిత్య, 6వ తరగతి, కరీంనగర్.
16) బలివాడ హితేంద్ర, 6వ తరగతి, బి.రెడ్డిపేట.
17) పప్పల ధనశ్రీ నాగహర్షిక, 8వ తరగతి, చింతలపూడి.
18) వి.ఉమారత్న తన్మయి, 5వ తరగతి, రాజమహేంద్రవరం.
19) పిట్టల ధరణి, 6వ తరగతి, బేతంచర్ల.
20) సుంకరి సాత్విక, 8వ తరగతి, మెదక్.
21) నాగప్రాప్తి పెండ్యాల, 6వ తరగతి, హైదరాబాదు.
22) ఎస్.కార్తికేయ, 3వ తరగతి, హైదరాబాదు.
23) వసనాభి నాగవేదిత, 8వ తరగతి, నరసన్నపేట.
24) తడకు రాంచరణ్, 6వ తరగతి, కనగర్తి.

## త్వరలో.. నూతన ధారావాహిక ప్రారంభం!

మాతృశ్రీ తరిగొండ వేంగమాంబ రచించిన **శ్రీవేంకటాచల మాహాత్మ్యము** పద్యకావ్యం చాలా విశిష్టరచన.



శ్రీవేంకటాచలక్షేత్రమహిమను, శ్రీవేంకటేశ్వరస్వామి పవిత్రగాథను ఆస్తికలోకానికి విశేషంగా ప్రచారం చేసిన రచన ఇది. ఆరుఆశ్వాసాలు కలిగిన ఈ పద్యకావ్యాన్ని సరళ వచనంలో, తేటతెలుగులో, పాఠకులను అలరించే శైలిలో ధారావాహికగా అందించబోతున్నాం!

రచన- ఆచార్య కె.సర్వోత్తమరావు.
వీరు బహుభాషావేత్త,
బహుగ్రంథకర్త.





# దర్శనమిచ్చిన దేవుడు

- శ్రీ ఆదూరి శ్రీనివాసరావు

కొన్ని సంవత్సరాల క్రిందట తిరుపతికి పరీక్ష పేపర్లను దిద్దటానికి వెళ్లాను. తిరుమలకు వెళ్లి స్వామివారి దర్శనం చేసుకుందామని ఉదయం బయలుదేరాను. బస్టాండులో పెద్ద 'క్యూ' చూసేటప్పటికి నాకు ఆశ్చర్య మేసింది. నేను ఆ రాత్రికి మళ్లీ తిరుపతికి తిరిగి రాగలనా? అని అనుకుంటూ తిరుమల చేరాను. దీనిని మించి ఉన్నది స్వామి దర్శనార్థమై ఉన్న 'క్యూ'. అక్కడవారి నడిగితే స్వామి దర్శనమయ్యేటప్పటికి రాత్రి 11గం॥లు లేదా 12గం॥లు అవుతుంది అన్నారు.

మర్నాడు పొద్దున్నే నేను డ్యూటీకి పోవాలి. ఈ తర్జన భర్జనలో ఉన్నప్పుడు ఎవరో 8 సం॥ల బాలుడు వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. క్యూలో ఉన్న నేను- ఏమిటని అడిగితే వాళ్ల అమ్మ కనిపించలేదట. హృదయవిదారకంగా ఉన్నది ఆ పసి వాని ఏడుపు. ఎవ్వరుకూడ ఆ పసివానిని పట్టించుకోలేదు. అప్పుడు ఏమిచెయ్యాలి. అతనిని పోలీసుస్టేషనుకు తీసుకెళ్ళి మైకులో చెప్పించాలి. 'క్యూ' వదలి వెళితే స్వామిదర్శనం ఆరోజుకు ఇకలేదు. ఇదే నా బాధ. సరే అందరిలోను స్వామి ఉన్నాడంటారు కదా. ఈ పసివానిలో కూడా ఉన్నది ఆ నామాలవాడే కదా. పసివానికి సేవచేస్తే పరమేశ్వరునికి సేవ చేసినట్లే అనుకొని, నేను 'క్యూ' వదిలేసి ఆ పిల్లవాణ్ణి పోలీసు




స్టేషను వద్దకు తీసుకెళ్లాను. అక్కడ ఎవ్వరూ లేరు. స్టేషనుకు తాళం వేసి ఉంది.

ప్రక్కన విచారిస్తే మైకు ప్రకటనలు స్వామిగుడి సింహ ద్వారం లోపల చేస్తున్నారు. అక్కడకు పొమ్మన్నారు. ద్వార పాలకులు అడ్డంగా ఉన్నారుకదా! అయినా వెళ్లి వారితో చెప్పాను. వారు, నన్ను పిల్లవాణ్ణి లోపలకు పంపారు. అక్కడ వెళ్ళి అడిగితే గర్భగుడి బంగారు వాకిలి దగ్గర మైకు ఉంది. మీరు అక్కడకు వెళ్ళండి అని నాకు దారి చూపించినారు. ఇంకేమి గుంపులో గోవిందా! గోవిందా! అంటూ నేను ఆ పిల్లవాడు 'క్యూ'లో వెళ్లి స్వామివారి దర్శనాన్ని తనివిదీర చేసుకొని, మైకు దగ్గరకు వస్తే, అక్కడ వారు, పోలీసుస్టేషను తెరచి ఉంది మీరు అక్కడికే వెళ్లండి అని చెప్పారు. మళ్లీ దేవాలయం బయటికి వచ్చి పోలీసుస్టేషనుకు వెళ్ళాం. అక్కడ ఆ పిల్లవాని అమ్మ పిల్లవాణ్ణి చూసి ఆనందాశ్రువులు నింపుకొని నాతో "నాయనా నీ దయవలన నా బిడ్డ దొరికాడు" అంటూ ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయింది ఆ తల్లి. కాదమ్మా కాదు. నీ బిడ్డ వల్ల నాకు స్వామివారి దర్శనమయింది అంటూ వారి పరిస్థితిని చూసి ఆనందంతో కళ్లనీళ్లు తుడుచుకున్నాను. చూచారా! స్వామి దర్శనాన్ని వదలి, పసిబిడ్డను తల్లిని చేర్చిన సేవాఫలానికిగాను, స్వామి తన దర్శనభాగ్యం కలిగించాడు. కనుక 'మానవసేవే నిజమైన మాధవసేవ!'

ఆయుర్వేదం

# గచ్చకాయల్లో ఔషధ గుణాలు పుష్కలం

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ,
90007 61390

ప్రకృతిమాత అసంఖ్యాక అత్యుత్తమ ఔషధగుణాలని గచ్చకాయల్లో పొందుపరచి మానవాళికి అందించింది. గచ్చ కాయలు ఒక మొక్క యొక్క విత్తనాలు. ఈ విత్తనాలు బూడిద వర్ణంలో ఉండి గట్టి పెంకును కలిగి ఉంటాయి.

సంస్కృతంలో 'కుబేరాక్ష' అని పిలువబడే ఈ గచ్చ కాయలను ఆంగ్లంలో 'ఫివర్‌నట్' అని, హిందీలో 'కంటకరేజ' అని పిలుస్తారు. సిసాల్పినేసి అను వృక్ష కుటుంబానికి చెందిన దీని శాస్త్రీయనామం 'సిసాల్పీనియా బాండుక్'. ఈ ఔషధం ఆయా వ్యాధులను నిర్మూలించి సమర్థవంతంగా ఎలా స్వస్థతచే కూరుస్తుందో ప్రస్తుతం తెలుసుకుందాం.

**కళ్ళెదగ్గు తగ్గేందుకు:** గచ్చపప్పుపొడి, పిప్పళ్ళపొడి 10గ్రా॥ల చొప్పున తీసుకొని రోజు ఉదయం 1-2 గ్రా॥ల చొప్పున తగినంత తేనె కలిపి సేవిస్తూంటే కళ్లె సులువుగా బయటకు వచ్చి శ్లేష్మ దోషం తొలగి శ్వాసక్రియ మెరుగవుతుంది.

**మొలలకు:** గచ్చపప్పుచూర్ణంలో తగినంత కలబంద రసం కలిపి నూరి శనగ గింజలంత మాత్రలు చేసి, రోజు మూడుపూటల ఆహారం తరువాత మాత్రమింగి తగినంత నీరు సేవిస్తే మూల శంఖవ్యాధివల్ల కలిగే నొప్పి, మంట, దురద, పోటు లాంటివి తగ్గుతాయి.

**ప్రొస్టేట్ గ్రంథివాపుకు:** గచ్చపప్పు పొడి 40గ్రా॥లు, మిరియాల పొడి 10 గ్రా॥లు, ఇంగువను కొద్దిగా నెయ్యితో వేయించి చేసిన పొడి 5 గ్రా॥లు కలిపి ఉంచుకొని రోజు రెండుపూటల పూటకి 1-2 గ్రా॥ల పొడిని తగినంత తేనెతో కలిపి సేవిస్తే మూత్రానికి సంబంధించిన సమస్యలకు చక్కటి పరిష్కారం దొరుకుతుంది.

**బహిష్టునొప్పికి:** గచ్చపప్పు పొడి, పిప్పళ్ళు, మిరియాలు, శొంఠి పొడులను సమానంగా కలిపి ఉంచుకొని రోజు ఒకటి, రెండు సార్లు పూటకు ఒక గ్రాము పొడిని 50 మి.లీ. నీటితో కలిపి సేవిస్తూ ఉంటే త్వరగా ఆ సమస్య తగ్గుతుంది.

**మలేరియా:** ఇదే పొడిని రోజు 3సార్లు ఇదే ప్రమాణంలో 50మి.లీ. మజ్జిగలో కలిపి తీసుకుంటుంటే మలేరియాలాంటి వివిధరకాల జ్వరాలు తగ్గుతాయి.

**తేలుకాటుకు:** గచ్చపప్పును నీటితో నూరి తీసిన గంధాన్ని పట్టించి నిప్పుసెగ చూపిస్తే తక్షణమే తేలు విషం నిర్వీర్యమై మంట, పోటు, బాధతగ్గుతాయి.

**దంతధావన చూర్ణం:** గచ్చకాయపెచ్చులను కాల్చిచేసిన బూడిద, పోకచెక్కల బూడిద, పటికపొడి సమానంగా కలిపి ఉంచుకొని రోజు ఒకసారి దంతధావన చూర్ణంగా ఉపయోగిస్తే పంటి నొప్పులు తగ్గుతాయి.

**కీళ్ళనొప్పులకు:** 100 గ్రా॥ల వెల్లుల్లి రెబ్బలను మెత్తగా నూరి అందులో గచ్చపప్పు పొడి 50గ్రా॥లు, కరక్కాయల పొడి 50గ్రా॥లు, తానికాయల పొడి 50గ్రా॥లు కలిపి మెత్తగా నూరి బఠాణి సైజు మాత్రలు ఉదయం, సాయంత్రం ఒక మాత్ర చొప్పున రెండు పూటల సేవిస్తే వివిధ రకాల కీళ్ళనొప్పులు, కండరాల నొప్పులు, నడుము నొప్పి, భుజాలనొప్పి, మోకాళ్ళ నొప్పులు తగ్గి స్వస్థత చేకూరుతుంది.

**గర్భాశయగడ్డలు(ఫైబ్రాయిడ్స్), నీటి బుడగలు(పి.సి.ఒ.డి):** రోజు ఒకటి, రెండుసార్లు 200 మి.లీ. నీటిలో ఒక గచ్చకాయ లోని పప్పుపొడి, పొడపత్రి పొడి, నలగ్గొట్టిన 10మిరియాలను వేసి 100 మి.లీ. నీరు మిగిలేలా సన్నమంటపై మరిగించి దించి చల్లార్చి వడగట్టి ఒక టీ స్పూను తేనె కలిపి సేవిస్తుంటే సుగుణం కనిపిస్తుంది.



## తిరుమల శ్రీవారి తెప్పోత్సవాలు



తెప్ప అనగా పడవ, ఓడ. ఓడలో సుఖాసీనులైన శ్రీతిరుమల స్వామివారిని కోనేటిలో విహారం చేయించడమే తెప్పోత్సవం అంటారు. ఈ తెప్పోత్సవాలను తమిళంలో **'తిరుపల్లి ఓడై తిరునాళ్'** అంటారు. వీటినే తెలుగులో **'తెప్పతిరునాళ్లు'** అని అంటారు. ఈ సంవత్సరం తెప్పోత్సవాలు మార్చి 3 నుండి 7 వరకు జరుగుతాయి.

ప్రతిసంవత్సరం ఫాల్గుణమాసంలో శుద్ధఏకాదశినుండి పౌర్ణమివరకు ఐదురోజులపాటు తెప్పోత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఐదురోజులపాటు జరిగే ఈ తెప్పోత్సవాల్లో మొదటిరోజు (ఏకాదశిరోజు) సాయం కాలం 6 గంటలకు తిరుమల కోనేట్లో తెప్పలో శ్రీసీతారామలక్ష్మణులు మూడు ప్రదక్షిణలతో విహరిస్తారు.

రెండవరోజు ద్వాదశిరోజున శ్రీరుక్మిణీకృష్ణులు పుష్కరిణిలోని తెప్ప నధిరోహించి మూడుమార్లు ప్రదక్షిణంగా విహరిస్తారు.

ఇక మూడవరోజు త్రయోదశినాడు శ్రీదేవిభూదేవి సమేత శ్రీమలయప్పస్వామి తిరుచ్చినెక్కి మూడుమారులు ప్రదక్షిణగా విహరిస్తారు.

నాలుగవరోజు శ్రీదేవి భూదేవులతో కూడిన శ్రీవేంకటేశ్వర స్వామివారు ఐదుప్రదక్షిణాలున్ను, ఐదవరోజు ఏడుమార్లు తెప్పలో విహరిస్తారు.

## నాగులాపురం శ్రీవేదనారాయణస్వామివారి తెప్పోత్సవాలు



నాగులాపురం శ్రీవేదనారాయణస్వామివారికి ఈ సంవత్సరం ఐదురోజులు మార్చి 24 నుంచి 28వ తారీఖువరకు సూర్యసేవను చేసుకుంటారు. సాయంకాలం నాలుగైదు గంటలకు జరిగే ఈ సూర్యసేవలో ధ్వజస్తంభం, బలిపీఠం అడ్డురావు. సూర్య కిరణాలు తొలి రెండురోజులు పాదాలను, తరువాత నాభిని, చివరి రెండురోజులు ముఖారవిందాన్ని తాకి లేదా స్పృశించి సేవచేయడాన్ని చూడటానికి జనం విశేష సంఖ్యలో హాజరవుతారు.

ఈ సూర్యసేవకు తెప్పోత్సవాలు కూడా జరుగుతాయి. తొలిరోజు శ్రీసీతా సమేత శ్రీరామచంద్రస్వామికి, రెండవరోజు నుంచి 5వ రోజు దాకా శ్రీవేదవల్లీ సమేత శ్రీవేదనారాయణస్వామికి జరుగుతాయి. బ్రహ్మోత్సవాలు తిరుమల బ్రహ్మోత్సవాల క్రమంలోనే జరుగుతాయి. మత్స్యజయంతిని (24-03-2023) కూడా ఘనంగా జరుపుతారు.



## శ్రీకృష్ణామృతం..

*–'అనంత' కృష్ణసుందరి సత్తిరాజు, 99103 45794*


బంగారు తండ్రి శ్రీవేంకట నాయకా
భవసాగరమునుండి ననునీవు కాయవా
ప్రభుడంటినీ నిన్ను విభుడంటినీ
విడువకా నిను నేను వేడ్కొంటినీ

అర్చనల విధులేమి చే నైతినీ(య)
ఆచరణలోకూడ నే ఓడితీ
అనితరము నీనామం జపియించితీ
ఆ దివ్య పదములనే నే కోరితీ

ఉపవాస దీక్షలను విడనాడితీ
ఉద్దండ గురువులకై పోనైతినీ
ఉద్గ్రంథముల చదువ అలసించితీ
ఉద్బోధకుల కడకు పోనైతినీ

నా పిలుపు నిను చేర కాక్షించితీ
నినువీడి నేనెపుడు మననంటినీ
నీ కృపకై నేనిపుడు వచ్చియుంటినీ
నిను కొలువ అనంత నే కోరితీ

విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



## సజ్జనులహృదయం

మిరెపుగింజ చూడ మీద నల్లగ నుండు;
కొరికి చూడ లోన చురుకు మనును;
సజ్జను లగువారిసార మిట్టుల నుండు;
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** మిరెపుగింజ= మిరియపువిత్తనం; సజ్జనులు= మంచివారు; సారము= బలం, చేవ.

**భావం:** మిరియపుగింజ చూడడానికి పైకి నల్లగా ఉంటుంది. కొరికితే చురుక్కు మంటుంది. సజ్జనులలో సారం కూడ ఇదే విధంగా ఉంటుంది.

**వివరణ:** మిరియంగింజ నల్లగా ఉంటుంది. ఏదో సాధారణంగా ఉంది కదా అని కొరికామంటే కారంతో నోరు చుర్రు మంటుంది. మిరియపు గింజను చూస్తే దానిలో అంత కారంగుణం ఉందని తెలియదు. సాధుజనులు కూడ ఇంతే. పైకి సామాన్యులలాగా కనబడతారు. సామాన్యులు కదా అని వారిని పరీక్షిస్తే, అపుడు వారి సామర్థ్యం అర్థమవుతుంది. గొప్పవాళ్లు తాము గొప్పతనాన్ని ప్రదర్శించుకోరు. అలా ప్రదర్శించినవాళ్లు గొప్పవాళ్లు కాదు. నిరాడంబరంగా ఉండడం కూడా గొప్పతనమే. మిరియపుగింజలాగా, తమలో ఎంత వైశిష్ట్యం ఉన్నా, దాన్ని వేషభాషల్లో ప్రదర్శించరాదని తాత్పర్యం.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

# భాస్కర శతకం

\- మారన



ఆదరమింత లేక నరుడాత్మ
బలోన్నతి మంచివారికిన్
భేదము చేయటం దనదు పేర్మికి గీడగు;
మూలమెట్లమ
ర్యాద హిరణ్యపూర్వ కశిపున్
దనుజుండు గుణాఢ్యుడైన ప్ర
హ్లాదున కెగ్గు చేసి ప్రళయంబును
బొందడె మున్ను భాస్కరా!

నరుడు తనకున్న బలమును ఎంచి ఎదుటి వారిని తక్కువ చేసి తేడాలు చూపడం వలన వారి కీర్తిప్రతిష్ఠలకు హాని కలుగును. ఎట్లనిన పూర్వము హిరణ్యకశ్యపుడు అను రాజు మహాగుణవంతుడైన ప్రహ్లాదుని గేలి చేసి తన నాశనమును తానే కొని తెచ్చుకొనెను కదా!

వ్యాఖ్యాత – డా॥ పల్లేరు వీరాస్వామి



నరుడు, తనకున్న బలంతో ఎదుటివారిని తక్కువగా చూడరాదు

పాఠం-20

# సంస్కృతం నేర్చుకుందాం..!!

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య          నిర్వహణ- మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

फलम् = పండు-ను
तस्य = వానిది-కి-యొక్క
एतस्य = దీనిది-కి-యొక్క

तावत्पर्यन्तम् = అంతవరకు
एतावत्पर्यन्तम् = ఇంతవరకు
कियत्पर्यन्तम् = ఎంతవరకు

खाद् = తినుట వర్తమానకాలము

| | | |
|---|---|---|
| प्र. | खादति | = खादन्ति |
| म. | खादसि | = खादथ |
| उ. | खादामि | = खादामः |

### అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?

01) तस्य जनकः एतावत्पर्यन्तं कुत्रासीत्?
02) अस्मद्गृहे आसीत्।
03) तत्र किं करोति?
04) तत्र फलं खादति।
05) ते कियत्पर्यन्तं पाकं कुर्वन्ति?
06) एतस्य गृहं कुत्रास्ति?
07) यूयम् इदानीं किं कुरुथ?
08) वयं फलानि खादामः।
09) बालकाः अन्नं खादन्ति।
10) त्वं तस्य गृहे किं खादसि?

### అ) జవాబులు


01) వాని తండ్రి ఇంతవరకు ఎక్కడుండెను?
02) మా ఇంటి యందు ఉండెను.
03) అక్కడ ఏమి చేస్తున్నాడు?
04) అక్కడ పండు తింటున్నాడు.
05) వారు ఎంతవరకు వంట చేస్తారు?
06) దీని ఇల్లు ఎక్కడుంది?
07) మీరు ఇప్పుడు ఏమి చేస్తున్నారు?
08) మేము పండ్లను తింటున్నాము.
09) బాలకులు అన్నమును తింటున్నారు.
10) నీవు వాని ఇంటిలో ఏమి తింటున్నావు?


### ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) ఈ పండెవనిది?
02) ఇది నాది (నాయొక్క)
03) నీ చెంబులో నీరున్నదా?
04) నా చెంబే ఇక్కడ లేదు.
05) ఐతే మీరన్నమును త్వరగా తినుచున్నారేమి?
06) మా ఇంట్లో ఎవరును లేరు.
07) నేను మీకోసము వంటను చేసినాను.
08) వీరెందుకిక్కడ అన్నమును తినుచున్నారు?
09) వారింట్లో లేరట.
10) అందుకోసము నేనిక్కడ తినుచున్నాను.

### ఆ) జవాబులు

01) एतत् फलं कस्य?
02) एतत् मम।
03) तव कलशे जलमस्ति वा?
04) मम कलशमेव अत्र नास्ति।
05) तर्हि यूयं किमर्थं त्वरया अन्नं खादथ?
06) अस्माकं गृहे केऽपि न सन्ति।
07) अहं युष्मभ्यं पाकम् अकरवम्।
08) एते किमर्थम् अत्र अन्नं खादन्ति?
09) ते गृहे न सन्ति खलु।
10) तदर्थम् अहम् अत्र खादामि।


చిత్ర కథ
మత్స్యావతారం
కథ– శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు– శ్రీ కె.ద్వారకనాథ్
ప్రళయకాలంలో బ్రహ్మదేవుడు యోగనిద్రలో ఉన్నాడు. అంతలో ఆయన నాలుగు ముఖాలతో ఆవులించాడు. అప్పుడు ఆ నాలుగుముఖాల నుంచి వేదాలు జారిపడ్డాయి. అవి పసిపిల్లల్లా ఏడుస్తున్నాయి. ఆ ఏడుపు విని నీటి అడుగు నుంచి పైకి వచ్చాడు సోమకాసురుడు.
ఆఁ.. ఆఁ.. ఆఁ.. ఆఁ..
పిల్లల ఏడుపు.. ఎక్కడ... ఎక్కడ?
నీటి పైకి వచ్చి వేదాల్ని సోమకుడు దొంగలించాడు. వాటిని నీటి అడుగున దాచిపెట్టాడు. నిద్రనుంచి మేలుకున్న బ్రహ్మదేవుడు...
అయ్యో! నా వేదాలేవి? ఎవరు దొంగిలించారు?
సృష్టికార్యం ఆరంభించు అన్నాడు విష్ణువు. వెంటనే బ్రహ్మ...
వేదాలు లేకుండా సృష్టి చెయ్యలేను! ప్రభూ!
విష్ణువు యోగదృష్టితో గ్రహించాడు.
సోమకుడు దొంగిలించాడు బ్రహ్మ!
శ్రీహరీ! నేను సృష్టి ఎలా చెయ్యాలి? మార్గం చూపు!
ఈ తప్పుని సరిదిద్దుతాను బ్రహ్మ!



లోకకల్యాణం కోసం అవతరించిన వేదాల్ని స్వార్థం కోసం దొంగిలించటం అధర్మం.
ధర్మరక్షణకోసం.. విష్ణువు మత్స్యావతారం ఎత్తాడు.
వేదాల్ని తెస్తాను విధాతా! దిగులుపడకు. ఇదుగో వెడుతున్నాను...
జయం.. జయం శ్రీహరీ!
సోమకా! వేదాల్ని వెంటనే నాకు సమర్పించు. లేకపోతే యుద్ధం తప్పదు
చేపవి.. నువ్వు నాతో యుద్ధం చేస్తావా? నేను యుద్ధానికి సిద్ధం.. తలనీది.. మొండం చేపది.. నీ రూపం చిత్రంగా ఉంది.
ఇద్దరి మధ్య ఘోరంగా యుద్ధం జరిగింది. చివరికి చక్రాయుధంతో సోమకుని వధించాడు విష్ణువు.
బ్రహ్మా! వేదాల్ని స్వీకరించు. సృష్టిని ఆరంభించు..
అలాగే శ్రీహరీ!
వేదాల్ని స్వీకరించి విష్ణువుని భక్తితో కీర్తించాడు బ్రహ్మదేవుడు...
సర్వే జనాః సుఖినో భవన్తు!

బాలనీతి

# వివేక మార్గంలో.. నడవాలి

– 'ఉషశ్రీ'

మహావిద్వాంసుడు విదురుడు తన ప్రభువు అవివేకాన్ని వేలెత్తి చూపుతూ చెపుతున్నాడు.

ప్రభూ! ధనవంతుడున్నాడే వాడు హాయిగా సుఖ పడుతూ భోగమయ జీవితం గడుపుతూ తృప్తి పడకూడదు. పదిమందికి పెట్టి, పేదవారికి దానధర్మాలు చేస్తూండాలి. దానం చేసేటప్పుడు చిరాకుతో, విసుగుతో చెయ్యకూడదు. సంతోషంతో చేస్తే పుచ్చుకున్నవాడు కూడా ఆనందిస్తాడు. దానివల్ల మన పుణ్యం పెరుగుతుంది. అదే ధనానికి ఫలం.

వేదవేదాంగాలు శాస్త్రాలు చదివిన వారందరూ అందులో చెప్పిన సదాచారాలను తాము ఆచరించి ఎదుటివారికి బోధించాలి.

ఆత్మబలం ఉంటే ఎన్ని కష్టాలైనా ఎదుర్కోగలం. అదిలేనినాడు ఏ చిన్నకష్టం వచ్చినా క్రుంగిపోతాడు.

క్రోధాన్ని శాంతంతో జయించాలి. దుష్టులను మంచి మాటలతో మరలించాలి. లోభగుణం పోవడానికి దానగుణం అలవరచుకోవాలి. అసత్యాన్ని సత్యమే జయిస్తుంది.

అన్నిటికంటే లోభం మహాచెడ్డది. ఎందు కంటే.. ఈ ప్రపంచంలో ఉండే బంగారం, మణులూ, రత్నాలూ, ధాన్యాలూ, అన్నీ లభించినా ఇంకా ఏదో దొరకలేదని ఏడుస్తూనే ఉంటాడు లోభి. అందువల్లనే మానవుడు ముందుగా లోభగుణాన్ని విడిచి పెట్టా లంటారు.

శరీరంవంచి పనిచేసేవాడికి ఏ లోటూరాదు. సజ్జనులతో సహవాసం చేసేవానికి అపకీర్తిరాదు. వీరిద్దరూ సర్వసుఖాలూ పొందుతారు.


విద్యార్థులైనవారు సోమరితనాన్ని దరి చేర నివ్వకూడదు. వ్యామోహాలకు లొంగరాదు. విద్యాభ్యాస కాలంలో వినయాన్నీ, క్లేశసహనాన్ని అలవరచుకోవాలి. అప్పుడే విద్య అంటుతుంది.

కష్టపడిపెంచి, పోషించి, విద్యాబుద్ధులు నేర్పి, సంపదలన్నీ ఇచ్చిన తండ్రి మరణిస్తే, ఆ మరణించిన వాడి సిరిసంపదలన్నీ బంధువులు పంచుకుతింటున్నారు. పువ్వులూ, కాయలూ లేని చెట్లమీదికి పక్షులు కూడా చేరవు. అలానే మరణించిన వాడితో ఎవరూ పోరు. ఎటొచ్చీ వాడుచేసిన పుణ్య, పాపకర్మల ఫలం మాత్రం కూడా వెడుతుంది. కనుకనే దానధర్మాలు, పుణ్యకార్యాలూ చెయ్యాలని పెద్దలు చెబుతున్నారు.

మనం చెయ్యవలసిన పనులు మనం చేసుకుంటూ పేదసాదలను ఆదరంతో చూస్తుండాలి. గురువులయందు భక్తి కలిగి శ్రద్ధతో వారి బోధలు వింటూ, వారిని సేవించుకోవాలి. ఎప్పుడూ సత్యమే పలకాలి. అసత్యభాషణానికి అవకాశం ఇవ్వకూడదు. ధనవంతులు దానధర్మాలతో త్యాగబుద్ధిని ఎలా అలవర్చుకుంటారో, అలానే బలపరాక్రమాలు కలవారు ఎదుటి వారిని హింసించడానికి దానిని వినియోగించరాదు.

దుర్బలులకు సాయపడడానికే వీరులు కృషి చెయ్యాలి. అన్ని దానాల కంటే శ్రేష్ఠమైనది అన్నదానం. అదే కదా ప్రాణానికి ఆధారం. అలానే జీవితంలో ప్రధానమైనది "ధర్మ మార్గాన నడవడం." కాబట్టి 'రాజా! ప్రభువు వివేకమార్గంలో నడవాలి' అని విదురుడు ధృతరాష్ట్రునకు తెలిపాడు.

**నీతి: మంచిమార్గంలో నడవడాన్ని అలవరచుకోవాలి.**





అన్ని దానాలకంటే శ్రేష్ఠమైనది 'అన్నదానం'

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

నిర్వహణ: డా॥ అల్లాడి సంధ్య

## కదంబం

| షడ్విధగురువులు | షడ్విధకాలములు |
|---|---|
| 01) ప్రేరకుడు | 01) అబ్దము |
| 02) సూచకుడు | 02) అయనము |
| 03) వాచకుడు | 03) ఋతువు |
| 04) దర్శకుడు | 04) మాసము |
| 05) బోధకుడు | 05) పక్షము |
| 06) శిక్షకుడు | 06) దివసము |

## పిల్లలూ..జతచేయండి!!

| | |
|---|---|
| 1) ద్వారకా తిరుమల | అ) ఒడిసా |
| 2) కన్యాకుమారి | ఆ) తెలంగాణ |
| 3) ఉడిపి | ఇ) తమిళనాడు |
| 4) భద్రాచలం | ఈ) కర్ణాటక |
| 5) పూరీ | ఉ) ఆంధ్రప్రదేశ్ |

జవాబులు: 1-(ఉ); 2-(ఇ); 3-(ఈ); 4-(ఆ); 5-(అ)

## మీకు తెలుసా?

1) శ్రీవేంకటేశ్వరునిపై 32వేల సంకీర్తనలు వ్రాసిందెవరు?
2) 'కాంచీపూర్ణులని' ప్రసిద్ధి గాంచిన వైష్ణవ భక్తుని పేరు?
3) తిరుమల శ్రీనివాసుని బంగారు గోపురం పేరేమి?
4) తిరుమలలో మొట్టమొదట దర్శించుకోవలసింది ఎవరిని?
5) తిరుపతి నుండి తిరుమలకు నడకమార్గం ప్రారంభమయ్యేచోటు?
6) తిరుమలస్వామివారి సన్నిధిన ఉన్న 'గడప'పేరు?
7) శ్రీవేంకటేశ్వరుని తమిళంలో స్తుతించినవారిని ఏమని అంటారు?

జవాబులు:
1) అన్నమాచార్యులు
2) తిరుక్కచ్చినంబి
3) ఆనందనిలయం
4) వరాహస్వామిని
5) అలిపిరి
6) కులశేఖరపడి
7) ఆళ్వారులు

## కనుక్కోండి


ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

గో సు క్త దు భు
భ విం ల డు డు

జవాబు:
భక్తసులభుడు
గోవిందుడు

## చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...

# క్విజ్ 08

01) జ్ఞానాన్ని, బుద్ధిని, సంపదను ప్రసాదించేది ఎవరు? జ)..........

02) భృగుమహర్షి, ఖ్యాతి దంపతుల పుత్రిక ఎవరు? జ)..........

03) ఫాల్గుణమాసం శుక్లపక్షపౌర్ణమి రోజున ఎవరి జయంతి? జ)..........

04) 'క్షీరసముద్రరాజ తనయ' ఎవరు? జ)..........

05) దుర్వాసుని శాపం వల్ల ముల్లోకాల నుండి వెళ్లిపోయింది ఎవరు? జ)..........

06) శుచి, శుభ్రత, సరళత ఉన్న చోట ఎవరుంటారు? జ)..........

07) కేవలం సంపద ఉండి, అహంకారం ఉన్నచోట ఎవరు ఉండరు? జ)..........

08) క్షీరసాగరమథనంలో కామధేనువు, పారిజాతవృక్షం, చంద్రుడు, కాలకూటవిషం, అమృతం వచ్చిన తర్వాత ఎవరు ఆవిర్భవించారు? జ)..........

09) విశ్వావసు గంధర్వులు, అప్సరసలు ఎవరి ముందు గానం, నాట్యం చేశారు? జ)..........

10) కలియుగంలో పద్మావతిగా ఎవరు అవతరించారు? జ)..........

11) రామావతారంలో సీతగా అవతరించింది ఎవరు? జ)..........

12) వరాహావతారంలో భూదేవిగా అవతరించింది? జ)..........

13) శ్రీకృష్ణావతారంలో అవతరించిన రుక్మిణియే.... జ)..........

14) పెద్దలను గౌరవించేవారు, ఇంద్రియ నిగ్రహం కలవారు, నిత్యం సత్యం పలికేవారిపై ఎవరి అనుగ్రహం ఉంటుంది? జ)..........

15) దుష్కర్మలు చేస్తూ, దురలవాట్లు, బాధ్యతారాహిత్యం కల్గి ఉన్నవారి దగ్గర ఎవరు ఉండరు? జ)..........

## నియమనిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-03-2023.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కు సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వ బడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. వెతికి రాయండి.

చందాసంఖ్య: .......... వయస్సు: ..........

పాఠశాల: .......... తరగతి: ..........

పేరు: ..........

చిరునామా: ..........

..........

..........

.......... పిన్‌కోడ్: ..........

ఫోను నెంబరు: ..........

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

# మార్చి, 2023 రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** సమస్తదోషాలు తొలగి సకలైశ్వర్యాలు కల్గుతాయి. ఇంట్లో ఆనందకరమైన వాతావరణం ఉంటుంది. గృహంలో కల్యాణాది శుభశోభ వెల్లివిరుస్తుంది. రాహు కేతువుల జన్మరాశి సంచారంవల్ల కొంత అడ్డంకులుంటాయి.



**వృషభం–** ఆధ్యాత్మికత పెరుగుతుంది. మంచి విషయాలపట్ల అవగాహన కల్గి ఆనందాన్ని పొందుతారు. ఇతరులకు ఉపకారం చేస్తారు. చురుకుదనంతో వ్యవహరిస్తారు.



**మిథునం–** భయాందోళనలు తగ్గుట, ఆరోగ్యంగా ఉంటారు. ప్రయాణాలు కలసి వస్తుంది. అనవసర ఖర్చులను తగ్గించి ఆర్థిక సమతుల్యత పాటిస్తారు. కుటుంబవిషయాల్లో ప్రగతి కనబడుతుంది. సంతానం వృద్ధిలోనికి వస్తారు.



**కర్కాటకం–** ఆదాయవనరులు పుష్కలంగా పెరుగుతాయి. విద్యార్థులకు అనుకూల సమయం. దూరప్రయాణాలు కలిసివస్తాయి. విద్యా ఉద్యోగ విజయాలు వరిస్తాయి. సమాజంలో గౌరవం లభిస్తుంది.



**సింహం–** గ్రహస్థితి సామాన్యము, ఆరోగ్యం బాగుంటుంది. ఆర్థికంగా లాభపడతారు. కంపెనీ షేర్లలో పెట్టుబడులు పెట్టడం వల్లన అధిక లాభాన్ని పొందుతారు.



**కన్య–** గృహోపకరణ వస్తువులకు ధనము ఖర్చు చేస్తారు. విద్యలో రాణిస్తారు. ప్రతిభాపురస్కారములు లభిస్తాయి. ఉద్యోగానికై చేయు ప్రయత్నాలు ఫలిస్తుంది. శుభవార్తలువింటారు. వ్యాపారస్థులు అధికలాభాల బాటపడతారు.



**తుల–** భార్యాపుత్రులతో కలహాలు లేకుండా ఉంటారు. ఆదాయమార్గములు పెరుగుతాయి. వ్యవహార ప్రతిబంధకాలు ఉంటాయి. సుబ్రహ్మణ్య ఆరాధన చేయుట మంచిది. వృత్తి వ్యాపారాలు కలసివస్తాయి.



**వృశ్చికం–**అధికారవృద్ధి, వృత్తి ఉద్యోగాలు కలసి వస్తాయి. పశుసంపదవృద్ధి అవుతుంది. వ్యాపార వృద్ధి జరుగుతుంది. ఆరోగ్యంపై దృష్టి పెట్టండి. విద్యావిషయాల్లో పట్టు సాధిస్తారు. ఆదాయమార్గాలు పెరుగుతాయి.



**ధనుస్సు–** సదుద్దేశంతో చేసే మీ పనులు విజయవంతమౌతాయి. ఇతరులకు సహాయకారిగా ఉంటారు. విద్యావిషయాలు, ఉద్యోగాల్లో మీదే పైచేయిగా ఉంటుంది. ధనాన్ని ఖర్చుచేయడం మానుకోవాలి.



**మకరం–**ఈ నెలలో ఆదాయంతో బాటు ఖర్చూ పెరుగుతుంది. ధార్మికకార్యక్రమాల్లో పాల్గొంటారు. వృత్తివ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకోవాలి.



**కుంభం–** విద్యార్థులు శ్రద్ధాసక్తులతో కృషిచేసి పరీక్షలలో విజయం సాధిస్తారు. సంఘములో గౌరవమర్యాదలు పెరుగుతాయి. ధనకనక వస్తు వాహనములు కొంటారు. ఉద్యోగవిషయాల్లో పురోభివృద్ధిని సాధిస్తారు.



**మీనం–** గృహమున కల్యాణాది శుభకార్యాలు జరుగుతాయి. ఆరోగ్యవిషయాలు అనుకూలం. పుణ్య క్షేత్రాలు సందర్శిస్తారు. జన్మరాశిలో సూర్యుని సంచారంవల్ల కోపోద్రిక్తతలకు గురి అవుతారు. సంయమనం అవసరం.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

........................................ తేది : ....................

ప్రదేశం :

తేది :

చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 86

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ■ | 1 | 2 | | ■ | 3 | 4 | ■ | 5 |
| 6 | ■ | | ■ | 7 | ■ | | ■ | |
| 8 | | ■ | 9 | | | ■ | 10 | |
| | ■ | 11 | ■ | | ■ | 12 | ■ | |
| ■ | 13 | | | ■ | 14 | | | ■ |
| 15 | ■ | | ■ | 16 | ■ | | ■ | 17 |
| 18 | | ■ | 19 | | | ■ | 20 | |
| | ■ | 21 | ■ | | ■ | 22 | ■ | |
| ■ | ■ | 23 | | | ■ | | ■ | |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

### అడ్డం

1)భారతదేశంలో సరస్వతి(3);3)వైవస్వతమనువు కూతురు(2); 8)దక్షుని కూతురు(2); 9)ఇతని కోరికపై రాముడు భద్రాచలంలో వెలిశాడు(3); 10)సుగ్రీవుని భార్య(2); 13)విశ్వామిత్రుడు సృజించిన మంత్రం(3); 14)పిల్లన గ్రోవి(3); 18)జనని(2); 19)గరుత్మంతుని తల్లి(3); 20)అగ్రజుడు తమ్ముళ్ళకు ఏమౌతాడు(2); 23)సహదేవుని భార్య(3)

### నిలువు

2)'భారతి'పదంలో మన్మథుని భార్య(2); 4)విష్ణువు భార్య(2); 5)దుర్యోధనుని భార్య(4); 6) సావిత్రిదేవి వరము వలన అశ్వపతికి పుట్టిన కుమార్తె(3); 7)నాగమాత(3); 11)మేరువు కుమార్తె(3); 12)జమదగ్ని భార్య(3); 15)ఈ రాజు 12 సం॥రాలు నేతితో యాగం చేయుట వల్ల అగ్నికి మాంద్యము కల్గెను(3); 16)అత్రిముని భార్య(4); 17)శ్రీవేంకటేశ్వరుని పై 32 వేలకీర్తనలు వ్రాసిన వాగ్గేయకారుడు(4); 21)కవిత్వం చెప్పేవాడు(2); 22)శ్రీరాముని భార్య(2)

**జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.**

- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.


తిరుమల తిరుపతి దేవస్థానములు
03-03-2023
శ్రీ కోదండరామస్వామివారికి
తిరుమల శ్రీవారి తెపోత్సవం
2023 మార్చి 03 నుండి 07 వరకు
04-03-2023
శ్రీ కృష్ణస్వామివారికి
05 నుండి 07 వరకు శ్రీవారికి

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-02-2023 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

